
ఆంధ్రసచిత్రవారపత్రిక





"సైమరపు": శిల్పం
—ఫొటో: ఆర్. ఉదయభాస్కర్, రాజమండ్రి]



ఢిల్లీలో జానపదనృత్య సమ్మేళనకు వెళ్లిన హైదరాబాద్ బృందం.

సంవత్సర చందా రు. 13—0—0 విడిప్రతిక 25 న.పై.	Founder: K. NAGESWARA RAO విలంబి మాఘ శుద్ధ చతుర్థి బుధవారం	సంపుటము 53 సంచిక 20 **11-2-59**

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

విజయావారి 'అప్పుచేసి పప్పుకూడు'లో

సావిత్రి

రాజధాని కబుర్లు

పృథ్వీరాజ్ కపూర్

1958 వ సంవత్సరం 1938 వ సంవత్సరానికి ఇరవైఏళ్ళ 'దగ్గర'లో ఉంది. కాని ఈ రెంటికీమధ్య 1947 ఉండడంవల్ల, ముందుకు నడుస్తున్న దేశం' 47 లో మలుపు తిరగడంవల్ల, '58 సమస్యలకి, 38' సమస్యలకి సంబంధంలేకుండా పోయింది. దృక్పథాలు మార్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

1938లో ప్రధానసమస్య జాతిమత విభేదాలను రూపుమాపి, దేశంలో ఐక్యత సాధించడం; ఐక్యత సాధించి, బానిసత్వాన్ని బాపడం. దేశంలో వర్గాలెన్ని ఉన్నా, అవన్నీ ఐక్యమై విదేశపాలకు డిని పారదోలడానికి కృషిచేశాయి.

1947 లో విదేశీయుడు వైదొలిగాడు. 47 నుంచి '58 వరకు దేశంముందున్న సమస్య ఆర్థిక ప్రమాణాలను పెంచడం; పెంచిన సంపత్తిని ప్రజలందరికీ సాధ్యమైనంత సమానంగా పంచడం. సమాజాన్ని ప్రతిబింబించ దలచిన నాటక రంగం, సమాజంపై తన ప్రభావం ప్రసరింపదలచిన నాటకరంగం — దృక్పథాలలోని ఈ మార్పునుగమనించక రాణించ లేదు.

1947 కి పూర్వం, విదేశీయుని పతనం లో ఐక్యతాభావంతో మెలగిన వర్గాలమధ్య 1947 తర్వాత సంఘర్షణ ఉత్పన్నం కావడం సహజమైన విషయమే. ఏనాటి సమాజంలోనైనా కలంకలిగినవర్గాలుమూడుంటాయి. మొదటివర్గం కార్మిక వర్గం. రెండవది ధనికవర్గం.



పృథ్వీరాజ్ కపూర్

స్వయంకృషివల్ల సంపాదన పెంచుకోడానికి ఈ రెండువర్గాలకు చట్టబద్ధమైన అవకాశాలు సాధారణంగా వుంటాయి. ఈ రెండువర్గాల్లోను చట్టబద్ధం కాని అవకాశాలు వినియోగించుకోవాలనుకు నేవ్యక్తులుంటారు. ఈ వ్యక్తులే సాధారణంగా బలవంతులై ఉంటారు.

ఈ రెండువర్గాలు కాక మరోవర్గం ఉంది: అది ఈ రెంటి మధ్య నుంటుంది. ఈ వర్గంవారు డబ్బుదొరికితే కేపిటలిస్టులు, దొరక్కపోతే కమ్యూనిస్టులు అన్నట్టుగా ఉంటారు. మేధావు లెందరో ఈ వర్గంలో జన్మించినా, తెలివితేటలు ఉపయోగించు కొని పైవర్గానికో, ఉపయోగించుకోలేక క్రిందివర్గానికో వెళ్ళిపోతుంటారు.

ఈ మూడువర్గాలలో ఏవర్గపు దృక్పథం సమంజసం అన్నది ఇక్కడ అప్రస్తుతం. ఆర్థిక సామాజిక సాంస్కృతిక రంగాలలో ఈ విభిన్నవర్గాలమధ్య నిరంతరయూ ఉత్పన్నమౌతున్న సంఘర్షణ నమకాలీననాటకాలలో ప్రదర్శితం కావాలి.

ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం ఆధ్వర్యాన జనవరి 2 నుండి ఎగ్జిబిషన్ థియేటర్ లో జరిగే సాంస్కృతిక ప్రదర్శనలో పాలొనడానికి హైదరాబాదు వచ్చాడు శ్రీ పృథ్వీరాజ్ కపూర్. హైదరాబాదులో కపూర్ బృందం ఆడిన నాటకాల్లో 'పఠాన్', 'కిసాన్', 'పైసా', 'దీవార్', 'ఆహుతి' వంటివి ఉన్నాయి. 'సికిందర్' చిత్రం ఒకసారి చూసినవారు పృథ్వీరాజు విగ్రహాన్ని మరచిపోలేరు. శారీరకంగాను, మానసికంగాను ఇతరులను లొంగ తీసుకోగలిగిన మనిషి. పృథ్వీరాజ్. ధరించే పాత్రలుకూడా అంతే. అపాత్రలు నాటకంలో పాత్రలు కావు. ఆ నాటకాలు ఆ పాత్రలచుట్టూ కల్పించబడిన నాటకాలు.

పృథ్వీరాజ్ ధరించే పాత్రలు పరస్పరం విభిన్నమైన భావాలెన్నో ప్రదర్శిస్తాయి. నాటకం పూర్తయేలోగా నవ్వు, ఏడుపు; కోపం, తాపం; ప్రేమ, ద్వేషం — అన్నీ ప్రదర్శించబడవలసిందే. ఆ పాత్రల ననుసరించి ఉండే పాత్రలన్నీ బలహీనమైన పాత్రలు. నాటకం పూర్తయి, తెర క్రిందకు వచ్చేసరికి 'ఆహా! పృథ్వీరాజ్ ఎంతగొప్ప నటుడు!' అనిపిస్తుంది; అంతేకాని 'ఎంత అద్భుతమైన నాటకం!' అనిపించదు.

పేరుగన్న తెలుగు నటులుకూడా ఇదే విధంగా పేరు తెచ్చుకొన్నారు మన రంగస్థలంపై. ఈ విషయంమనం విస్మరించరానిది.

'దేముడు లేడూ! సత్యం జయించదూ!' అంటూ పసుపులేటి కన్నాంబ పిచ్చిగా పరుగెడుతూ నటించిన చిత్రం 'గృహలక్ష్మి', 'మాలలు మాత్రం మనుజులు కారా!' అంటూ ఎలుగెత్తి సూరిబాబు పాటపాడిన చిత్రం 'మాలపిల్ల', కొన్ని జమీందారీ ప్రాంతాల్లో నిషేధించబడిన చిత్రం 'రైతుబిడ్డ'. ఇవన్నీ ఇరవై సంవత్సరాల క్రితం ఆంధ్రప్రజలని ఉత్సాహంతో నింపాయి. కాని, ఆ చిత్రాలను 1958 లో ఎలా చూడగలుగుతాం? ఈనాటి సమస్యలు వేరు, దృక్పథాలే వేరు. అనాటివి వేరు.

'పఠాన్' నాటకం బాగుంది. చక్కగా ఉంది. 'దీవార్' కూడా బావుంది. కాని పఠాన్ ఇతివృత్తం హిందూ ముస్లిమ్ ఐక్యతా నినాదానికి ప్రాధాన్యం ఇస్తుంది. భారతదేశం అఖండ

★ "ప్రవీణ్" ★

★ రాజధాని కబుర్లు ★



ఎడింబరో ప్రభువు జనవరి 31 న మద్రాస్ వచ్చినప్పుడు స్వాగతం చెబుతున్న గవర్నర్ మేధీ.

మని, దాన్ని ముక్కలుచేసి పంచుకోడం తగదని 'దీవార్' ఉద్బోధ. ఏనాటి సమస్యలవి? ఏ విధంగా రక్తి కడతాయి యీ నాడు?

'పైసా' నాటకం ఇతివృత్తంలో నవ్యత వుంది. నవ్యతే కాదు—విశిత మైన పరిశీలనాదృష్టి ఉంది. స్పెక్యులేషన్‌లో డబ్బు సంపాదించిన మనిషిలో కరడుగట్టుకు పోయిన స్వార్థాన్ని చక్కగ ప్రదర్శించాడు. భార్య విషయంలో, కుమార్తె విషయంలో, కుమారుని విషయంలో, మిత్రుల విషయంలో అతి క్రూరంగా ప్రవర్తించిన స్వార్థం అతని విషయంలో అత్యంత సున్నితంగా మెలగడం ప్రదర్శించాడు.

కాని మిగిలిన నాటకాలలోవలెనే 'పైసా'లో కూడా అతిశయోక్తి ఎక్కువ. సంభాషణలు సహజంగా ఉండడంకంటె చక్కగా ఉండడం మేలు అన్నట్లు మాటాడతాయి పాత్రలు. అలౌకిక శక్తుల సహకారంతో కధ అంతమౌతుంది. తెర పడుతుంది. మళ్ళీ అదే ఆలోచన: 'పృధ్వీరాజ్ మహానటుడు. కాని నాటకం బాగుండలేదు!'

* * * *

పృధ్వీరాజ్ బృందం నాటకాలు విస్మయం కలిగించాయి ప్రేక్షకులకు; కాని ఉత్తమ ప్రదర్శనలను తిలకించడంవల్ల కలిగే ఆనందం కలగలేదు. వినా వారంరోజులు ప్రేక్షకులు అధిక సంఖ్యలో వచ్చి చూచివెళ్లారు అతని నాటకాలను. అతని నాటకాలు ఈ విధంగా ప్రజాదరణ పొందడానికి కారణం ఏమిటి?

పృధ్వీరాజ్ వెనుకటి తరానికి చెందిన ఆదర్శవాది. మహాత్మా గాంధీవంటి నాయకులు ప్రబోధించిన కొన్ని సత్యాలు ప్రచారం చేశాయి అతని నాటకాలు. పాకిస్తాన్ నిర్మాణం కాకముందు ప్రజలను ఎంతో ఆకర్షించిన ఇతివృత్తం అతని 'దీవార్'లో ఉంది. ముస్లింలీగు ద్విజాతి సిద్ధాంతానికి వ్యతిరిక్తమైన సిద్ధాంతం 'పఠాన్'లో ఉంది. ఒకనాటి రాత్రి అతడు నాటకానంతరం జోలె విప్పి ముష్టివాడులా గేటువద్ద నిలబడ్డాడు. ప్రజలు కనకవర్షం కురిపించారనడం అతిశయోక్తి ఔతుంది. కాని ఒకరినొకరు త్రోసుకుంటూ వాళ్లు అతనిజోలెలో నికెలునాణేల వర్షం కురిపించారంటే అతిశయోక్తి కాదు. అతడీవిధంగా బిచ్చమెత్తి సంపాదించిన ధనాన్ని హైదరాబాదు శిశు సహాయసంస్థకు దానం చేశాడు. ఆ సంసచుట్టూ తిరిగే సీతాకోకచిలుకలు ఎంతవరకు ఈ ధనాన్ని సద్వినియోగం చేస్తారో తెలియదు.

ప్రేక్షకుల ఆదరణకు మరో కారణం అతడు ఉపయోగించిన యాంత్రిక సాధనాలు. లైట్లను—ఫేడ్ లైటను, స్పాట్ లైట్లను, సైకులను, సెట్టింగులను అతడు ఏవిధంగా ఉపయోగించుకోవాలో ఆవిధంగా ఉపయోగించుకున్నాడు. నాటకం చూసున్న సంగతి ప్రేక్షకులు మరిచిపోయేటట్లు ఉపయోగింపబడాయి ఆయంత్రాలు.

ఆదర్శాచార్యులు వెంకట రంగయ్య:

సైన్సు ముందడుగు వేసినయుగం ఇది సహజంగా మనిషిలో మనిషి వెనుకాడే యుగం పరిష్కారసాధ్యంకాని సమస్యలు నానాటికి పెరిగిపోతున్నాయి ఆ సమస్యల సాధించగలిగిన శక్తి ప్రవృత్తులు గల మనుష్యుల సంఖ్య తగ్గిపోతూంది. ఈ పిగ్మీల యుగంలో సమస్యల బరువును మోయగలిగిన వ్యక్తులు కనపట్టంలేదు.

వంగిపోయి నడుస్తూన్న ఈ కాలపు మనుష్యులమధ్య నిరారుగా నిలబడిన వ్యక్తి కనపడితే, ప్రాణం లేచివస్తూంది. మాథ్యూ ఆర్నాల్డు స్కాలర్ జిప్సీనిగురించిన పద్యాలు జ్ఞప్తికి వస్తాయి.

ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య 75వ జన్మదినోత్సవం గతవారంలో మరేడీపల్లిలో జరిగింది ఎక్కడ సాంస్కృతిక సమావేశాలు జరిగినా: నాటకప్రదర్శనలు జరిగినా, శ్రీ మామిడిపూడి నేటికీ హాజరౌతారు. వారినిచూస్తే అనిపిస్తూంటుంది: 'వీరికి 75 సంవత్సరాలు నిండినమాట నిజమేనా?' అని.

అందులో సగంవయస్సుఉన్నవాళ్ళు గుండ్రటి భుజాలతో వంగి నడుస్తున్నారు రాజధానివీధుల్లో.

వారి జన్మదినోత్సవసందర్భంలో నగరంలో జరిగిన సభకు శ్రీ కురుగంటి సీతారామయ్య అధ్యక్షత వహించారు. విజయనగర వాస్తవ్యులు శ్రీ ఆకొండి వెంకటశాస్త్రి తాము రచించిన 'శ్రీవిజయం' అనే గ్రంథాన్ని ఆచార్యులకు అంకితం ఇచ్చారు. గౌహతీ విశ్వవిద్యాలయంలో రాజనీతిశాస్త్రాచార్యులు డా. వెంకటరావు వెంకటరంగయ్యగారిపేరట ఏటేటా ఒక బహుమతి నివ్వడానికి ఆంధ్రవిశ్వవిద్యాలయానికి 5 వేల రూపాయల విచ్చారని ప్రకటించబడింది.

ఈ సందర్భంలో ప్రసంగిస్తూ న్యాయమూర్తి శ్రీ సత్యనారాయణరాజు అధ్యాపకు లందరూ విద్యార్థులలో శ్రీ వెంకట రంగయ్య పద్ధతిలో మెలిగితే విద్యార్థుల సమస్యలు ఉత్పన్నమయేవి కావన్నారు. ఈనాటి విద్యార్థుల సమస్యలను పరిశీలించినప్పుడు, వెంకటరంగయ్యగారివంటివారు వెనుకటితరంలో ఎంతసేవచేశారో అర్థం ఔతుంది. ఈ సమస్యల పరిష్కార బాధ్యత విద్యార్థులదీ, రాజకీయనాయకులదీకాదు; అధ్యాపకులది కూడా.

నేరాలు: ఆరాలు

నగరపోలీసుశాఖలో నేరపరిశోధన విభాగపు డిప్యూటీ కమీషనర్ శ్రీ ఎస్ వేణుగోపాలరావు ఆ విభాగంనుంచి బదిలీఅయి, శాంతి భద్రతల విభాగపు ఆధిపత్యాన్ని స్వీకరించారు గతవారంలో. రెండుమూడు సంవత్సరాలుగా నేరపరిశోధనవిభాగంలో ఆయన, ఆయన అనుచరుల కృషి అందరికీ గర్వకారణం.


నేరస్థుడు చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తాడు. ఒంటిగా మసలుతాడు. అతని జాడలను పరిశీలించే రక్షకభట దళం వెనక ప్రభుత్వం, ప్రభుత్వానికి చట్టరీత్యా ఉన్న అధికారాలు ఉన్నాయి. ఐనా ప్రకృతి నేరస్థుడితో సహకరించినంతగా రక్షకభట శాఖతో సహకరించదు.

ఈ కారణాలవల్ల వంద నేరాలు జరిగితే ఏ ఇరవైమందో పట్టుబడతారు. మిగిలిన ఎనభైమందిని బంధింపలేకపోయిన పోలీసుశాఖను ప్రజలు నిందించడం సహజం. కాని ఆచరణలో పోలీసుశాఖ

(61-వ పేజీ చూడండి)

న్యూఢిల్లీ లేఖ

శ్రీకృష్ణ



ఫిలిప్ రాకుమారుడు; పునాది రాళ్ళు

ఇక్కడ ఉత్సవాలు, ఊరేగింపులు సమాప్తమయాయి. ఇక రాజధాని తన మామూలు కార్యకలాపాలలో నిమగ్నమైపోతుంది. రిపబ్లిక్ అవతరణ సమయ వార్షికోత్సవం సహజధోరణిలో, మామూలు పటాటోపానికి భంగం లేకుండా జరిగిపోయింది.

ఈ ఏడాది రిపబ్లిక్ ఉత్సవాల సమయానికి బ్రిటిష్ రాణిభర్త ఎడింబరో ప్రభువు మనదేశం రావడం పెద్దవిశేషం. ఆయనను మనదేశ పౌరులు అఖండ స్వాగత సన్మానాలిచ్చి ఆదరించారు. అయితే వారి రాక సందర్భంలో తీవ్ర ఆశాభంగం చెందిన వాళ్ళు కూడా లేకపోలేదు. ఎడింబరో ప్రభువు సంతకంకోసం తాపత్రయపడిన ఆటోగ్రాఫ్ వేటగాళ్ళవీరు. ఈ ఆటోగ్రాఫ్ వేటగాళ్ళు ఇకమీదనైనా స్వీయ ప్రయోజనంకోసం ఒక చిన్న 'ఫెడరేషన్' స్థాపించుకుంటే మంచిది. వీరందరూ ఒక సమాఖ్యగా ఏర్పాటైతే, దేశం చూడవచ్చే ఏ పెద్దమనిషీ వారి ఆటోగ్రాఫ్ పుస్తకాలలో సంతకం పెట్టకుండా తప్పించుకోడానికి వీలుండదు. సంతకాల సేకరణ అన్నది ఒక "జన్మహక్కు"గా తయారు కావడానికి వీలవుతుంది.

* * *

భారత రాష్ట్రపతిని తమదేశానికి ఒకసారి ఈ ఏడాదిలోగా రావలసిందని కోరే ఆహ్వాన పత్రాన్ని దేన్నీ ఫిలిప్ రాకుమారుడు తన భార్యవద్దనుంచి తీసుకురాలేదు. తరతరాలనుంచీ వస్తున్న సత్సంప్రదాయం ఏదైనావుంటే దాన్ని తు చ తప్పకుండా పాటించడంలో బ్రిటిష్‌వారికి బ్రిటిష్‌వారే సాటి. భర్తల తరఫున భార్యలు గాని, భార్యల తరఫున భర్తలుగాని వర్తమానాలు, సందేశాలు మోసుకువచ్చే రివాజు బ్రిటిష్ వారికి లేదు. రాష్ట్రపతికి ఏదైనా ఒక ఆహ్వానం పంపించదలిస్తే, బ్రిటిష్‌వారు దాన్ని మామూలు పద్ధతిలో అధికారవర్గాల ద్వారానే అందజేసారు.

ఇంతమాత్రంచేత రాష్ట్రపతికి ఆహ్వానమే దిరాదని భావించడం పొరపాటే అవుతుంది. ముందు ముందు ఆహ్వానపత్రం రావచ్చు; వచ్చిందే తడవుగా దాన్ని ఆమోదించడం కూడా జరుగుతుంది.

"ఆంధ్ర మహావిష్ణువు" రచయితకు సన్మానం

మొన్న రిపబ్లిక్ వార్షికోత్సవంనాడు జంషెడ్పూరు ఆంధ్రనాటక సాహిత్య సంఘంవారు ఆంధ్ర సచిత్ర వారపత్రిక స్వర్ణోత్సవ సంచికలో "ఆంధ్ర మహావిష్ణువు" ద్విపద కావ్యం వ్రాసిన శ్రీ వజ్ఝల కాళిదాసును అభినందించి బంగారపు ఉంగరం బహూకరించారు. సభకు శ్రీ బి వి నాథ్ అధ్యక్షత వహించారు. స్వస్థలానికి ఎంతో దూరాన వుండి, తీరికలేని పనితో జీవనం సాగిస్తూ కూడా శ్రీ కాళిదాసు ఉత్తమ రచనలద్వారా మాతృభాషాసేవ చేస్తున్నందుకు సభికులు ప్రశంసించారు. దైనందిన కార్యకలాపాలకు అన్యభాష వాడుకుంటున్నప్పటికీ, మాతృభాషను మరువకుండా, ఆంధ్ర సంప్రదాయాలను, ఆంధ్రత్వాన్ని నిలబెట్టుతున్నందుకు నాటకసాహిత్యసంఘాన్ని శ్రీ కాళిదాసు తమ సమాధానంలో అభినందించారు. తమకు జరిపిన సన్మానానికి కృతజ్ఞత తెలియజేశారు.

* * *

పునాది రాయి గొప్పదా, ఆ పునాది రాయిమీద నిర్మించే భవనం గొప్పదా అనే విషయమై సర్వత్రా వ్యాపించివున్న కొన్ని దురభిప్రాయాలను ఎడింబరో ప్రభువు బహు చక్కగా పటాపంచలు చేసివేయగలిగారు. దేశం స్వతంత్రమైన తర్వాత మొత్తంమీద ఈ పునాదిరాళ్ళ హడావిడి ఎక్కువే అయింది. శంకుస్థాపనోత్సవ కార్యక్రమం మన జాతీయ జీవన విధానంలో ప్రధాన భాగమైంది; ఈ కార్యక్రమాలను తలుచుకుంటే విసుగూ, అసహ్యం కూడా వేస్తోంది. అవకాశం దొరికితే చాలు అమాంతం ఏమంత్రినో ఆహ్వానించివెయ్యడం, కొంతభాగోతం ఆడించడం జరుగుతున్నది. చివరకు ఫోటోగ్రాఫుల ప్రదర్శనమైనాసరే పిలిస్తే చాలు, ఒకమంత్రిపుంగవుడు వచ్చి ప్రారంభోత్సవం జరుపుతాడు. ఎడింబరో ప్రభువు సరిగా ఈ ఆచారాన్నే ఎత్తిపొడిచాడు. ఒక కళాశాల ఘనత అది తయారుచేసే విద్యార్థుల ఉన్నత స్థాయినిబట్టి నిర్ణయమవుతుందిగాని, ఆ కళాశాల భవనానికి శంకుస్థాపనోత్సవం జరిపిన పెద్దమనిషి ఘనతనుబట్టి కాదని కుండబద్దలు కొట్టినట్లు అన్నాడు.

* * *

ఎడింబరో ప్రభువుకు పౌరసన్మానం మన సంప్రదాయాల ప్రకారమే జరిగింది. పలువురు ఢిల్లీ ప్రముఖులు ఆయన మెడలో పూలదండలు వేశారు. ఐదో ప్రముఖుడు సన్మానపత్రం చదివాడు; ఆరో వ్యక్తి బహుమతి అందజేశాడు; ఏడో వ్యక్తి ఫిలిప్‌కు కృతజ్ఞతాభివందనాలు సమర్పించాడు.

ప్రధాని నెహ్రూ, ఎడింబరో ప్రభువు

టూపు తెరిచిన కారులో నిలుచుని చాందినీ చౌకులోనూ, పాత ఢిల్లీ వీధులలోనూ ఊరేగారు. బ్రిటిష్ రాజవంశీకుడు చాందినీ చౌకులో ఊరేగడమన్నది నలభైఎనిమిదేళ్లకు సెలవుగా తిరిగి ఇప్పుడు జరిగింది. ఇప్పటి బ్రిటిష్‌రాణి రెండవ ఎలిజబెత్ తాత పంచమ జార్జి చక్రవర్తి ఎర్రకోటవదినుంచి బయలుదేరి రాజలాంఛనాల ప్రకారం ఊరేగుతూ చాందినీచౌకుకు వచ్చారు.

అలహాబాదునుంచి వెలువడే "పయినీర్" పత్రిక ఆనాటి ఊరేగింపు దృశ్యాన్ని ఈ విధంగా వర్ణించింది:

"రాజధానిలో ఇదొక మహాద్భుతదృశ్యం! చాందినీచౌకులో ఎక్కడచూసినా పతాకాలే! ఎటుచూసినా ఆహ్వాన తోరణాలే! శుభాకాంక్షల అక్షరమాలలే! ఇళ్లు, వాకిళ్ళు, దుకాణాలు అన్నీ దీపకాంతులతో కళకళలాడుతున్నాయి. అడుగడుగునా సంప్రదాయసిద్ధమైన ప్రాచ్యశోభ వెల్లివిరుస్తున్నది."

* * *


ఈనాడు ఎడింబరో ప్రభువు చేసినట్లే ఆనాడు పంచమజార్జి చక్రవర్తి కూడా ఒక శంకుస్థాపనోత్సవం జరిపాడు. న్యూఢిల్లీ నగర నిర్మాణానికి పునాదిరాయి వేశాడు. "పయినీర్" పత్రిక నాటి శంకుస్థాపనోత్సవ విషయం ఈ విధంగా వ్రాసింది:

"నేను ఈ పునాదిరాయివేస్తున్న పవిత్ర స్థలంలో ఏ మహాసౌధం విలసిల్లుతుందో ఇప్పుడప్పుడే చెప్పలేము. బహుశా ఇది భవిష్యత్ శాసన నిర్మాణానికి సభాసదులు కొలువుతీరే సభావేదిక కావచ్చు. ఇక్కడ నిర్మించేది గవర్నర్ జనరల్ నివాస భవనంగామాత్రం ఉపయోగపడదు. గవర్నర్ జనరల్ నివాస భవనాన్ని మరి కొంత ఎత్తయిన స్థలంలో నిర్మించాలి."

పంచమజార్జి శంకుస్థాపనోత్సవం జరిగింది ఈనాడు సెయింట్ స్టీఫెన్ కళాశాల భవనంవున్న దరిదాపులలోనే. పతాకధ్వజం పెట్టిన గోపురానికి నైరుతి దిక్కున వంద గజాల దూరంలో వుంది ఈ స్థలం. చివరకు జార్జిరాజు పునాదిరాయి వేసిన స్థలం వదిలివేసి, రైయిజినా కొండవద్ద కొత్త పునాది వేసుకోవలసివచ్చిన విషయం చాలామందికి తెలిసిందే. ఆ కొత్త పునాదిరాయి వేసిన చోటే ఇప్పటి కేంద్ర సచివాలయం వెలిసింది. అయితే, ఇప్పుడు ఎడింబరో ప్రభువు పునాదిరాయి వేసినచోట ఇంజనీరింగ్ కళాశాల భవనం తయారౌతుంది; దీని విషయంలో స్థలం మార్పేమీ జరగదు. మరో ఏడాదిలో కళాశాల భవనంకూడా తయారవుతుంది.

* * *

పార్లమెంటు బడ్జెట్ సమావేశం ఫిబ్రవరి 9వ తేదీ సోమవారంనుంచీ ప్రారంభం కాబోతున్నది. బడ్జెట్ సమావేశాలకుముందు మంత్రివర్గ ప్రతిష్టంభన ఏదో ఏర్పడబోతున్నట్లు వదంతులు ప్రచారం కావడం సహజమే కదూ.! అలాంటివే ఈ వారం కొన్ని పుకార్లు బయలుదేరాయి. వీటిలో కథానాయకుడు తిరిగి ఆర్థికమంత్రే! ఆర్థిక మంత్రి మొరార్జీదేశాయి తన పదవికి రాజీనామా ఇచ్చేశాడనే గత వారం ఒక వదంతి బయలుదేరింది. ఇది ఎంతవరకు వాస్తవమని విచారించగా శుద్ధ అబద్ధమనీ, రాజీనామా ఇచ్చే ఉద్దేశమే ఆర్థిక మంత్రికి లేదనీ తేలింది. ప్రధాని నెహ్రూకూ ఆర్థిక మంత్రి మొరార్జీకి మధ్య ఏవేవో ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తున్నాయన్న వార్తలు మాత్రం వినవస్తూనే వున్నాయి.



పి. వి. నరసింహారావు

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో కరీంనగరం జిల్లా సభ్యులు. స్వర్ణోత్సవ సంచికలో కాశీశ్వర దేవాలయంపై వ్యాసం వ్రాశారు.

ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు ఆర్థిక మంత్రి రాజీనామా గొడవకు సంబంధించినవేనని ఊహించడం పొరపాటే అవుతుంది. ప్రధాన మంత్రి ఇతర మంత్రులతో తరచూ ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూండడం మామూలే. వివిధ రాష్ట్రాల ముఖ్య మంత్రులకు కూడా ప్రధాని ప్రతిపక్షంరోజులకూ ఒక లేఖ వ్రాస్తుంటాడన్న విషయం కూడా అందరికీ తెలిసిందే. నాగపూర్ కాంగ్రెస్ మహాసభ సమాప్తమైన తర్వాత ప్రధాని నెహ్రూ మొరార్జీతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తున్న కారణంచేత వాటిలో ఏదో విశేషం వుండితీరాలని పలువురు ఊహించడం జరుగుతున్నది. నాగపూర్ కాంగ్రెస్ అనేక ముఖ్యమైన తీర్మానాలను ఆమోదించింది. ఆ తీర్మానాలను అమలుజరపగలిగిన సామర్థ్యమే వుంటే దేశదారిద్ర్యం ఇట్టే తొలగిపోతుంది. ఇవి చాలవేమోనన్నట్లు బొంబాయి సమస్యను తిరగతోడడం కూడా జరుగుతున్నది.

... ...

బొంబాయి సమస్య ప్రసక్తి తెస్తేచాలు మొరార్జీ దేశాయికి వళ్లు మండిపోతుంది. ఈ సమస్యను తిరగతోడవద్దని ప్రధానిని ఆయన గట్టిగా కోరినట్లు ఈమధ్య తెలియవచ్చింది. సమస్యను తిరగతోడే ఉద్దేశం తనకున్నట్లు నెహ్రూ ఎక్కడా సూచించలేదు. అయితే ప్రధాని నెహ్రూ ముమ్మూర్తులా ప్రజాస్వామ్యవాది అనే విషయం మరువకూడదు. బొంబాయి సమస్యను తేల్చవలసింది పార్లమెంటేనని ఆయన మొదటినుంచీ ఖండితంగా చెబుతూనే వున్నారు. ఈ వాదనను ఎవరు కాదనగలరు? సర్వస్వతంత్రమైన పార్లమెంటు అధికారాన్ని ఎవరు కాదనగలరు? పార్లమెంటును శాసించే అధికారం ప్రధానికేమున్నది?

... ...

నాగపూరు కాంగ్రెస్ మహాసభలో ఆర్థిక విధాన తీర్మానాన్ని ఆమోదించే ముందు ఆర్థిక మంత్రితో సంప్రదించి వుంటే బాగుండేదన్న వాదనలో కొంత సబబు లేకపోలేదు. దేశ ఆర్థిక సుస్థిరతను కాపాడవలసిన బాధ్యత ఆర్థిక మంత్రిదే కదా? రాజకీయ భద్రత, ఆర్థిక సుస్థిరత్వం ఇవి రెండూ కవలపిల్లలలాంటివి. ఇవి రెండూ పరస్పరాధీనమైనవి. దేశ ఆర్థిక భవిష్యత్తుపై ఏ ప్రధానమైన తీర్మానం ఆమోదించదలచినా ముందు ఆర్థిక మంత్రితో సంప్రదించడం అవసరమని కొందరి వాదన.

... ...

ఇప్పటి ఆర్థికమంత్రి మొరార్జీ కాంగ్రెస్ పార్టీ సభ్యుడే కాబట్టి ఈ వాదన కొంతవరకు సమర్థనీయమైనదనే అంగీకరించాలి. అయినప్పటికీ ఆర్థికమంత్రి బాధపడవలసిన అగత్యంలేదు. ఎందుచేతనంటే నాగపూర్ కాంగ్రెస్ తీర్మానాలను కేంద్ర ప్రభుత్వం విధిగా అమలు జరపాలని ఎక్కడా లేదు: అవి కాంగ్రెసు సంస్థ సిఫార్సులు మాత్రమే. ఇప్పటివరకూ పార్లమెంటు ఆమోదించిన శాసనాలన్నిటినీ పూర్తిగా అమలు జరిపితే భారతదేశం భూతల స్వర్గంగా మారిపోయి వుండేది. పార్లమెంటు శాసనాల సంగతే ఇలావుంటే, కాంగ్రెస్ తీర్మానాల విషయమై శంక పెట్టుకోవలసిన పనేమున్నది?

ప్రతి ఏనుగుకూ రెండురకాల పళ్లు వుంటాయి. వీటిలో ఒకరకం పళ్లు చూపులకుమాత్రమే పనికివచ్చేవి; రెండో రకం మేత మేయడానికి పనికివచ్చేవి. చూపుడుపళ్లు పైకి బహు అందంగా కనిపిస్తాయి. కాంగ్రెస్ తీర్మానాలుకూడా ఇలాంటివే. పైకి ఎంతో తీవ్రంగా కనిపిస్తాయి! ఇలాంటి కాంగ్రెస్ తీర్మానాలను చూసి ఆర్థికమంత్రి కలవరపడడం అనవసరం. పర్యవసానంగా ఆర్థికమంత్రి సహాయ సహకారాల మీదే ఈ తీర్మానాల అమలు ఆధారపడి వుంటుంది. "పటుబంధంతోన ఏ సమస్యనూ నీకై నీవు పైకెత్తుకు; ఆ సమస్యే నిన్ను పైకెత్తాలి" అనే సూక్తి చాలాగొప్పది. దీన్ని మరచిపోకూడదు. ఏదిఏమైనా మన ఆర్థిక మంత్రి తొందరపాటు మనిషి కాదు. ★

స్త్రీత్వంలో మాతృత్వం మూడమని వేదాలు శాసించాయి. ప్రాణికంతకూ మైన ప్రపంచమంతా సృష్టి స్వరూపిణియైన స్త్రీమూర్తి శక్తితోనే జీవిస్తోందని శాస్త్రాలన్నీ నిర్ణయించాయి. కాని మనుషులు మాత్రం వేదాలు వల్లిస్తూ, శాస్త్రాలు చర్చిస్తూ, స్త్రీ గౌరవంపై చిన్నచూపే విసిరేసున్నారు! మంచితనం కరుడుగట్టి, మానవత్వంతో పెన వేసుకుందిరి, ప్రపంచంలో మంచిని తప్ప మరేదీ చూడని స్నిగ్ధమంగళ స్నేహమయిన ఒక స్త్రీమూర్తి జీవితం, చిత్రంగా ఒక యువకుని జీవితంతో ముడిపెట్టుకొని, విషాదంతో అతన్ని లాలించి పాలించింది. ఇది కథ కాదు, కల్పనా కాదు; వినండి, నివేదిస్తా!

* * *

ఆ మహానగర వీధుల్లో విచిత్రమైన పేదరికానికి అలవాటుపడ్డ ఒక యువకుడు జీర్ణమైన మలిన వస్త్రాలతో, చెరిగి గాలికి చిందులాడుతూన్న తల వెంట్రుకలతో, కళాహీనమైన ముఖంచుట్టూ వున్న చిన్న మొలక గడ్డంతో, సభ్యత చెడి సంస్కారహీనమైన శరీరంతో, ఇటూ అటూ తూలుతూ నడుస్తున్నాడు. మిట్టమధ్యాహ్నం నడిమింట నడయాడుతున్న ప్రచండ మార్తాండుడు ప్రళయ కాలాగ్ని కీలలను ప్రపంచం మీద కుమ్మరిస్తున్నాడు. చెవులు చిల్లులు పడేట్టు శబ్దిస్తూ పెద్ద మోటార్లూ, చిన్న కార్లూ, నిర్విరామంగా పరుగెడుతున్నాయి. అనంతవాయువులో అగ్నిగుండాలను దాచి, మనుషులనే కాక, మంటినీ మింటినీ వణికిస్తూ వడగాడ్పులు వీస్తున్నాయి. కింద కాళ్ళు కాలిపోతూంటే, పైన నెత్తి మాడిపోతోంటే కోపగిలి చైతన్యరహితంగా సాగుతూన్న శరీరాన్ని మెల్లిగా కదిలిస్తూ, పేవ్‌మెంటుమీద నడుస్తున్నాడా యువకుడు. గతం గాయంచేస్తే, వర్తమానం బాధపెడుతూంది; భవిష్యత్తు భయంకర విషాదాన్ని సృష్టిస్తోంది. అతని అంతరాత్మలో, సభ్యత తెలియని సమాజం, సంస్కారంలేని మానవులూ, విషాదంతో వేడుకలాడే విధి,...యిన్ని ప్రతికూలశక్తులు ఏకమై అతని జీవిత చరిత్రను పవిత్రత ప్రక్కనుంచి బైటికి లాగేశాయి! అమాయికమైన అతని హృదయాంతరాళంలో అగ్నిగోళం పగిలి, ఆశయాలనూ, ఆశలనూ, కాల్చి మసిచేస్తున్నది. అతనిబాధ చెప్పుకుని, ఆదరణ సంపాయించుకుందుకు అపులెవ్వరూ లేరట. అందుకే ఆకాశవాణితోనే మొర పెట్టుకున్నాడు. అదుగో! శూన్యంలో సత్యాన్ని వెతుకుతూ, చూపుల్లో కన్నీళ్ళ కాలువలు పారిస్తూ, అనంత విజ్ఞానాన్ని ఆ దైన్యాకారంకింద దాచుకుని, ప్రపంచానికంతా పిచ్చివాడులా కనిపిస్తూ ఎలా తిరుగుతున్నాడో చూడండి! అతని జీవన 'జ్యోతి' యింకో అరఘుంటలో ఆరిపో-

'సంజీవని'

తూంది. ఈ లోపలే అతని శిథిల చరిత్రను మీ చెవుల్లో పడవేయడం సమంజసం.

* * *

అతనిపేరు బాబు నిజమైన పేరుతో నిమిత్తంలేదుగాని. ప్రపంచాన్నంతా పవిత్రం చెయ్యగల ఒక పునీతస్త్రీ ముద్దుగా పిలుచుకునే ముద్దుపేరది. ఆమెపేరు జ్యోతి. చీకటితెరలో చిక్కుకుని, అజ్ఞానగుహల్లో అల్లాడుతూన్న దీనమానవులకు, దివ్యకాంతిని ప్రసాదించేందుకు భగవంతుడు మనుషులమధ్య ఆమెను 'జ్యోతీరూపం'గా ప్రవేశపెట్టాడు. కాని, నీతి దూరమైన లోకం, నీచనికృష్టమైన అజ్ఞానం, భగవంతుని నిరక్ష్యంచేసి జ్యోతిలో పవిత్ర తేజస్సును చూడలేని గుడ్డితనాన్ని కొని తెచ్చుకున్నాయి. విలువైన వస్తువుపై చులకనభావం సృష్టి ఎందుకు కల్పిస్తుందో ఊహించలేము.

జ్యోతి కాలిత్రోవలోని కాంతిరేఖలు బాబుకళ్ళ నీళ్ళతో ఆడుకుని, అలసి అనంతంలోకి అంతర్హితమయ్యాయి. అతని అనురాగానికి ప్రతిగా ఆమె ప్రసాదించిన అమృత భాండం పగిలి, బ్రద్దలై పరియలు పరియలైపోయింది. ఏ విషాదానికి విలపించని బాబు ధీరహృదయం జ్యోతి తిరోధానంతో విలవిల లాడిపోయింది.

తెలుగుదేశంలో ఒక చిన్న పల్లెటూరిలో సామాన్య రైతుకుటుంబంలో జన్మించింది జ్యోతి. చిన్నతనంనుంచి భూతదయ ఆమెలో నందనోద్యానవనంలో కల్పలతలా ఎదిగింది. పవిత్రత ఆమె ప్రతిపరమాణువులో మంగళాయమానంగా మలచింది. సౌజన్యం, సౌశీల్యం, ఆమెగా మూర్తీభవించాయి... విధి వెక్కిరిస్తే. కాలచక్రపు కడగంటి చూపులు ఆ కుటుంబంపై కాలకూటవిషాన్ని కక్కుస్తే, నిరుపేదజీవనంతో నీరసిస్తున్న జ్యోతి తల్లిదండ్రులు జీవనోపాధికోసం పదారేళ్ళ పసిమి యౌవనంతో సౌందర్యానికి స్థాయిని సంపాదిస్తూన్న నవయౌవనమంగళాంగిని—జ్యోతిని తీసుకొని మహానగరం చేరారు. అమ్మాయి అందాన్ని, తెలివినీ, సినిమా జీవులచేతులో పెట్టి లక్షలు గడించమని ఎవరో హితోపదేశం చేశారట వాళ్ళకు!

* * *

కళ అంటే జ్యోతికి చిన్నప్పట్నుంచీ అపరిమితమైన ఆదరం, ఆసక్తి, సంగీత సాహిత్యాల్లో కూడా చక్కగా కృషి చేసింది. ప్రపంచం—అందులో సినిమా ప్రపంచమంటే యెలాంటిదో యేమీ తెలియని స్థితిలో తల్లిదండ్రుల కోరిక మేరకు జ్యోతి సినిమాల్లో వేషాలు వెయ్యడానికి అంగీకరించింది.

మహానగరం చేరిన కొన్నిరోజుల్లోనే సినిమా స్త్రీకి శీలసంరక్షణ దుస్సాధ్యమని గ్రహించింది జ్యోతి. అది నీతితో పూత పూసుకుని, నీచత్వంతో నిండిన దుర్వ్యాపారంగా తెలుసుకుంది. ఆమెలోని పవిత్రత ఆ అమాయికను అపాయమార్గాన్నుంచి ప్రక్కకు తిప్పింది. ఆమెలోని సౌశీల్యం ఆ పంకిలంనుంచి బైటికి రప్పించింది. కళలంటే భగవంతుని కమనీయ స్వరూపాలని ఆమె గాఢవిశ్వాసం. నీతిబాహ్యమైన క్షుద్రత్వానికి కట్టుబడిన కళామతల్లికి కన్నీటితో అభిషేకం చేసింది. తల్లిదండ్రులూ, శ్రేయస్కాములమనీ చెప్పుకు తిరిగేవాళ్లూ ఎందరు చెప్పినా సినిమాల్లో వేషం వెయ్యనంది.

ఇరవై యేళ్ళయినా నిండని ఆమె యౌవన మాధుర్యంచుట్టూ ప్రపంచాన్నంతా పాలించగల మాతృత్వమాంగల్యం నవనవో

శ్యమంగా వనలెత్తింది. శృంగారమైన కాంతితో, బుసలుకొడుతూ పరువకిశోరమైన ప్రణయలోకం పడగవిప్పి ఆమెచుట్టూ తిరిగేందుకు సిద్ధమైంది. ఆమె లోకంమీద అమృతబిందువుల్ని చిలికిస్తే, లోకం ఆమెమీద విషకుంభాలను కుమ్మరించింది! మనుషుల్ని ఆమె ప్రేమిస్తే, మనుషులు ఆమెను ద్వేషించారు. ఎందుకో? ఎవరైనా చెప్పగలరా? చెప్పితే వినగలరా?

* * *

ఒక రోజు సాయంత్రం-సంధ్యాదేవి, జాజిపందిరిచాటునుంచి కాంతిసందేశాన్ని వినిపిస్తూంటే, పుస్తకం చేత్తో పట్టుకొని యోగనిద్రలో వున్న విశ్వకన్యలా అరమోడ్పు కళ్ళతో ఆలోచిస్తూ మల్లెపాదుల ప్రక్కగా కూర్చొనివుంది జ్యోతి. పరిసరాలూ, ప్రదేశాలూ, ఆమెలో వికటాట్టహాసం చేస్తూ కల్లోలాన్ని రేకెత్తిస్తున్నాయి. ఎంత ఆలోచించినా జీవితమంటే అర్థం కావటం లేదు ఆమెకు. తనలో అందంవుంది, కళవుంది; ఈ అందాన్నీ, కళనూ, గౌరవంగా వినియోగించుకునే వ్యక్తులేలేరు. సంపాదించి పెట్టలేదని ఇంట్లో అందరికీ దిగులు. పాపం! తనమీద ఎంతో ఆశపెట్టుకున్న తల్లిదండ్రులకు తనేమీ సహాయం చేయలేకపోతూంది. ఈ సినిమా వ్యవహారం ఇంత కశ్మలంతో పెరుగుతున్న వ్యాపారమని తెలిసే వుంటే, ఇంటినుంచి కదిలేదే కాదు సినిమాలో నీతిగా బ్రతికేవాళ్లున్నా చెడిపోయినవాళ్ళ కిందే లెక్కగడుతుంది లోకం. తన్ను గురించి తన గ్రామం, తనచుట్టూ తిరుగుతూన్న మనుషులూ, ఎలాంటి సంకుచిత భావాలలో వున్నారో తనకు తెలుసు. ఏపాపిష్ఠి పని చెయ్యకుండానే సంఘం తనమీద అవినీతి ముద్రల్ని వేయడానికి ఎదురుచూస్తోంది. జీవన్మరణ సమస్యలో చిత్రమైన యీ జీవితాన్ని పవిత్రంగా గడపడం ఎట్లాగ? తనలో లలితకళలన్నీ పాపానికి భయపడి, ప్రక్కకి తొలగి పారిపోతున్నాయి ఒక్క సాహిత్యం తప్ప తనకేది గౌరవప్రదమైన కళగా కనిపించడంలేదు. తనలో సాహిత్య తృష్ణ ఇంతగా ప్రబలడానికీ, బలంగా తన జీవితంపై సాత్విక ప్రభావాన్ని సత్యనిష్ఠనూ చాటించడానికీ కారణమౌతాడు బాబు!

* * *

హఠాత్తుగా జ్యోతి ఆలోచన బాబుమీదికి మళ్లి, సుగంభీరమైన మూకఘోషతో చలించిపోయింది 'ఈ విచిత్ర బాధల్లో బాబాకే వుంటే'—అనుకుంది మనస్సులో. తనజీవితంలో బాబు చూపే మహోన్నత ప్రేమకు విశిష్టమైన విలువ నిచ్చింది. ఆ ప్రేమ ఏమిటో ఆమెకూ అంతుపట్టదు! అతనికీ అంతుకాదు! సినిమాల్లో వేషాలు వేయబోయే రోజుల్లో - తనువ్రాసిన ఒక పుస్తకాన్ని చదివి తన్ను చూడడానికి మద్రాసుకొచ్చాడు బాబు. సాహితీపరులు చాలామంది తనకు పరిచయమయ్యారు కాని, బాబులాగా హృదయంలో నిలిచినవాళ్లులేరు. పుస్తకాలనుగురించి, కవిత్వాన్ని గురించి, ప్రపంచాన్ని గురించి, ఆరోజు సంభాషణ సాగిపోయింది. ఆ సంభాషణలోనే నిర్మలమైన యిద్దరి మనోమందిరాలలో ప్రేమదేవత చేయొత్తి దీవించింది. భౌతిక బంధములకూ, లౌకికలోలతకూ, ఉన్మాద పరవశతకూ, అతీతమైన ఆధ్యాత్మిక ప్రేమ అనంతమై కాలంలో పొంగిపోయింది. అంతే - తెలుగుదేశాన్నుంచి వారానికోసారి వచ్చి తన్ను చూసి తనపాదాలతో అదుకొని పోతూండేవాడు. విద్యాధికుడూ, ఉన్నత వంశీకుడూ, నిశీంచివయసులో తనకన్నా ఒకటిరెండు సంవత్సరాలు పెద్దవాడూ అయిన బాబు తనపాదాలను నుదుటికి సోకించుకొనడంవల్ల తనకు బాధకలిగినా, అతని చిత్తశుద్ధిని చూసి ఏమీ అనలేకపోయేది తను. 'నాలో ఏం చూసి యీ పిచ్చిపని చేస్తావయ్యా?' అని తను ఒకసారి అడిగితే 'చాలామంది మాతృశ్రీలను చూసి' అని సమాధానం చెప్పాడు బాబు. ఈమాట తనచెవుల్లో అప్పటినుంచి అమృతబిందువుల్ని చిలికిస్తూనేవుంది. ఇంట్లో ఎవరేమనుకుంటారో అనే సందేహంకూడా లేకుండా ఎప్పుడైనమైతే అప్పుడు తన పాదాలమీద వ్రాలి కళ్లను కౌగలించుకుంటాడు. ఇంత పవిత్రమూర్తిపై ప్రపంచం పాపాన్ని రుద్ద



"చాటుమాటు"

—చిత్రకారుడు: యం. డి. నెల్సన్]

★ కన్నీరు ★

పోతూంటే, అన్నబాధ విపరీతమైతే ఆ బాధను తట్టుకోలేక తన పాదాలనీడలో తల దాచుకుంటాడట. ఎంత పిచ్చివాడు తన బాబు?...ఈమధ్య బాబు జీవితం కూడా అనుకోని పరిణామానికి అంకితమైంది. చదువుల్లో, డిగ్రీల్లో యేమీలేదని చదువు మానేశాడు. పెళ్లి విషయంలో పెద్దవాళ్లకూ, తనకూ మధ్య పెద్ద గొడవలు జరిగాయనీ, అశాంతిని భరించలేక ఎక్కడికో వెళ్లిపోయేవాడనీ, నెలరోజుల క్రితం బాబు రాలేదు బాబు. ఎక్కడున్నాడో! ఏంచేస్తున్నాడో! చిన్న వయస్సులోనే మహోత్కృష్టమైన కవితా సరస్వతి అతని చేయిపట్టింది! మనుషుల్ని నమ్మడంతప్ప, మరేమీ చేతగాని తనలాగే, తనబాబూ జీవితసమస్యలో చిక్కుకొని ఎక్కడో దిక్కులేని వాడిలా తిరుగుతున్నాడేమో! తమ యిద్దరిలోవున్న కళాశక్తి నీచానికి దగ్గరగా రాలేకపోవడంవల్ల, నిరుపయోగంగా మరుగుపడి పోతోంది. ఇంట్లో జరుగుబాట్లూ, యేమీ సంపాదించడం లేదనే ఈ సణింపులూ, ఇవేవీ లేకుండా తనబాబు తన దగ్గరవుండి ఇదరూ అలా సాహిత్య రసపిపాసలో లీనమైపోతే ఆహా ఎంత సంతోషంగా గడుస్తుంది జీవితం! పెళ్లిచేసుకొని, పిల్లల్ని కనాలనే వాంఛ తనలో ఉదయించనేలేదు. వేయిపసిపాపల పెట్టుతనబాబు–తన పాదాలమీద వ్రాలి నిద్రపోయే తన గారాబు 'బాబి' లేడూ? 'బాబీ!' అని ముద్దుగా పిలిస్తే, తక్షణం కాలిగ్రవేళ ముందు వ్రాలేవాడు! ఇప్పుడెక్కడున్నాడని పిలుస్తుంది?...'బాబీ'–! కళ్లనీళ్లు చీర కుచ్చిళ్లపై కారి పోతూంటే, కరుణావిహ్వలంగా, జాలిగా, తనలో తనే గొణుక్కుంది!

* * *

'ఓ....' అన్న పసివాడి గొంతూ, పదధ్వనీ వినిపించి తలెత్తి చూసింది. మల్లె పొదల సందుల్లోంచి రెండు పవిత్రహస్తాలు దీనంగా వొణుకుతూ వొచ్చి జ్యోతి రెండు పాదాలనూ – పట్టుకున్నాయి! బాబు!! తన పిలుపుకోసం ప్రతి పరమాణువులో సూక్ష్మరూపం ధరించి వున్నాడా? ఆ ద్రిక్తానందంలో అక్కరి బిక్కరవుతూ చేతుల వైపు చూసింది. ఉంగరం ధరించే వ్రేలూ, వాచీ కట్టుకునే మణికట్టు, తెల్లని గీరలతో, ఒకప్పుడు ఈ వ్రేలు వుంగరం పెట్టుకునేదనీ, ఈ చేయి వాచీ కట్టుకొనేదనీ సూచిస్తున్నాయి. ఈ చేతులుచూడడానికే ఇంతగా పాలిపోయి వున్నాయి– మనిషెంత మారిపోయాడో అనుకుంది. మల్లెపొదల ప్రక్కకు తిరిగి చేతుల్తో గ్రుచ్చి ఎత్తుకుని దగ్గరగా కూర్చోబెట్టుకుంది బాబును.

"ఎక్కడెక్కడ తిరిగొచ్చావు బాయనా!"

"ఎక్కడెక్కడ నీప్రేమ కనిపిస్తుందోనని లోకమంతా వెదికి వొచ్చాను."

"ఎక్కడ కనిపించిందేం?"

"ఇందుగల దందు లేదని చెప్పగలనా? ఎక్కడబడితే అక్కడే..."

ఇద్దరి నవ్వులకూ జాజిపందిరిమీది చిలుకలు లేచి పరుగెత్తాయి. విషాద సమయాల్లో కూడా విడువలేనివింత హాస్యం వాళ్లిద్దరి జీవితాల్లో ఒక ప్రత్యేక విశేషం.

"ఇలా అయ్యావేం బాబూ? చిన్న చిన్న గృహ కల్లోలాలకు కలతపడి, గోరంతను కొండంత చేసుకుంటే ఎలా? నీజాడ తెలీక ఇంటిదగ్గర ఎంత గాభరా పడుతున్నారో!"

"ఇంతకంటే మంచిమాటలేం దొరకలేదా?"

"దొరికినాయి. లే—ముందు స్నానం చెదువుగాని. పూజ అయింతర్వాత నీతో చాలా విశేషాలు చెప్పాలి" అంటూ లేచింది జ్యోతి.

బాబుకూడా ఆమె ననుసరించాడు.

* * *

నెలరోజులు గడిచాయి. ఈ నెలరోజుల్లో బాబు సాన్నిహిత్యంతో జ్యోతి మానసికంగా మార్పు సాధించి, కాంతి దీపిని తన చుట్టూ ప్రసరించుకుంటోంది. ఈ నెల రోజుల్నుంచీ, సినిమాల్లో వేషాలు వెయ్యమని అడగడానికొచ్చేవాళ్ళూ, అభిమానం చూపించడానికొచ్చేవాళ్ళూ, రకరకాల మనుషులు, రకరకాల మనసుల్తో ఆ యింటి గుమ్మం ఎక్కుతున్నారు; దిగుతున్నారు. ఒక్కరితోనైనా మాటాడకుండా, అసలు కనిపించకుండానే పంపించింది అందర్నీ.

వేళకు పూజ ముగించుకోవడం, సంస్కృతం, ఆంగ్లము, తెలుగు భాషలోని తత్వశాస్త్రాలనూ, ధార్మిక గ్రంథాలనూ, బాబు చదువుతూంటే వినడం; ఈ రెండు కార్యకలాపాలతోనే రోజంతా వెళ్ళబుచ్చడం ఆమెకు పరిపాటైపోయింది. అలా చదువుతూ, అర్థాలు చెప్తూ, ఆమె పాదాలపై నుదురు సోకించుకుంటూ ప్రపంచాన్నే మర్చిపోవడం బాబుకు అలవాటైంది. మరికొన్ని రోజులు గడిచాయి. ఒకరోజు కొన్ని గొంతుకలు రహస్యంగా మాట్లాడుకొంటూంటే బాబు చెవుల ఆ మాటలు విని—మనస్సును బాధపెటినయి. వాళ్ళ సంభాషణలోని సారాంశం తనకూ సబబుగానే తోచింది. అవును మరి. ప్రేమిస్తూ, జ్యోతికి బైటి బాధలేవీ లేకుండా చూసుకోవాలిగాని, అస్తమానం ఆ పుస్తకాలు చదవడం, ఆ కాళ్ళు పట్టుకోవడం, వీటివల ప్రయోజనమేమిటి? జ్యోతిని కలతపెట్టే కష్టాలు ఇంటి విషయాలే. ఇంట్లో కావాలిసినంత డబ్బు తెచ్చి పడేస్తే, ఇతరమైన చింతలేమీ వుండవు. తను డబ్బు సంపాయించాలి. సంపాయించి తన జ్యోతి భవిష్యత్తును భద్రం చెయ్యాలి... తను డబ్బు సంపాదనకు ప్రారంభించాలంటే, మనస్సును ముందు పగం చంపుకోవాలి. సినిమాలకు కవిత్వం వ్రాసి సంపా

(55-వ పేజీ చూడండి)

విడివడని బంధం

నేను రోజూ అదే బస్ స్టాపుదగర బస్ కోసం వెయిట్ చేస్తుంటాను. సరిగ్గా అతనూ అదే సమయానికి అదే బస్ స్టాపుదగ్గరకు వస్తూంటాడు. నేను వెళ్ళడం ఆలశ్యమయినా అతను నేను వెళ్ళేవరకు బస్‌లు ఖాళీగావున్నా ఎక్కక నేను వెళ్ళేవరకు ఎదురుచూస్తూంటాడు. అతనికి నా మీద 'ఏదో' వుండి ఉంటుందనుకొన్నాను నేను మాత్రం అతనికోసం ఎదురుచూడక బస్ రాగానే వెళ్ళిపోయేదాన్ని. ఆ సమయంలో అతనేం జేసేవాడో పాపం, కొంత బాధపడి వుండేవాడు. సాధారణంగా నాకంటే ముందుగనే ప్రతిరోజూ అతనక్కడకు వస్తూండేవాడు. ఇదంతా నేను గమనిస్తూనే ఉన్నాను. అతను కూడా నేను గమనించాలని ప్రయత్నిస్తున్నాడని తెలుసుకొన్నాను. నేను అతన్ని చూచీచూడనట్లు పోతుండేదాన్ని. అతను ఎప్పుడు చక్కా ముస్తాబై ఉండేవాడు. నెక్టయ్ కట్టుకొనేవాడు, రకరకాల టోపీలు ధరిస్తూ వుండేవాడు నన్ను ఆపాదమస్తకం పరిశీలించందే అతను తృప్తి పడేవాడు కాదు కాబోలు. నేను ఇవన్నీ చూచీ చూడనట్లుగా వుండేదాన్ని. అతనంటే నాకెందుకో ఏదో ఒకవిధమైన 'ఇది' కలుగుతూ వచ్చింది అతనీ అవస్థ అంతా ఎందుకు పడుతున్నాడో నాకు చూచాయగా అర్థం అవుతూవచ్చింది. బస్ ఎక్కినతరువాత సరిగ్గా నాకెదురు సీటులో కూర్చొనే వాడు. అప్పుడుకూడా నాయందే అతని దృష్టి. చూచేవారేమైనా అనుకొంటారనుకొని గ్రహించి అప్పుడప్పుడు ఏమీ ఎరగనట్లు, నంగనాచివలె ప్రవర్తించేవాడు. నేను అతనికంటే ముందుగనే బస్ దిగిపోయేదాన్ని. నేను దిగిపోతూంటే అతని మొహంలో కొంత మార్పు వచ్చినట్టు తేలిగా పరిశీలించినవారికెవరికైనా కనిపించేది. బస్ కదలినతరువాతకూడా నేను కనుమరుగైపోయేవరకు చూస్తూండేవాడు. కళ్ళకైనా బాధ కలుగుతుందని ఆలోచించేవాడు కాదు. అతనికి నాయందుండే 'ఇది' ఎంతవరకు నిజమైందీఅని, అసలు నేనంటే ఎందుకో అంత 'ఇది'అని అనుకొనేదాన్ని.

అతను ఏదో ఆఫీసులో పనిచేస్తున్నట్టుగా అతని చేతిలోని ఫైళ్ళనుబట్టి అనుకొన్నాను. బహుశా అతను నన్ను పంతులమ్మగా ఊహించి ఉంటాడని అనుకొంటాను.

ఒకనాటిరాత్రి సినిమాకు నేనొక్కదానినే వెళ్ళడం సంభవించింది. అతను జ్యోతిష్కుడులాగున్నాడు,'నాకంటే'ముందుగనే అతను హాలులో ప్రత్యక్షమైనాడు. ఇంకొక చిత్రం ఏమిటంటే నేను వెళ్ళే క్లాసుకూడా అతనికి తెలిసిపోయింది. నేను హాల్లోకి వెళ్ళడంతో నే నన్ను చిరునవ్వుతో ఆహ్వానించిందతడే. సీటేవీ ఖాళీగా లేవు. సరిగ్గా అతని ప్రక్కనే ఒక సీటు ఖాళీగావుంది. ఇంకా సినిమా బిగిన్ చెయలేదు. స్లయిడ్స్ వేస్తున్నారు తిరిగి పోవాలనుకొన్నాను. నా బలహీనతకు నాకే నవ్వు వచ్చింది. ఎందుకు పోవాలి తిరిగి నేను? వెంటనే ఒక ప్రశ్న ఎదురయింది. తిరిగి పోలేకపోయాను. అప్రయత్నంగా అతని ప్రక్క ఖాళీ కుర్చీలో కూర్చుండిపోయాను. అతను ఒక్కసారి

కౌసనం మహేశ్వరరావు

స్టైయి సదులు చేసుకొన్నాడు. ఒక చిలిపి హాసం చేశాడు, నావంక ఓరగా చూస్తూ. ఈ ఒక్క సీటు ఖాళీగూడా ఈతని ప్రభావమేనని తెలుసుకొనడానికి ఆట్టేసేపు పట్టలేదు. నాకోసం రిజర్వుచేసి సీటుకు కాపలాకాచినందుకు ఒక చిరునవ్వుతో అతను పడిన శ్రమకు సానుభూతి చూపాను. పాపం ఎందుకీయన కింత అవస్థ? ఆయనెవరు? నేనెవరిని? ఒక అపరిచిత వ్యక్తికోసం! ఆ అపరిచిత వ్యక్తికోసం...ఆ వ్యక్తిఅంటే అతని కెందుకీ 'ఇది'? ఇవే ప్రశ్నలు, ఇవే ఆలోచనలు. సినిమా మొదలు పెట్టారు. సినిమా చూస్తున్నానేగాని ఆలోచనలన్నీ అతన్ని గురించే. అతనుకూడా సినిమా చూస్తున్నట్లులేదు. అతని దృష్టి అంతా నామీదే. నా చేతి రుమాలా అతని కుర్చీలో ఎలా వెళ్ళిపడిందో ఏమో. అతను నా చేతి రుమాలునిస్తూ అన్నాడు. 'ఇదిగో నండీ మీ చేతిరుమాల'

'ధన్యవాదాలు' నేను ప్రతిఫలం ముట్టజెప్పాను.

'ఇంతమాత్రానికే' అతను నవ్వుతూ అదోలా చూస్తూ అన్నాడు.

'నేను నవ్వి ఊరుకొన్నాను. అతనే మళ్ళ ప్రస్తావన ప్రారంభించాడు.

'మిమ్మల్నెక్కడో చూచినట్లుందే.... అవును రోజూ బస్ స్టాపుదగర'

మాటాడితే నా సామ్యం పోతుంది గనుక అవునన్నాను.

మీరేం చేస్తుంటారు? అతని ప్రశ్న.

బడి పంతులమ్మపని, నా జవాబు. మా సంభాషణ ఏ ఆటంకం లేకుండా సాగిపోతుంది. సినిమా దాని దారిన అది నడుస్తున్నది.

మీరేం చేస్తుంటారు? నా ఎదురుప్రశ్న.

నేను సెక్రటేరియట్‌లో సూపరింటెండ్‌ను.

మా ఇద్దరిభావాలు ఒకేదారిన ఉన్నాయనుకొన్నాను. నేనంతి సాహసించడానికి జీవితపు గతిచరిత్రే కారణం. నన్ను మనసారా ప్రేమించినవారిని వివాహం చేసుకోవడానికి నా మనస్సు తహతహలాడుతున్నది. మా అమ్మ వాంఛకూడా అదే. సమాజం నా వివాహ విషయంలో ఘోర అన్యాయంచేసింది. పూర్వజన్మ సుకృతమని తృప్తిపడక తప్పిందిగాదు. మా కనుకున్నవారెవరూ మాపైపడిన విపరీత అన్యాయపు విపత్తును గురించి కొంచెమయినా సానుభూతి చూపినవారు లేరు. అదంతా చెప్పడం ఇప్పుడు అప్రస్తుతమనుకొంటాను.

అతనిజవాబు నాకు తృప్తిని కలిగించింది. అతని సంభాషణ, అతని చూపులు అవన్నీ నాకోసమేననీ చెప్పుతున్నాయి.

'నేను చాలారోజులుగా మిమ్మలను చూస్తున్నాను. మీరంటే నాకెందుకో 'ఇది' కలిగింది. మీకు చెప్పడానికి నాకు సిగ్గు, భయమూ కలిగినా ఇప్పుడు సాహసించి చెప్పుతున్నాను. ఎన్నోసార్లు చెప్పాలనుకొన్నాను. చెప్పలేకపోయాను. అయినా మీకు నాయందు ఎలాంటి అభిప్రాయముందో నేను గ్రహించలేకపోయాను' ఆయన యిక చెప్పలేకపోయారు.

నాకు సిగ్గు ముంచుకొచ్చింది. అప్రయత్నంగా నాచేయి అతని చేతిలోకి వెళ్ళింది. నేనేమీ చెప్పలేకపోయాను. నా వలిగిన సింధూరం తిరిగి పుష్పిస్తుంది. నా ఆశలు ఫలిస్తాయి. ఇది నిజమేఅయితే నాకంతకంటే కావలసిందేముంది? కాని కలఅయితే ఘోరశిపితను కావలసివస్తుంది. ఏదో ఉద్రేకంలో అంటున్నారనే అనుమానం నాకు

★ విడివడని బంధం ★

ఎదురయింది. 'నిజంగా నే...మీరిది మనః పూర్వకంగా అంటున్న మాటలేనా? లేక ఏదో ఉద్రేకంలో అంటున్నారా?' నేను సూటిగా జంకూ గొంకూ లేక అడిగాను. అలా పార్కుకుపోయి మాట్లాడుకుందాం రండి. మీ కిష్టమయితే వివరంగా మాటాడుకొందామన్నారు. నేను సరేనన్నాను. ఇద్దరం పార్కుకివెళ్ళాం. పార్కులో గడ్డి దిన్నెపై కూర్చుంటూ 'త్రికరణ శుద్ధిగా చెబుతున్నాను. ప్రపంచం తల్లక్రిందులైనా నా నిర్ణయంమారదు, మీకు ఇష్టమయితే... మీ అంగీకారమే తరువాయి...ఇప్పుడు నేను మా వాళ్ళకు కొంతదూరంలో ఉంటున్నాను. వారిభావాలతో నేను ఏకీభవించలేకపోయాను. దాదాపు వారికీ నాకూ సంబంధం చాలా దూరంలోవుంది. ఇంక నాకెలాంటి అడ్డంకులూ లేవు' అతను ఆవేశంతో చెప్పాడు.

అతను చాలా బాధలను అనుభవించాడనుకొన్నాను. అతని ఆవేదన క్రింద నలిగిన గాథ ఏమిటో తెలుసుకోవాలనుకున్నాను. కాని చెప్పమని సాహసించి అడగలేక 'మెల్లగా అన్నాను.' కాని నాకథ వింటే మీరు ఇందుకు ఇష్టపడరనుకుంటాను.

ఆకాశాన కారుమబ్బులు నిప్పులుక్రక్కడం మొదలెట్టయి. వర్షం వచ్చే సూచనలు స్పష్టంగా కనుపిస్తున్నాయి. నా కథను అతనికప్పుడే చెప్పడం మంచిది కాదని కాబోలు ప్రకృతే ఇలా కట్టడిచేస్తున్నదా అనిపించింది. తుంపరగా చినుకులు పడడం ప్రారంభించాయి.

'ఇకపోదాం ... నా రూముకి వెళ్దాం అభ్యంతరం లేకపోతే' అతనన్నాడు.

'నేను మౌనంగా లేచాను. అతనే ఒక ఆటోరిక్షా మాట్లాడాడు. అచేతనంగా దానిలోనికెక్కాను. అతని రూముకు వెళ్ళి కూడదనుకొన్నాను. అంత త్వరగా ఒక అభిప్రాయానికి వచ్చేయడం భావ్యంకాదనుకొన్నాను. 'రేపు సెలవేగా, మా ఇంటికి రండి. తప్పక...మా అమ్మగారికి పరిచయం చేస్తాను. ఆమెకుకూడా ఈవిషయం తెలిస్తే సంతోషిస్తుంది' అన్నాను నేను మెల్లగా.

అతనేమీ అభ్యంతరం చెప్పలేదు. 'సరే' అని మాత్రం అన్నాడు. ఇంటి అడ్రస్సు అడిగి రిక్షానటు పోనిమ్మన్నాడు.

ఆటోరిక్షా మా ఇంటిముందు ఆగింది. నేను లేస్తూ అన్నాను. 'మీరు రేపు తప్పక వస్తారా? ఎదురుచూస్తుంటాం' అతను సరే తప్పక వస్తానన్నాడు. నేను...దాన్నే మనసులో...ఆనందపారవశ్యంతో మత్తెక్కినదానిలా తేలుతూ ఇంట్లోకి వెళ్ళాను. అతను వెళ్ళిపోయాడు.

అతనిమాటలెంతో మృదువుగా ఉన్నాయి. అతని మాటల్లో ఎంత సత్యం ఉట్టిపడుతుంది. ఏమాత్రం తొందరపాటు లేదు. ప్రేమపాశాల నేమాత్రం వల్లించలేదు. నా స్థానాన్ని చెప్తే దూరదృష్టిగలవారికి నా సవికత ఇట్టే అర్థమవుతుంది. ఇతని స్థితి నా స్థితి అంతేననుకొంటాను.

నేను భోజనంచేస్తూ మా అమ్మతో ఈ విషయమంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాను. ఆమె ఆనందించింది. కాని ఒక సందేహాన్ని గూడ వెలిబుచ్చింది. 'ఇదంతా నిజమేనంటావా? ఉద్రేకంలో ఏవో బంగారు కొండలు చూపిస్తారు. అనంత ఆశలు కల్పిస్తారు. చివరికి నట్టేట్లో ముంచేస్తారు. జాగ్రత్తగా ఇలాంటి విషయాలను ఆలోచించి గాని ఒక నిర్ణయానికి రావడానికి వీలులేదు. బాగా ఆలోచించు అమ్మా... నేను కోరేది కూడా అదే......ఈపాటికి హాయిగా బిడలతో అత్తగారింటివద్ద ఉండవలసినదానవు... పాపిష్టి కట్నాల ఎరవు తటుకోలేక నీ ఆనందాన్ని నీకు అందించలేకపోయాం. బండ్లు ఓడలవుతాయి ఓడలు బండ్లవుతాయి. అలాగే మన స్థితి అయింది కాబట్టి ఆభారం నీమీదపడింది. అనూహ్యమైన గండ్రగొడ్డలి పెట్టు నీమీద పడింది. ఏంచేస్తాం గతాన్ని మరచి ముందుకు సాగడంలోనే ముక్తి. లేకపోతే ఎన్నాళ్ళిలా చింతతో బాధపడగలం. ఈ వయస్సులో నాకు ఇంతకన్నా కావలసిందేముంది తల్లీ. జాగ్రత్తగా ఆలోచించి ఒక నిర్ణయానికిరా.' నాతల్లి కన్నీరు కార్చింది. అవి ఆనంద బాష్పాలో, దుఃఖబాష్పాలో చెప్పలేను. వణుకుతున్న హస్తాలతో నాతల నిమురుతూ అన్నది అమ్మ మళ్ళీ 'మరి గతాన్ని ఆయనకు చెప్పావా? అది విన్నతరువాత వెనుకాడితే ...ఏం చెయ్యగలం. చెప్పకపోతే మోసం చేసినట్లవుతుంది. అమ్మాయ్ రేపు వస్తారన్నావుగా తప్పక చెప్పు. నా స్థానాన్ని కప్పిపుచ్చకుండా ఉన్నదంతా చెప్పేయ్.

'సరేనమ్మా అలాగే చేద్దాం' అన్నాను. నాలో ఒకప్రక్క ఆనందం మరోక ప్రక్క తుఫాను చెలరేగింది. ఏది జయిస్తుందోనని నా మనస్సు ఎంత ఆందోళన చెందుతుందో ఎలా మీకు చెప్పాలో నాకు అర్థంకావడం లేదు. అంతా భగవధేచ్ఛ అని భగవద్గీతలోని 'సర్వధర్మాన్ పరిత్యజ్య...' శ్లోకం చదివి మేనును ప్రక్కకు జేర్చాను.

* * *

ఈరోజు నా భాగ్యాన్ని నిర్ణయించే రోజు. జీవితంలో మరువలేని రోజు. ఈ రోజు నా జీవితంలో అమూల్యమైన రోజు. నిర్ణయం ఎలా జరుగుతుందో ఈరోజుదే భారం. మంచి - చెడూ రెండూ ఈ రోజువే.

నేను ఉక్కా మూసాబె ఆయనకోసం ఎదురుచూస్తున్నాను. శ్రావణ మేఘాలు చెదురు చెదురుగా ఆకాశాన్నలముకొని ఉన్నాయి. సూర్యుడు నేడు తన కిరణాలలో ఏదో స్ఫూర్తిని జొప్పిస్తున్నాడు. ఆ కిరణాలు వింత వింత కాంతులను వెదజల్లుతున్నాయి. ఎందువల్లో అంతా నాకు ఆశ్చర్యంగా ఉన్నది. ఇంద్రధనస్సు విర్రవీగుతూ తన సోయగాన్ని చూచుకొని ఆనందిస్తున్నది. చక్కటి ప్రశాంత వాతావరణం నాకు శుభసూచకంగా అగుపించింది. ఇంతకంటె శుభమేం కావాలి నా జీవితంలో. తిరిగి వాడిపోయిన నా జీవితం పుష్పిస్తుంది,.. ఫలిస్తుంది. ఇవే ఊహాలలో కొట్టుమిట్టాడుతున్నానేను. ఇంతలో ఆయన వచ్చారు. ప్రత్యేకంగా అలంకరించబడిన నా గదికి ఆయన్నాహ్వానించాను. ఆయన చిరునవ్వుతో నా స్వాగతాన్ని అందుకున్నారు. నేను ఫలహారం, కాఫీ తీసుకొని ట్రేతో సహా ఆయనదగరకెళ్ళాను. 'మా ఇల్లెలా

వుంది...? నేను ఆయన్నే ముఖాలో తోచక వేసిన ప్రశ్న.

'బాగానే వుంది. ఆడవారు తిరిగే ఏ ఇల్లయినా కలకలలాడుతూ వుంటుంది' నా ప్రశ్నకు ఆయన జవాబు.

'ఫలహారం తీసుకోండి' నేను సిగ్గుతో అన్నాను ట్రే డ్రాయరుపై పెట్టి ప్రక్కగా నుంచున్నాను.

'ఇలా రా మనిద్దరం తీసుకొందాం అంత సిగ్గయితే ఎట్లా' ఆయన నన్ను పిలచారు.

నేను ఆయన ఆజ్ఞను శిరసావహించడానికి ఉద్యుక్తురాలనైయాను. ఇంతలో అమ్మ నన్ను పిలిచింది. హడావిడిగా నన్ను వంటింట్లోకి తీసుకువెళ్ళి అన్నది. 'ఇదేం బాగాలేదు.' ఇతనే నిన్ను కట్నంలేని కోదన్న ఆయన ఈ విషయం తెలిస్తే ససేమిరా అంగీకరించరు. ప్రశ్నార్థకంగా అమ్మ నావైపు చూచింది.

అమ్మ ప్రశ్నకు నేను వెంటనే జవాబు చెప్పాను. 'నే నెంత అదృష్టవంతురాలిని, ఏమైనా బెసగదు' అని నిశ్చలంగా అని మరింత ఉత్సాహంతో ఆయనదగ్గరకెళ్ళాను. ఫలహార కాఫీల సేవ అయిపోయింది. 'మీ అమ్మగారేమన్నారు? ఆయన అడిగారు. 'అంటానికేంవుంది. మన ఇద్దరిష్టమే ఇష్టం కాని అసలు విషయం తెలుస్తే మీ రంగీకరించరేమో నని...'

'ఎంతమాట అలా ఎన్నటికీ జరుగదనిపోమీ నిస్తున్నాను. ఆయన నిశ్చలంగా అన్నారు.

"మీ రింతకాలము ఎందుకు వివాహం చేసుకోలేదు?" నేను అడిగాను.

"అదొక పెద్దగాథ–ఎందుకు చెప్పి బాధ పెట్టడం..." అని ఆయన ఒక దీర్ఘనిశ్వాసం విడిచారు.

"ఫరవాలేదు చెప్పండి. బాధ ఎందుకు?"

ఆయన ప్రారంభించారు :

"నా వివాహం చిన్న వయస్సులోనే అయింది. ఆమె ఎలా వుంటుందో నాకు తెలియదు. చాలా మంచిదని, అందం గలదని చెప్పగా విన్నాను. చిన్న వయసులో పెళ్ళిపీటలమీదే చూచుకోవడమే. మళ్ళీ ఆమెను చూడలేకపోయాను. అప్పటో వాళ్ళది మా ప్రక్క ఊరే. కొన్నాళ్ళకు మళ్ళీ నాకు పెళ్ళి ప్రయత్నాలు మొదలపెట్టారు. ఇదంతా నాకేమీ అర్థంకాక అడిగాను మా అమ్మా నాన్నను. అప్పటికినాకు కొంత ఆలోచించే శక్తి సామర్థ్యాలున్నాయి. కాలేజీలో చదువుతున్నాను. నాకు పెళ్ళియింది గదా మళ్ళీ పెళ్ళిప్రయత్నా లేమిటని అడిగాను. వాళ్ళు వివరంగా నాకు చెప్పలేదు. ఇతరుల వల్ల తెలుసుకున్నాను. కట్నం అనుకున్న ప్రకారం ఇవ్వలేక పోయారని, మా వివాహం అయింతరువాత వారి కుటుంబం ఆర్థికంగా చితికిపోయిందని విన్నాను. ఇంత మాత్రానికే తెచ్చుకున్న కోడలును, తాళి


...త్వరగా పరఫరా అవుటచే బ్రూక్ బాండ్ టీ తోట పదుమ తాజాగా వుంటుంది.
ప్రతి వారం 2.89.00.000 ప్యాకెట్ల బ్రూక్ బాండ్ టీ తయారవుతోంది —గొప్ప విశేషం కదా!
బ్రూక్ బాండ్ టీ ఇతర టీల కంటె చాలా మందికి ప్రియమైందంటే ఆశ్చర్యమేముంది?
అన్ని వేళలా
బ్రూక్ బాండ్
టీనే
తాగి ఆనందించండి
BS 273 K

కట్టిన భార్యను దూరం చేయడానికి ప్రయత్నించారు మావారు. మావారి ప్రయత్నాలన్నీ ఫలించలేదు. వాళ్ల వివరాలు అడ్రసు తెలుసుకొంటే వారు ఇంకో ఊరు వెళ్ళిపోయారని తెలిసింది. నాకు మావాళ్ళ యెడ ఏహ్యభావం ఏర్పడింది. ఏ మాత్రం మానవత్వం లేనివారినిగా అనుకొన్నాను. ఎప్పటికప్పుడు వివాహం వద్దు వద్దు అని వారు తెచ్చిన సంబంధాలు కాదని, ఎలాగైతే నేం కాలేజీ చదువు పూర్తి చేసుకొని తరువాత ఉద్యోగంలో ప్రవేశించాను. ఇప్పుడు వాళ్ళు ఎక్కడ ఉన్నారో వివరం తెలియలేదు. ఎంతో ప్రయత్నించాను. కాని ప్రయోజనం లేకపోయింది. ఎలాగయినా వాళ్ల వివరం తెలుసుకొని నా భార్యను తెచ్చుకోవాలని విశ్వప్రయత్నం చేశాను. చివరికి ఒక నిర్ణయానికొచ్చాను. ఆమె ఇక నాకు దక్కదని వయస్సులో వున్న పిల్లకు వివాహం చేసి వుంటారనుకొన్నాను. అదంతా ఒక కలగా భావించాను. ఇక నిరీక్షించి ప్రయోజనం లేదని తలచాను. చాలాకాలం ఓపికతో ఆమెకోసం గాలించే ఈ నిర్ణయానికొచ్చా. ఇక ప్రయోజనం ఉండదనే నిశ్చయం నాలో నిలచింది."

ఆయన సానునయంగా చెప్పుకుపోతుంటే నా కన్నీరు ధారలై ప్రవహించింది. ఆయన మెల్లగా తనదగ్గరకు తీసికొని నా కన్నీరు తుడిచి 'కథ కన్నీరును తెపిస్తున్నదా' అని కన్నీరు తుడిచారు. 'నిజంగా నే ఎంత కరుణ గాథ...వురుకొస్తే నా హృదయం ఎంత బాధ పడుతుందో.' ఆయన మళ్ళీ అన్నారు. కొన్ని క్షణాలాగి 'మా వాళ్లకు హృదయాలు లేవు. డబ్బుయందు ఉండే ప్రేమ మనిషి మీద, తన కోడలుమీద లేదు. డబ్బుకు వాళ్లకూ అంత లంకె. వాళ్ల సర్వస్వమూ అదే. ఉన్నది చాలక ఆడపిల్లల తండ్రులను పీడించి పిప్పిచేయడం...ఆయన ఆవేశంతో అన్నారు.

వారి చేతులు నా చెక్కిళ్లను నిమురుతున్నాయి. నాలో ఉన్న ఆశ—భయం—ఏది జయిస్తుందో ఫలితంకోసం నా మనస్సు ఉత్రూతలూగిపోతున్నది. చెప్పలేక మెల్లగా తడబడుతున్న స్వరంతో అన్నాను. 'ఆమె అడ్రసు తెలిపితే వెళ్తారా? నాకు తెలుసు.'

ఆయన స్తబ్దుడైపోయాడు. సందిగ్ధావస్థలో పడ్డాడు. 'ఆఁ...నిజంగానా?' అడిగాడు ఆయన.

ఆయనలోని ద్వంద్వయుద్ధం నాకు అర్థమయింది. నన్ను ప్రేమిస్తున్నానని మాట ఇచ్చాడు. ఇప్పుడు తాళి కట్టిన భార్య... 'భగవాన్' అనే మాటలు అప్రయత్నంగా ఆయన నోటినుండి వెలువడినయ్. అతనిదృష్టిలో నేను...తాళికట్టి ఎదురుచూచి నిరాశ పొందిన తరువాత ప్రత్యక్షమైన భార్య... ఇందులో ఎవరిని కాదనాలి, కాదనగలడు? అతనిలో తీవ్రసంఘర్షణ ప్రారంభమయింది. అలా ఎంతసేపు కూర్చున్నామో మానంగా తెలియదు. ఇక ఆయనను బాధపెట్టడం మంచిది కాదనుకున్నాను. ఆయన హృదయం నాకు పూర్తిగా అర్థమైంది. సున్నిత హృదయాన్ని గాయపరచడం మంచిది కాదనుకున్నాను. నాకు ఇదంతా ఒక కలగా సుందర దృశ్యాలుగా కనుపించింది. నాలో సిగ్గు దొంతరలు ముంచుకొస్తున్నాయ్. హాసర పాలు వెలువలె ప్రవహించాలని ప్రయత్నిస్తున్నాయ్. నాలోని తొందర ఇంక నన్ను నిబ్బరంలో ఉంచలేకపోయింది. 'నేను మీ తాళికట్టిన భార్యను—అంతేగాక దారిలో చూచి ప్రేమింపబడిన దానను' అని ఆయన ఒడిలో వాలిపోయాను.

ఒక్కసారిగా ఆయన మొహంలో అద్వితీయ కాంతి వెలసింది. 'నిజంగానా' అంటూ ఆయన బిగి కౌగిలిలో బిగించారు. ఆబిగి కౌగిలిలో నేను నా భాగ్యానికి ఉక్కిరిబిక్కిరి ఔతున్నాను. తలుపు చాటునుండి మా అమ్మ మమ్ములను చూచి ఆశీర్వదించి, ముసిముసి నవ్వులు చిందించి వెళ్లిపోయింది. సెంట్ క్వీన్ వాసనలు మమ్ము మత్తెక్కించాయ్. గగనాన చంద్రుడు తారలతో ఆడుతూ మమ్ములను చూపిస్తూ నవ్వుతున్నట్లున్నాడు. మేమిద్దరం ఆనంద సాగరంలో అద్వితీయపారవశ్యంలో సాగిపోతున్నాం. ★

“పొలంనుండి”

—చిత్రకారుడు : యం. డి. నెల్సన్]

మంచు కురిసిన రాత్రి

రాత్రివేళ నాకు నిద్రపట్టలేదు.

హోటల్ నుంచి భోజనంచేసి వస్తూ యెంతెంతగానో ఆలోచించాను. దూరంగా రైలుపట్టాలు వెన్నెల్లో మెరిసిపోతున్నాయి. చెక్కలబ్రిడ్జిదగ్గర వాటర్ పంపు స్టేషన్ పక్కనవున్న చిటికేశ్వరపు చెట్టువెన్నెల్లో మరీ నల్లగావుంది. పుట్టినప్పటినుంచీ పొగ పోసుకుని దానికి అవతారం నల్లగా తయారైంది. పువ్వులుకూడా పొగ పూసుకుని నల్లగా వుంటాయి. దూరంగా తుంపుల గుంపుల కొండలు. వెన్నెల్లో మెరిసిపోతున్నాయి. ఆవేపు రైలుపట్టాలు పల్లంలోకి పోతాయి. బెంగుళూరువేపు ప్రయాణం చేయాలంటేఆవేపేపోవాలి. వందయేళ్ల నాటి చర్చి వెన్నెలలో నిశ్చలంగా యేమిటేమిటో మనసుకి చెపుతుంది దానివేపుచూస్తే.

ఈవైపూ ఆవైపూ రైల్వేక్వార్టర్సు.

సాయంకాలంపూట అదంతా తిరిగి వచ్చాను.

ఆ పచ్చగన్నేరుపూలఇంట్లోవున్న అమ్మాయంటే నాకు ఇష్టం.

ఎందుకంటే యెప్పుడూ క్లాసులో గోల చేయదు.

చాలాబుద్ధిమంతురాలు. మంచిమార్కులు వస్తాయి.

సాయంకాలంపూట వాళ్లింటివద్ద కాసేపు నిలుచున్నాను.

కాని ఆ అమ్మాయిమాత్రం నాక్కనిపించలేదు.

సాయంకాలపు ఎఱ్ఱటి కాంతులుపడి పచ్చగన్నేరుపూలు మెరిసిపోతున్నాయి. నాకు యెన్నాళ్ళకైనా గుర్తుంటాయి. పచ్చగన్నేరుపూలూ, ఆ అమ్మాయి.

మనసులో అనిపించినా యెక్కువసేపు నిలుచోలేదు.

ఎవరైనా పిలలుచూస్తే బావుండదు.

ఏంచూస్తే! ఇక నేను క్లాసులకు పోనవసరం లేదు.

అయిపోయింది. ప్రొద్దున్నే ఊరికి పోతున్నాను.

మళ్ళీ యీవేపుకి రాను. వచ్చినా యీ మనుష్యులుండకపోవచ్చును.

అవును క్షణక్షణం మారుతుంది జీవితం.

పదిరోజులు ఏదైనా వూరికిపోయివస్తే పెరట్లో నాలుగు కొత్తమొక్కలు కనిపిస్తే యెంతో మార్పు కనిపిస్తుంది.

మనముండే ఏదేనా కొత్తమొక్క పుట్టి పెరిగి పువ్వులుపూసినా మనకా మార్పు గ్రాహ్యంకాదు.

అలాగే ఎన్నాళ్ళు గడచినతర్వాతనో నేను ఇక్కడికవచ్చినా నేను వూహించలేని మార్పులు కలుగవచ్చును.

రైల్వే డిస్పెన్సరీ వెన్నెల్లో మెరిసి పోతున్నది.

చర్చిముందుకొచ్చేసరికి నలుగురు పిల్లలు జట్టుగాచేరి 'నమస్కారంసార్' అన్నారు. వాళ్లవేపు చూసీచూడనట్లు చూశాను. ఎందుకంటే వాళ్లంటే నాకు భయం. వాళ్ళకు నేనంటే కోపం. పరీక్షల్లో వాళ్ళకు నేను సాయం చెయ్యలేదట. ఆమాట వాళ్ళే నాతో అన్నారు.

నేను ట్యూషన్ చెప్పిన ఆఫీసరుగారింటికి వెళ్ళవద్దామనుకున్నాను. కాని నాకు సిగ్గనిపించినది' ఇద్దరుపిల్లలలో వొకపిల్ల పెళ్ళి చేసుకుని అత్తారింటికి వెళ్ళిపోయింది. ఇంకో పిల్లతో మళ్ళీ కనపడను అని చెప్పిరావచ్చు. ఏంకి యెందుకు? హటాత్తుగా ఏకథలో లాగానో యే రైల్వేస్టేషన్ వెయిటింగు రూములోనో, యే ప్రయాణంలోనో, బస్

"మంజుశ్రీ"

లోనో, రైల్లోనో, యే థియేటరులోనో కలుసుకోవచ్చును.

ఇది జీవితం. ఏమీ ఆశ్చర్యపడనక్కర లేదు.

అప్పుడు ఒకరినొకరు గుర్తించగలిగితే
ముందు "బావున్నారా?"
తరువాత "యేంచేస్తున్నారు?"
"పిల్లలెంతమంది?"
"పూర్తిగా మారిపోయారండీ!"
"కనుక్కోలేకపోయాను!"
వగైరా వగైరా......లతో పలకరించుకుంటారు.

పైకి అవరు. కాని లోపల "ఆ రోజులెంతమధురంగా వుండేవి, సమస్యలు లేకుండా. ఎప్పుడూ రాబోయే రోజులపై ఆశ. యేమిటో తీపి. కలలు. ఆర్ద్రిత. ఏమిటో ఏమిటో, ఎందుకో ఎందుకో... ఒక్కొక్కరోజే గడచిపోతుంటే బొత్తిగా దిగులుపడటం మానేసి కొత్త ఉత్సాహం. సంతోషం. కాని ఇప్పుడు ఒక్కొక్క రోజే గడుస్తుంటే దిగులు. ఎందుకు? కొత్త లోకపు తలుపులు యెప్పుడు తెరుస్తారో. ఎప్పుడైనా తెరవచ్చును. అప్పుడు వెళ్ళిపోవాలి, మరి." అనుకుంటారు.

ఆఫీసరుగారింటి ముందుగానే నడచిపోయాను.

పంపుదగ్గర నుంచి నీళ్ళు తెస్తున్నది.

నన్ను గుర్తించలేదు, నేను గుర్తించాను. ఆమాత్రం గుర్తించకపోతే నేను మేష్టరుని యెలా అవుతాను?

సంధ్య వాలిపోయింది. వెలుతురుపోయి మరోలోకంలో విచ్చుకుంటున్నది. పడమరవేపు ఆకాశం ఎఱ్ఱగా, భయంకరంగా, అందంగా, ఆలోచించగలిగిన వాడికో కొత్త అనుభూతినిస్తూ అవుపిస్తోంది.

నిలవేసి ఎక్స్ క్యూబ్ ప్లస్ వై క్యూబ్ కి ఫాక్టర్లు చెప్పమంటే—హడలిపోతుంది.

ఎందుకో యీ చదువులు. మనసుకి అశాంతి తెచ్చిపెట్టేను.

అర్థంకావు. పరీక్ష తప్పితే యేడుపు.

జీవితంలో యెలా వుపకరించేను?

వత్తిపురుషులని యెలా పట్టుకుంటే యేమో—సీతాకోక చిలుక అవసలు కంఠస్థం పట్టటమెందుకు? బల్లి గోడపై యెలా ప్రాకును? గోధుమ పంటకు అనువైన శీతోష్ణ స్థితులెవ్వి. సరాసరి, సరళరేఖలు, లాభనష్టాలు, ది బాయ్ స్టుడ్ ఆన్ ది బర్నింగ్ డెక్, యెందుకు? చదువుకి అర్థంలేదు. జీవితంలో యెందుకూ పనికిరావు.

రేపు సంసారంలో మనసుకి మనసు అర్థంకాక, అసంతృప్తి, అశాంతి, వైరాగ్యం, చుట్టుముడితే, మనిషిలా బ్రతికేందుకు, హృదయాన్ని ఇంకా ఇంకా విశాలపరుచుకునేందుకు, వొక సుందర సత్యం యీ ధరిత్రిని జయిస్తుంది అని ఆశపడేందుకు అనువైన చదువు యేదయినా వుంటే నలుగురు పెద్దలూ చేరి ఆలోచించి, తెచ్చి పెట్టకూడదూ? ఇన్నాళ్ళూ నేను చేసిందేమిటి? వాళ్లు నేర్చుకున్నదేమిటి? మేష్టరు పనికిరాని వాళ్లలో మొదటి రకం. వీళ్ళలో నే ఈర్ష్యలు, ద్వేషాలు, కపటాలు, కార్పణ్యాలు, యెక్కువ. వీళ్ళకెవరు చదువు చెపుతారు? వీళ్లేం చెపుతారు?

వెళ్ళిపోయిందా ఆ అమ్మాయి. పలకరించను. ముందుకు సాగిపోయినాను.

ఎప్పుడూ యెవరితోనూ చెప్పకోలేను. నవ్వుతారేమోనని భయంవేసి. దూరంగా వొకదాని పక్కనే వొకటి రెండు చిన్న కొండలు. ఆ రెండుకొండలనడుమ సాయంకాలంపూట సూర్యుడు అస్తమిస్తుంటే, ఆ సూర్యుడు భూదేవి నొసటి కుంకుమగానూ, ఆ రెండుకొండలూ ఆమె...... స్ఫురించేవి.

వెళ్ళిపోతున్నాను. ఈతలపు గుప్తంగా నా హృదయంలో దాగి వుంటుంది

(63-వ పేజీ చూడండి)



మూలం
మానిక్ బంద్యోపాధ్యాయ

అనువాదం
మద్దిపట్ల సూరి

(గతసంచిక తరువాయి)

ఆస్పత్రికి క్రొత్తగా నిర్మించబడిన భవనం చూడటానికి చాలా సొగసుగా ఉంది. ఇటికలపైన నిగనిగలాడే ఎర్రని గిలాబాతో మహాఅందంగా ఉన్న ఆ భవనాన్ని చూస్తూంటే జాదవ్ దీన్ని చూసుకోకుండా పోయాడే పాపం అని జాలేస్తుంది. ముంగువైపున ఇంగ్లీషులో పెద్దపెద్ద అక్షరాలతో 'జాదవ్ మెమోరియల్ హాస్పిటల్' అని చెక్కించారు. అయినా జనంమాత్రం డాక్టర్ శశిగారి ఆస్పత్రి అనే అంటూఉంటారు. దాన్నిబట్టి జాదవ్‌ని లోకంమరిచి పోయిందనికాదు. జాదవ్‌కీ ఆస్పత్రికీ ఉన్న సంబంధమేమిటో ప్రత్యక్షంగా కన్పించేది కాదాయె. అదీకాక శశియే ఆస్పత్రికట్టించటం ప్రత్యక్షంగా చూశారందరూ. అక్కడేవచ్చిన రోగులందరికీ శ్రద్ధగా మందులు ఇస్తున్నాడాయె ఇప్పుడు...

ఆస్పత్రికట్టించే హంగామా అంతా పూర్తిఅయింది. శశికీర్తి ప్రతిష్ఠలు అంతటితో ఆగిపోలేదు. జనసామాన్యపు మనఃప్రవృత్తి సాధారణంగా ఒక ముఖంగానే ఉంటుంది. అది యేటువైపు తిరిగితే అటువైపుకే త్వరగా సాగిపోతూంటుంది. జనసామాన్యంలో పశువు గింజ చూసు చూస్తుండగానే నీ నాఅంత చెలవటానికికూడా కారణం అదే. చిన్న సంఘటనలే నలుగురి నోటాపడి పెద్దవై పోతూంటాయి. శశి అసాధారణమైన పనియేమీ చెయ్యలేదు. జాదవ్ తనమీద పెట్టిపోయిన కార్యభారాన్ని కొంచెం చక్కగా నిర్వర్తించాడు. దానిఫలితం ఆశించిన దానికంటె ఎక్కువయింది. నాయకస్థానంయిచ్చి అతణ్ణి అందరూ పైకి ఎత్తేస్తున్నారు. కొన్నిచోట్ల ఉపన్యాసా లివ్వటంతో అతడిలో ఉపన్యాసధోరణికూడా పెంపొందింది. ఎక్కడే సభజరిగినా అతడువెళ్ళి మాట్లాడక తప్పటంలేదు. సభికులంతామాత్రం శశి ఉపన్యాసాల్ని చాలా శ్రద్ధగా వింటూంటారు. శశి ఉత్తేజకరంగా మాట్లాడినప్పుడు ఆ ఉత్తేజన సభ అంతటాకూడా అలముకుంటుంది. హాస్యంగా మాట్లాడడం మొదలెడితే ఆ నవ్వులధ్వనులకి చుట్టుప్రక్కలెక్కడా పిట్టలనేవి కన్పించకుండా ఎగిరిపోతుంటాయి.

తను ఈఊరు విడిచిపెట్టి పోదామనుకున్నాడు కనుకనే గ్రామజీవితం తననిలా లెక్కలేనన్ని త్రాళ్ళతో బంధించివేసింది—అని అనిపించేది మధ్యమధ్య శశికి. హఠాత్తుగా వచ్చిపడిన ఈ జనప్రియత్వం తననిక్కడ ప్రలోభంలోపడేసి ఉంచేందుకే. అదృష్టాని కిది బహుమతికాదు. లంచం, ఇలాంటి గౌరవ ప్రతిపత్తులను తానెన్నడూ ఆశించలేదా? జీవితంలోని ఈ గంభీర రూపం అతణ్ణి కొంచెం కొంచెంగా లోబరచుకున్నదన్న మాట యదార్థం. కాని ఇలాంటి దానితో ఏమిటి సాధించగలిగేది అతడు?

ఓరోజున ప్రొద్దున్నే పరాన్ ఆస్పత్రికి వచ్చాడు. చిక్కి శల్యమై ఉన్నాడు. కంఠానికి కట్టుకట్టి ఉంది. చూస్తే జాలేసింది. కాని చూసి జాలిపడేటంత తీరికలేదు శశికి. అతడికి ఎన్నిపనులు! ఎన్ని బాధ్యతలు! శశిలాంటి డాక్టరు స్నేహితుడుండి కూడా ఇలా చిక్కిపోయాడా పరాన్! పరాన్‌కి ఏం వచ్చింది? గొంతుపుండు! ఏమీ తినలేడా? అదివచ్చి చాలా రోజులయింది. మతి ఉ తరం చూసుకుని ఆమెని తీసుకురావటానికై కలకత్తా వెళ్ళేముందు వచ్చిందాయే అపుండు ఇప్పటికీ మానలేదా? శశి ఆశ్చర్యపోయాడు. ఆ పుండు ఇన్నాళ్ళు ఉండకలసిందికాదే. తాను అప్పుడే మందిచ్చాడు. దాన్ని బహుశా పరాన్ ఉపయోగించలేదేమో? అతడు ఇన్నాళ్ళూ నిద్రపోతున్నాడా యేం?

ఆస్పత్రిలో చాలా హడావిడిగా ఉంటాడే డాక్టరు శశి—అతడికీ సమయంలో పరాన్ అయినా ఏం లక్ష్యం లేనట్లు... మాట్లాడుతూ మాటాడుతూనే ఏదో ప్రిస్క్రిప్షన్ రాసేస్తూంటాడు. అంటే ఆస్పత్రికివచ్చే రోగులెక్కువగా ఉంటారా అంటే లేదు. ఆస్పత్రిభయం పోవటానికి పల్లెటూరి జనానికి ఇంకా కొన్నాళ్ళు పడుతుంది. ఏడెనిమిది మంది మగరోగులు శశి టేబిల్ ముందు నుంచుని ఉన్నారు. పోతే గుమ్మంబయట మేలిముసుగు వేసుకుని ఒకస్త్రీరోగి కూర్చునిఉంది. ప్రక్కన ఓ వయసుముల్లినా విడకూడా ఉంది. ఆమె బహుశా రోగి అత్తగారై ఉండొచ్చు. ఆమె రోగిని పట్టుకునిఉంది. వీళ్ళేఉన్న రోగులు. పరాన్ను కూర్చోవమనటానికైనా తీరిక లేకుండాఉందాశశికి? పరాన్ కాళ్ళకు జోళ్ళులేవు. అతని తొడుక్కున్నది ఇస్త్రీ చొక్కా కాదు. అతడి క్రొపింగయినా లేని వాడుకదా! ప్రపంచాన్నంతా జయించాలని ఇంటో కూర్చునికలలుకనే రోజుల్లో మిత్రుడైనవాణ్ణి—ఆ మైత్రిని మనసులో ఉంచుకునే జోరువర్షం కురుస్తూండగా మధ్యాహ్నమప్పుడు కుసుమను తన గదిలోంచి బయటికి పంపిన వాడుతాను—అలాంటివాడు ఇవాళ ఏదో ఆస్పత్రి కట్టించామన్న గర్వంతో అతణ్ణిలా నిర్లక్ష్యం చేస్తాడా? టేబుల్ కిటువైపున ఒక కుర్చీ ఉంది. దాని మీద కాకపోయినా, కొంచెం అవతలగాఉన్న 'స్టూల్' మీదయినా పరాన్‌ని కూర్చోమనొచ్చు శశి...

"గొంతు చాలా బాధగాఉంది చినబాబు!"

శశి తలయెత్తి "ఇలా దగ్గరకి రా, చూస్తాను...నోరు తెరు" అన్నాడు.

కుర్చీలో కూర్చునిచూసే సరిగ్గా కన్పించలేదు. వెలుతురులోకి కిటికీ దగ్గిరకి వెళ్ళవలసి వచ్చింది. శశి కొంచెం పరీక్షగా చూసి, పుండు మానుపట్టినట్లులేదు పరాన్! నువ్వొకపని చెయ్యి. కాసేపు ఉండు ఇక్కడ. వీళ్ళందరినీ పంపించాక పరీక్షిస్తాను మళ్ళీ" అన్నాడు.

స్టూల్ మీద కూర్చున్నాడు పరాన్. వచ్చిన రోగుల్నందర్నీ ఒక్కొక్కర్నిచూసి పంపించివేసి, ఆస్పత్రిలో కుడివైపునున్న చిన్న గదిలోకి పరాన్‌ని పిలుచుకుని వెళ్ళాడు శశి. అది అతడి ప్రత్యేకపుగది. ఈ గది కట్టించటం విషయంలో కమిటీకి అతడికి

అభిప్రాయభేదాలు ఏర్పడ్డాయి. పల్లెటూరి ఆస్పత్రి చిన్న డాక్టరికి—శస్త్ర చికిత్సలు చేసే పెద్ద పెద్ద డాక్టర్లకి ఉన్నట్టు ప్రత్యేకంగా గది దేనికి? శశి ఎవరేమన్నా పట్టించుకోలేదు. స్వార్థపరుడిలా ఈ గదిని ఆకర్షణీయంగా ఏర్పాటు చేసుకున్నాడు. శశి మనసులో ఏమున్నదీ ఎవరికి తెలుసు? కమిటీలో ఉన్న ముదుసలులికి శీతం వాతం లేకుండా పనిచేసే డాక్టరు శశి ఆస్పత్రి సమయాల్లో నే కాకుండా మిగతా వేళల్లోకూడా అక్కడే ఎందుకు ఉంటాడో తెలిసే అవకాశమే లేదు. శశికి ఇంట్లో తోచదు అన్న విషయం ఒక్క గోపాల్‌కి మాత్రమే తెలుసు.

పరాన్ గొంతుపుండు బాగా పరీక్షించినకొద్దీ శశి ముఖం గంభీరం కాసాగింది. "గుటకవెయ్యి పరాన్, గుటక వెయ్యి. ఏం? గుటక పడటం కష్టంగా ఉందా? పడితే మంచిది. ఏదీ, కాసిని మంచినీళ్ళు త్రాగిచూడు అయితే, గుటకపడని స్థితి రాలేదు నీకు పరాన్! భయపడకు."

మంచినీళ్ళు త్రాగటంతో పరాన్ కొంత తేరుకున్నాడు. గుటకకూడా పడింది. కొంచెం నవ్వటానికికూడా ప్రయత్నిస్తూ— "హఠాత్తుగా ఏమిటో భయం పట్టుకుంది చినబాబూ! ప్రాణాలు గిలగిల కొట్టుకున్నాయి," అన్నాడు.

"తిండీ తిప్పలూ లేకుండా ఉంటూంటే ప్రాణాలు గిలగిల కొట్టుకోవూ? రోజూ ఒకసారి వచ్చి చూపించుకుని వెడుతూ ఉండు గొంతు. ఇవాళ నాకింకా పూర్తిగా అంతుపట్టలేదు. అయినా మందు రాస్తున్నాను. సాయంత్రంకూడా వచ్చి ఇంకొకసారి రాయించుకుని వెళ్ళు."

దూదిపులతో పరాన్ గొంతుకి మందురాస్తూ "నువ్వు రాసుకోగలవా ఇలా? రాసుకోలేకపోతే వదులే. ఆనక వస్తాను మీ యింటికి. అప్పుడు నే నే రాస్తాను మరి" అన్నాడు.

పరాన్ వెళిపోయాడు. శశి కిటికీదగ్గర నుంచుని, అంతమనిషి చిన్న చిన్న అడుగులు వేసుకుంటూ వెళ్లటం పరీక్షగా చూశాడు. తర్వాత టేబిల్ దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చుని, లావుపాటి వైద్యగ్రంథం ఏదో తిరగవెయ్యటం మొదలెట్టాడు మరొక పుస్తకం ఏదైనా తీసిచూస్తే బావుండునే అనిపించింది. ఇంకొక పుస్తకం కోసమై వెతుకుతూంటే, అన్ని పుస్తకాలపేర్లు జ్ఞప్తికి వచ్చాయి. తర్వాత వేళకానివేళ ఎన్నడూ లేనిదివాళ చటుక్కున ఇంటికి వచ్చాడు. అలమరా తెరిచి ఒక పుస్తకం తీసుకుని తిరగేస్తూ కూర్చున్నాడు.

ప్రొద్దు ఏటవాలుకి తిరిగాక—ఆస్పత్రికి వెళ్లేముందు పరాన్ ఇంటికి వెళాడు శశి. చాలా రోజులయింది వాళ్లింటికివచ్చి. చాలా రోజులంటే ఎన్నాళ్లు! ఇరవైరోజులయింది. అవసా విశేషాన్ని బట్టి చాలా రోజులుగా కన్పిస్తోంది. అతడు వెళ్ళినప్పుడు పరాన్ ఇంట్లో లేదు. పొలం వెళ్లాడు. పంటలరోజులు. ఎంత ఒంట్లో ఓపిక లేని వాళ్ళకైనా ఇప్పుడు పొలం వెళ్లకుండా జరగదు.

"వెళ్ళొద్దు అన్నా వెళ్లారు. మళ్ళీ వచ్చినే వచ్చేస్తామన్నారు" అని చెప్పింది కుసుమ.

"వచ్చేవస్తాడా? అతడు వస్తాడుకదాఅని కాచుకుకూర్చోవాలా నేనిక్కడ? నాకు పనులేమీ లేవూ?" అన్నాడు శశి.

"ఎంత పనులుంటే మాత్రం ఒక్క క్షణం కూర్చో లేరూ? రెండునిమిషాలు విశ్రాంతి తీసుకోటానికైనా మనసొప్పక పోవటమనేది ఉండే ఆ అలవాటు మంచిదికాదు చినబాబూ; మీ రెవర్కింద నాకేంకాదుగానీ?" అన్నది కుసుమ.

"ఇంట్లో ఎవరూ ఉన్నట్టులేరు. పరాన్‌తల్లి ఏమయింది?"

కుసుమ ఉదాసీనంగా "ఎక్కడికి వెళ్ళిందో ఎవరికి తెలుసు? ఆవిడ తిరగనిదే ప్రొద్దెక్కనిగడప అంటూ ఉంటేగా" అన్నది శశి సందేహిస్తూ "నువ్వే ఏదో మిషపెట్టి ఆమె నెక్కడికి పంపలేదుకదా" అని అడిగాడు.

"నేనా? నేను పంపానా" సిగ్గుతో కుసుమముఖం ఎర్రపడింది.

ఆమె నవ్వుతూ:—"ఏం మనుషులండీ! ఓ వేళ మిషపెట్టి పంపితేమాత్రం ఆమాట యిలా ముఖంమీదే అడిగేస్తారా? వినటానికి ఎంత కటువుగా ఉంది!" అన్నది.

"ఇవాళ ఏమయినా నీమాటలు మహా తియ్యగా ఉన్నాయి కుసుమా!"

"తీపిని ఉండటంవల్ల అలా ఉండొచ్చు."

శశి ఆనందిస్తూ "నీ నవ్వుచూస్తే ప్రాణాలులేచి వస్తాయి కుసుమా! వచ్చిపోయే జనంలో ప్రాణం చివికిఉంటుంది. నువ్వు తప్ప నాముందు ఎవరూ నవ్వరు ఇలా. నాకు నేస్తం అనేవాళ్ళే లేరు కుసుమా!" అన్నాడు.

"నేనులేనూ?" అంటూ నోటినిండా నవ్వింది కుసుమ తర్వాత.

"ఆయన గొంతుపుండు ఏమిటటసలు?" అని అడిగింది.

"ఇవాళ చెప్పను. ఎల్లుండి వింటువుగాని."


"ఏం, ఇవాళ చెపితే తప్పు ఏముంది?"

"ముందు నాకు అంతుపట్టాక కదా చెప్పటమనేది? పాలు తప్ప అతడికింక ఏమీ ఆహారం ఇవ్వవద్దు."

"ఇంకేదైనా తీసుకోగలిగితేగా ఇవ్వటానికి? పాలు త్రాగడం కూడా కష్టంగానే ఉంది."

పరాన్ వస్తాడేమోనని మరికొంతసేపు కూర్చున్నాడు శశి.

కుసుమ ఇంక మాట్లాడనూ లేదు, నవ్వనూ లేదు. ముఖప్రీతి మాటల మోజు ఎంతసేపు వుంటుంది? కుసుమ ఉగపట్టకో లేకుండా వుంది.



ఓసారి లేచి ఉత్తరపువైపు గదిలోకి వెళ్ళింది. మళ్ళీ బయటికివచ్చి ప్రొద్దుకేసి చూసింది ఒకసారి. తర్వాత శశి ప్రక్కనుంచి హాలోకి వెళుతూ, పమిటచెంగునవున్న తాళాలగుత్తి అతడివీపుకి తగిలేటుచేసి, "అయ్యో! తగిలాయా?" అన్నది.

శశి ఇవాళ లేచినుంచుని, "ఇంక కూర్చునే వ్యవధి లేదు కుసుమా! శరన్‌వస్తే ఆస్పత్రికి పంపించు" అన్నాడు.

కుసుమ ఎన్నడూ కోపగించుకునిఎరగదు. ఇవాళ విపరీతమైన కోపం తెచ్చుకుని. తాళాలున్న పమిటచెంగు భుజంమీదవేసుకుని ముఖం మాడ్చుకొని "కూర్చోటానికూడా వ్యవధి లేదుకదూ?" అన్నది.

శశి కొంచెం ఆశ్చర్యపోతూ—"ఆస్పత్రికి రోగులు వచ్చి కూర్చునివుంటారు తెలుసా?" అన్నాడు.

అదేమీ అర్థంకానిమాటకాదు, అయినా కుసుమ ఏదో ప్రయత్నించి అర్థంచేసుకున్నటు తోస్తుంది. శశిని తానేదో ఇంతకుముందు ఎరుగనట్లు చూసిందామె.

"అది రోజూ వుండేపనేగా?" అన్నది కుసుమ.

శశి కొంచెం ఇరుకునపడ్డటయి 'కూర్చుమన్నావ్. కూర్చున్నాను అన్యధాగా కోపం తెచ్చుకోకు కుసుమా. వేళప్రకారం పనిచెయ్యకపోతే సాగదు ఊరికే బాతాఖానీ కొడుతూ కూర్చుంటే కాదు. కబుర్లకేం? నవ్వెక్కడికిపోతావ్? నేనెక్కడికిపోతాను?' అన్నాడు.

"ఇది తొమ్మిదేళ్ళనుంచీ వున్నదే—ఒకరోజు రెండురోజులు కాదు."

ఈమాట అని రెప్పపాటులో కుసుమ అక్కడినుండి మాయమైపోయింది. వెళ్ళకపోతే ఏం జరిగేదో చెప్పలేం. కాని ఇలా ఆమె ఎన్నడూ చేసి ఉండలేదు. ప్రతిక్షణం ఏదో జరగబోతుంది అన్న ఆగురామాత్రం అలాగేవుంది. ఇవాళ కుసుమ ఇదేమిటి?

ఆమె శశి నివాళ ఇలా హఠాత్తుగా వదిలేసి ఎందుకు వెళ్ళిపోయినట్లు? ఆమె కోపంచూసి శశి నిశ్చేష్టుడవుతున్నాడా? విషణ్ణమైన శశిముఖం చూస్తుంటే కుసుమకి కనీసం కుతూహలం కలిగివుంటుంది, ఇలా యెన్నడూ కాలేదు. తాటితోపులో దిబ్బమీద నుంచుని ఓనాడు సూర్యాస్తమయాన్ని చూస్తూ శశి వ్యాకులపడ్డాడు. అదివరకెన్నడూ లేని భావోద్వేగంతో అతడు కంపించిపోయాడు. ఇవాళ అపరాహ్ణవేళ ఇంట్లోనే ఒక్కడూ నుంచుని విహ్వలుడైపోతున్నాడు మరొక భావోద్వేగంతో. ఈ గడ్డమీగ వాడే శశి. మామూలు పల్లెటియింట్లో—పేడతో అలికి ముగ్గులుపెట్టిన ఇంట్లో ఇంతకుముందు అతడితో మాట్లాడిపోయిన ఆమె [illegible] యువతి కాదు. వాసనమూసి రాసుకున్న వనిత అయినా కాదు. ఈ ఉద్వేగం పల్లెటూరి చెరువులోని చిన్న చిన్న అలలాంటిది. ప్రపంచంలో సముద్రతరంగాలు లేచేవికూడా ఉన్నాయి.

ఆస్పత్రిలో 'భిన్‌గ్రాముం' వాళ్ళు కూర్చుని ఉన్నారు. శశి వెంటనే బయలుదేరి వెళ్లాలక్కడికి. ఇప్పుడేకే కుసుమదగ్గర్నుంచి వచ్చిరావడంలోటే వెళ్ళిపోవాలి. ఎన్ని ఆలోచించుకోవాలి అతడు? మనస్సును కొంచెం స్థిమితపరుచుకోవాలి ముందు.

"ఇరవై రూపాయ లివ్వాలి బాబూ!"

"ఇరవై రూపాయలు! భిన్‌గ్రామంవాళ్ళు గతుక్కుమన్నారు.

"అలా వెర్రిమొహాలేసుకు చూస్తారేమిటి? ఇరవై రూపాయ లివ్వకపోతే పోయి ఏ నాటువైద్యుణ్ణైయినా చూసుకోండి."

ఆ వచ్చినవాళ్ళు కాళ్ళబచ్చుబడి, మెల్లిదిగా వెనక్కి జారుకున్నారు శశి వాళ్ళనుద్దేశించి తిట్టటం మొదలెట్టాడు. ఎందుకింత కోపం శశికి? ఇంత నైచ్యం దేనికి? మాటల్లో ఎందుకింత దూకుడు? శశి మనస్సు చాలాదిగులుగా వుంది. జీవితాన్ని విస్తృతం చేసుకోవాలని పిపాస అతడిలో ప్రేరేపిస్తోంది అని, ఎదుటనుంచుని ఎవరనుకోగల రివాళ?

శరన్ వచ్చాక, "వస్తానని ముందుగా చెప్పనుగదా, ఇంట్లో లేవేం?" అని అడిగాడు.

"అంత ప్రొద్దుండగానే వస్తారని అనుకోలేదు నేను" అన్నాడు శరన్.


శశి మరింతకోపంతో—"ప్రొద్దుండగా రాక, ప్రొద్దుక్రుంకాక వస్తానామరి? గొంతుపుండుని చీకట్లో ఎవరైతేమాత్రం ఎలా చూడగలుగుతారు? ఎలా మందు వేయగలుగుతరు? ఇహ ఇవాళ యేం లాభంలేదు, ప్రొద్దున రా" అన్నాడు.

శరన్ మర్నాడు ఉదయం రాలేదు. క్రితంరోజు సాయంత్రం తాను ఉద్రేకపడిన సంగతి గుర్తుకొచ్చి శశి కొంచెం బాధపడ్డాడు.

మధ్యమధ్య తనకెందుకీ పిచ్చిగుబులు తోలుస్తూ ఉంటుంది? ఎదురుగా కూర్చున్న వాళ్ళను కొట్టాలనిపిస్తూంటుంది. సామానులూ అవీ చిందరవందరగా పారెయ్యాలని అనిపిస్తూంటుంది. తాను ఒక్క అభాగ్యుణ్ణని తోస్తూంటుంది...ఎన్నెన్నో ఆశించి చివరికి ఏమీ పొందలేకపోయాననే అనిపిస్తుంటుంది. ఇలుసర్దటం అన్నపేరతో సామానులన్నీ చిందరవందరగా నట్టింట్లో పడేస్తే ఎలా ఉంటుందో అలాఉంది అతడి మనస్సు...జీవితమంతా అనవసరమైన వాటిని గురించిన ఆలోచనలతోనూ, పనులతోనూ వ్యర్థమయి పోయింది. తాను ఊరు విడిచిపెట్టి పోవాలనుకున్నందువల్ల లాభమేమిటి? తాను మొదట్నుంచీ ఇలాగే వెంటనే లభించె అవకాశం లేనివాటిని చాలావరకు ఆశిస్తూనే వచ్చాడు. వాటికోసమై ఎదురుచూసి చూసి చివరికి అనుభవంలోకి వచ్చినా ఆనందించగల స్థైర్యంకూడా సన్నగిల్లిపోతోంది మనస్సుకి. తన బుర్రలో ఏదో ఒకవిధమైన గందరగోళం ఉందేమో అని శశికి సందేహం ప్రారంభమైంది. భవిష్యత్తులో మరొకవిధంగా జీవించాలనే నిశ్చయాభిప్రాయం కలవాళ్ళు వర్తమానాన్ని నీరసమైనదాన్నిగా, నిరర్థకమైన దానినిగా భావించకూడదు. తనకేమి తక్కువ? తనకెందుకు విచారం? తనవద్ద రాయి రాయిలాంటి శరీరం—నలకూబరుని లాంటి రూపం. తనకి—ఐశ్వర్యమూ ఉంది. తనంటే ఆదరణా ఉంది ఊళ్ళో. ఎవరికి

(47-వ పేజీ చూడండి)





డబ్బుకోసం

అర్థరాత్రి మరి అంతా ఒళ్ళు మరచి నిద్రపోతున్న వేళ తలుపు కొడితే ఎవరు తీస్తారు? పైగా మా యింట్లో మూడు వాటాలవాళ్ళం ఉంటున్నాం. పగలంతా ఒళ్ళు విరుచుకున్న మగరాయళ్ళమంతా బతుకు బరువులు మరచిపోయి నిద్రా సామ్రాజ్యంలో రాజాధిరాజుల్లా విహరిస్తున్నాం. ఇప్పుడు మనకోసం తలుపు కొట్టేవా రెవరని మొదట ఊరుకున్నాను. మా ఆవిడకి అసలు తెలివే రాలేదు. మా కుంట వెధవని అక్కున చేర్చుకొని పడుక్కుంది. బహుశా కలలో పుట్టింటికెళ్ళి వాళ్ళ తమ్ముడిచ్చిన చీరవిప్పాగిడేస్తోందనుకుంటాను. తెలివి రానేలేదు కనక తలుపుతీసే ప్రశ్నే లేదు.

పోగా విశ్వనాథం కక్కయ్యగారు వస్తాండువరకూ ఎవళ్ళనీ నిద్రపోనియ్యకుండా కబురు చెప్పి చెప్పి అలసి సొలసి — నిద్రపోతారేమో. అతనికి ఉదయం ఎనిమిదికి ఏకంగా తెల్లవారుతుంది. ఆయన భార్య కూడా తినా తినకా తన తలిదండ్రులూ ఎంత గొప్పవాళ్ళో రాత్రల్లా తక్కిన రెండువాటాలవాళ్ళకీ చెవి తెంపేటనలకూ నోరు పీకేటట్టు ఉద్ఘోషించి కోపిష్టివట్టు పడుక్కుంది. ఆవిడకి తెలివి వచ్చినా నిండా కప్పుకొని పడుక్కునే ఉంటుంది. ఆవిడకి సుమారు పదహైదళ్ళయినదేళ్లు వచ్చినా ఇంకా మగాళ్ళని చూసి కొత్తపెళ్ళికూతురిలా సిగ్గుపడుతూనే వుంటుంది. ఎవరికీ తలుపు తీయడం ఆవిడ మతమే కాదు. ఇక మిగిలినదల్లా నేను. నేను పరోపకారినని యింట్లో వాళ్ళనుకుంటారు. (మా ఆవిడ కోపం వచ్చినప్పుడు ఈగుణాన్నే పూనుకొని తిరగడం అంటుంది.) ఇంట్లో అందరికీ నా దౌర్బల్యం తెలుసు. ముష్టివాడొచ్చి కేకేసినా జవాబు చెప్పకుండా ఉండలేను. అంతా యింట్లోనే వున్నా ఎవళ్ళ పనుల్లో వాళ్ళుండి తన కేమీ పట్టనట్టు, ఆ వచ్చిన బిచ్చగాడేదో నాతో పనుండి వచ్చినట్టు భావించి నేనే లేస్తానని ఊరుకుంటారు. అయితే ఇదంతా చెప్పడం నేను ధర్మాత్ముణ్ణని కాదు. సాధారణంగా బిచ్చగాళ్ళకి ఏమీ లేదని చెప్పి పంపివేస్తాను. నా స్వభావం వచ్చినవాళ్ళకి ఏదో సమాధానం చెప్పి పంపించడం.

ఇంతకీ అప్పుడు మరెవరూ లేచి రాగా లేరనుకుంటాను. నేనే తలుపుతియ్యవలసివచ్చింది. ఆ కటిక చీకటిలో వచ్చినమనిషి ఆడమనిషి అని మాత్రం గుర్తించగలిగాను. చేతిలో ఏదో సంచీ అయి ఉండొచ్చు. ఎత్తూ విగ్రహం చూస్తే రుక్కుపిన్ని విధవకూతురు కామాక్షిలా కనిపించింది. ఆ యింట్లో ఎవరూ మా బంధువులు కారు. అయినా అందరితోనూ మా వదినత్తక్కయ్యా అని వరసలు కలుపుకోవాల్సి వచ్చింది. వచ్చిన వ్యక్తి 'అన్నయ్యగారా? కులాసాగా వున్నారా'

కన్నసామి

అన్నది మెల్లిగా. గొంతుక వలకూడా కామాక్షే అని నిశ్చయించుకున్నాను. 'ఆఁ వచ్చేశారా' అన్నాను నిద్రమత్తు వదలని కంఠస్వరంతో. అంతా నిద్రా ముద్రితులై ఉండగా మాటలేమిటి. పైగా ఆ విడకూ నాకూ మాట్లాడుకొనే అలవాటు లేదు కూడాను. ఈ వసలో ఉంటున్న మూడు సంవత్సరాల్లోనూ ఇదివరకు ఒక్కసారే అన్నయ్యగారూ అన్నదావిడ. ఇది రెండో సారి. ఆవిడ నాకంటే బాగా పెద్దది. ఆ సంగతి తెలుస్తూనే వుంది. అయినా అన్నయ్య అనడంలోనే కామాక్షికి సబబు కనిపించి ఉంటుంది, చాలామంది ఆడవాళ్ళలాగే. ఆవిడ తనవాటాలో దూరి రుక్కుపిన్నినీ చెల్లెళ్ళనీ తమ్ముణ్ణీ లేపింది. స్వయంగా లేపక పోయినా వాళ్ళందరూ కామాక్షి వచ్చిందంటే లేస్తారు. అందుకు కారణం అందరికీ కావాల్సిన డబ్బు. కామాక్షి వెళ్ళడం డబ్బు కోసమే! వసే డబ్బు తెస్తుంది. తమకు లాభించక పోయినా — కామాక్షి పోయినభర్త ఆస్తులవల్ల వచ్చేడబ్బు పెద్దబాకీ లేవైనా తీర్చడానికి పనికొస్తాయని అందరి ఆశ. ఇంతసేపూ మెల్లగా వినిపిస్తున్న గుసగుసలూ వాగ్వాదాలూ హఠాత్తుగా ఆగిపోయాయి. రుక్కుపిన్ని కామాక్షిని తీసుకొని వీధితలుపు తెరిచి వెళుతోంది. మళ్ళా ఆ సంచీతోనే కామాక్షి బయటకు నడిచింది. రుక్కుపిన్ని వీధిలోకూడా పది నిమిషాలు కామాక్షితో మాట్లాడి చివరకి తనొక్కర్తె తలుపు గడియ వేసుకొని ఇంట్లోకెళ్ళి పడుకుంది. రుక్కుపిన్ని కామాక్షిని వెనువెంటనే అంత అర్ధరాత్రివేళ ఎందుకు బయటికి నడిపించిందో నాకు బోధపడలేదు. అయినా మనకెందుకీ పరిశోధన అనుకొని నిద్రపోయాను.

ఆ రోజునుంచీ కామాక్షి అసలు కనిపించలేదు. ఆ యింట్లో రుక్కుపిన్నికి పిల్లలకీ తప్పితే కామాక్షి వచ్చినట్టు మరెవరికీ తెలిసి వుండలేదు. అయితే నాకుమాత్రం నిశ్చయంగా తెలుసు. ఒచ్చిన మనిషిని అర్ధరాత్రి మళ్ళీ ఎక్కడికి పంపేశారో అన్న ప్రశ్న తక్కిన వాళ్ళకీ అక్కర్లేదు, వచ్చినట్టే తెలియదు కనక. నా కళ్ళతో నేను చూశాను. అయితేనేం ఇంట్లో కామాక్షి వచ్చిన ప్రసక్తి లేనేలేదు. రుక్కుపిన్నిగారింట్లో పిల్లల దగ్గర్నుంచీ అంతా ఇలేవాళ్ళు. వాళ్ళంతా ఒకేకట్టు. పూర్వం—ఆదేదో కథలో—నల్ల మేకని దొంగలంతా కుక్క అంటూ బ్రాహ్మణుణ్ణి నమ్మించినట్టుంటుంది వీళ్ళ సంగతికూడాను...ఓక సమాచారం—అది నిజమైనా అబద్ధమైనా—ఇంట్లో ఒకళ్ళు ఫలానాలా అయిందంటే—అది కాదని బ్రహ్మదేవుడొచ్చి వాదించినా లాభంలేదు. ఇంట్లో అంతా ఏకమైపోయి నిలబడి సమర్థిస్తారు. కామాక్షి వచ్చి వెళ్ళినట్టు ఆ యింట్లో ఒక్కళ్ళూ బయటకు పొక్కడంలేదు. నేను ప్రతిరోజూ ప్రతి గడియా ఈ సమస్యతోటే సతమతం అవుతున్నానని కాదు. కాని జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఆశ్చర్యపడుతూండేవాణ్ణి. కామాక్షిని బయటకు పంపేశారు అనుకోవడం పొరబాటే అవుతుంది. వాళ్ళకిమాత్రం తెలియదూ! పరస్పరాశ్రయాలు గల జీవులు వాళ్ళు.

ఆ వేళ ఆదివారం. నేను ఇంటిదగ్గరే వున్నాను. ఆదివారం అనగానే 9 గంటలకో సారి కాఫీ, పన్నెండుకి భోజనం అలవా

పోయింది. మా అమ్మ చివాట్లు వేసినా పన్నెండులోపుగా ఇల్లు చేరడం చేతనైతే కదా! నేనా వేళ యిల్లు చేరే అప్పటికి మామూలు వేళ అవనే అయింది. మా అమ్మ ఊరుకుంది ఎందుచేతనో.

ఇంటి యజమానురాలు సూరమ్మగారొచ్చినట్టున్నారు. ఆవిడ ఎంచేతో ఈ రోజు కొంచెం గట్టిగా మాట్లాడుతున్నారు. ఆవిడ రావడం, అద్దెలు వసూలు చేసుకు వెళ్ళడం ప్రతినెలా మామూలే! ఆవిడ ఎంతటి ఆర్థిక సమస్యనైనా తొణక్కుండా రంధిపడకుండా పరిష్కరించుకోగలదు. గంభీరంగా మృదువుగా మాట్లాడుతుంది సూరమ్మగారు. అలాటి సూరమ్మగారీ రోజు తొందరపడి విసురుగా మాట్లాడ్డం నాకాశ్చర్యం వేసింది. మా వాటాలోకి తిన్నగా వెళిపోయాను. నా భోజనం పూర్తవబోయేటప్పటికి సూరమ్మగారి గొంతూ, ప్రతిధ్వనిలా రుక్కుపిన్ని గొంతూ ఝూంమని ఊగిపోతున్నాయి. రుక్కుపిన్నిగారు సూరమ్మకి కొంచెం బంధువరంలో వాళ్ళే. సూరమ్మగారి తండ్రి—రుక్కుపిన్ని కుటుంబం ఆర్థికచిక్కుల్లో వుండగా కోలుకోవడానికి చేసిన సదుపాయమే ఈ యింట్లో బస. రుక్కుపిన్నిగారి కుటుంబం ఎవళ్ళ యింట్లో వున్నా అద్దెచెల్లించుకోలేక పోవడం, మూడు నాలుగు నెలల్లో ఖాళీచేసి మరొక యిల్లు చూసుకోవడం తటస్థించేది. డబ్బుసర్దుబాటు కాక ఒక నెల అటో యిటో అయితే ఏ యింటి యజమానీ క్షమించేవాళ్ళు కాదు. ఆ అవస్థలో రుక్కుపిన్ని-సూరమ్మ తండ్రిగార్ని తనకి గృహభిక్ష పెట్టమని కోరింది. ఆయన వృద్ధుడు. సహృదయుడు. తనకీ రుక్కుపిన్ని తండ్రికీ వుండే బాల్యస్నేహం తల్చుకొని తన యింట్లో వాటా యివ్వడానికి సమ్మతించాడు. వీలయినప్పుడల్లా ఇవ్వగలిగినంత డబ్బు యివ్వమని రుక్కుపిన్నికి ముసలాయన చెప్పాడు.

ముసలాయనకి సూరమ్మ ఒక్కతే కూతురు. ఆ ఆస్తిపాస్తులు ఆవిడకే చెందాయి. సూరమ్మ తన తండ్రిచేసిన సదుపాయం కాదనడం ఇష్టం లేక ఊరుకుందేగాని లేకపోతే రుక్కుపిన్ని కుటుంబం ఈ యింట్లో వుండడం తనకేమాత్రం ఇష్టంలేదు. అయినా సూరమ్మ అంత సులభంగా బైటపడే మనిషి కాదు. అద్దెమాత్రం సాధ్యమైనంతఖచ్చితంగా పుచ్చుకోడానికి ప్రయత్నించేది. రుక్కుపిన్నిగారికి నెలనెలా పూర్తిగా అద్దెయిచ్చుకోవడం కష్టమైపోతుంది. కొంత యివ్వడం కొంత వెనకబెట్టడం ఈ విధంగా ఆ అద్దెబాకీ ఏ అయిదారు నెలలకో పెద్ద మొత్తం అయి ఊరుకుంటోంది. ప్రతినెలా సూరమ్మగారు ఓ చిన్న దులుపుగులుపుతారు. లేదా సాధించుకు వెళ్తారు. ఇప్పుడు రుక్కుపిన్నీ సూరమ్మగారూ ఝూంమని ఊగిపోవడం చూస్తే ఇదే వ్యవహారం పాకాన బడ్డట్టే అనిపించింది.

నేను భోంచేసి వాలుకుర్చీమీద మేను వాలేశాను. సూరమ్మగారి ఉద్రేకం కట్టలు తెంచుకుంటోంది. ఆవిడ నా వైపు తిరిగి నాతో చెప్పడం ఆరంభించింది. "చూడవోయ్ పంతులూ. ఈవిడ అర్నెలయింది కానీ అద్దెయివ్వలేదు. ఎన్నాళ్ళిలా ఆటలాడుతుంది అంటాను. మనిషన్నవాళ్ళకి కృతజ్ఞత వుండాలోయ్. సిగ్గూశరం విడిచినవాళ్ళందరిదీ ఒక జన్మేనా?" సూరమ్మగారు గురిపే నూంటే రుక్కుపిన్ని నన్ను చూసి ఎందుచేతో లోపలికి వెళింది. వెళుతూ "నామాట వినిపించుకుంటే కదూ! ఇవతల వీళ్ళ యిబ్బందులేమిటో తెలుసుకుంటేనా?" అన్నది. సూరమ్మగారు మళ్ళీ శివం ఎత్తినట్టన్నారు. "అర్నెల్లబట్టీ అంటున్నావమ్మోయ్ అమాటేను. 'మా అమ్మాయి బెజవాడ వెళ్ళుతుంది డబ్బు తెస్తుంది' అన్నావు. 'వెళుతుంది వెళుతుంది' అని అర్నెలు కాలక్షేపంచేశావు. వెళ్ళి నెలరోజులయినా ఇంకా రాలేదు. 'వచ్చేస్తుంది వచ్చేస్తుంది' అని ఇంకెన్నాళ్ళమ్మా నన్ను తిప్పుతావూ! ఇదంతా వన్నాటలు పట్టిసున్నావా?"

నాకు తలలో ఏదో కరుగుతున్నట్టు అనిపించింది.

సూరమ్మగారు ఈ నెలలో ఏయే తారీకుల్లో వస్తారో రుక్కుపిన్నిగారి కుటుంబం అంతటికీ తెలుసు. సూరమ్మగారెప్పుడు తన వూరినుంచి బయలుదేరి వస్తుందో, ఎవళ్ళకి ముందుగా తెలియజేయడానికి ఉత్తరం వ్రాస్తుందో, అదంతా తెలుసు. సూరమ్మగారు వచ్చే అప్పటికి 'కామాక్షి ఇంకా బెజవాడనుంచి రాలేదనీ త్వరలో రావచ్చనీ' రుక్కుపిన్ని విన్నవించుకుంది. సూరమ్మగారు నమ్మినా మానినా అప్పటికంటే చేయగలిగిందేమీ లేక మరి నాలుగు చివాట్లు పెట్టి వెళిపోయారు. "నేను మళ్ళా వొచ్చినప్పటికి ఖర్చయిపోయిందంటే లాభం లేదమ్మోయ్. మీ అమ్మాయి వచ్చిన వెంటనే డబ్బు పంపిసే సరి – లేకపోతే మళ్ళా నేనొచ్చినప్పుడు, ఎందుకు యిల్లు ఖాళీ చెయ్యరో చూస్తాను." అంటూ నిష్క్రమించింది. సూరమ్మగారు.

నాకు నిజంగా మూర్ఛ వొచ్చింది.


ఆ రాత్రి తెల్లవారిందో ఇంకా లేదో కామాక్షి ప్రత్యక్షం. ఆహా! ఏమి ఆలోచన! ఎంత చక్కని నిగూఢమైన ఏర్పాటు!! రుక్కుపిన్ని బుద్ధిచాతుర్యానికి నిజంగా నాకు ముచ్చటవేసింది. రుక్కుపిన్ని— "వచ్చావా అమ్మా! నువ్వింకా బెజవాడ నుంచి రాలేదని..." అంటూ మా రెండు వాటాల వాళ్ళకీ వినిపించేటట్టు పలకరించింది.

రుక్కుపిన్నీ కామాక్షీ మాట్లాడుకుంటున్నారు.

"పాపం సూరమ్మగారు మళ్ళా వొచ్చే అప్పటికి డబ్బుంటుందో ఖర్చయిపోతుందో ఏమిటో! ఈవారం రావలసింది" అన్నది కామాక్షి బహిరంగంగాను. రుక్కుపిన్ని కూడా "అవునవును. నిన్నను అనవసరంగా నోరుపారేసుకొని వెళ్ళిందిగాని ఒక్కరోజు ఆగలేకపోయింది" అని అందించింది

"నోరు పారేసుకుంటే మాత్రం, డబ్బు పారేసుకుంటారుటమ్మా. అమ్మాయి ఇవాళ వస్తుందని చెబితే, ఒక్కరోజేం కర్మ మీ యింట్లోనే వుందును" అంటూ ప్రవేశించిన సూరమ్మగార్ని చూసేసరికి రుక్కుపిన్నికీ కామాక్షికీ నోరు పెగలేదు. ఆ యింట్లో వాళ్ళంతా ఎక్కడవాళ్ళక్కడ స్తంభించిపోయారు. "మా సీత కొడుకు ఉన్నాడు చూశావూ నాయినా. ఆ కుర్రవెధవ నన్ను దొడమ్మా నువ్వెప్పుడు ఊరికెళ్తావని నాలుగు రోజులయింది తినేస్తుంటే ఏంవిటో అనుకున్నాను. ఈ గుంటవెధవ నా ప్రయాణాలెప్పుడో తెలుసుకొని చేసే రాచకీయాలేంవిటో, ఎవరికోసం అడుగుతున్నాడో— వాణ్ణి రెండురోజులింట్లోంచి కదలనివ్వక పోయేసరికి బయటపడ్డాయి."

నావైపు తిరిగిన సూరమ్మగారి ముఖం విజయభేరి— మోగిపోయింది ★



సీత నవ్వింది

మా ఆవిడ "అబద్ధం" ఆడిందంటే శాస్త్రం చెప్పిన తరి హాయిగా గోడ పెట్టినట్లే! కాని ఆ గోడలో ఆమె ఎంచక్కటి కిటికీ అమర్చి, దాంట్లోంచి ముచ్చటగా తొంగిచూసి ముసిముసిగా నవ్వుతుంది. ఆ నవ్వులోని అందాలని అనుభవించడం నా సంసారపు ఆనందాలలో ఒకటి. ఆ నవ్వు ఆమె ఎంతో కట్టుదిట్టంగా ఆడుకువచ్చిన నాటకానికి భరతవాక్యం. ఆ వేళాకోళానికంతకీ లక్ష్యం నేనే అయినా, ఆ నవ్వు నన్ను ముగ్ధుణ్ణి చేస్తుంది. అది ఆమె చిలిపితనానికి వచ్చే నవ్వు.

అటువంటి సరదా నవ్వి వేళాలు మా జీవితంలో అడపా తడపా వస్తూనే ఉన్నా, వాటి కొత్తదనం మాయకపోవడానికి కారణం మా ఆవిడయొక్క నటనాకౌశలమే! మా ఆవిడ నాటకం ఆడుతోందన్న విషయం నా కంటు చిక్కనిస్తేగదూ! ఆమె ముఖంలో ఏమీ మార్పుండదు. గొంతుక తాపీగానే ఉంటుంది.

DL. 4664-X52 TL

అనుమానం తోచినప్పుడు నేనా దొంగ నాటకం గోడ పొడుగునా కిటికీకోసం తడుముకుంటూపోతాను. కాని దాంట్లో ఆమె చిలిపి నవ్వు చిదిపి దీపం పెట్టే వరకూ అది నాకు గోచరం కాదు. అప్పుడు — ఆ నవ్వు ముఖంలో ఎంత అందం!

నేను ఉడుకుమోతు రకం మనిషిని కాను. ఇల్లాంటి సరదాలంటే నాకు సరదాయే. అప్పుడప్పుడు ఆమె మందీ ఆమెకు నేనూ రుచి చూపిస్తూనే ఉంటాను. కాని ఆ తమాషా వేరు. ఆమె చిలిపితనంలో మంచి నేను పొందే ఆనందం వేరు. ఆ సంఘటనల్ని నేను మళ్లా మళ్లా నెమరుకు తెచ్చుకుని ఆ సుఖాల్ని మళ్లీ పొందుతుంటాను.

'మొన్న ఒకటవ తారీఖునే తమాషా ఒకటి జరిగింది. ఆనాడు ఉదయం నేను టిఫినుకి కూర్చున్నాను. నా దృష్టి కొత్తగా తిప్పిన కేలెండరు కాగితం మీద పడింది. దాంట్లో ఒకటవ తారీఖు చుట్టూ ఎర్ర పెన్సిలుతో గీసిన చక్రం నా కళ్ళ నాకర్షించింది. ఏమిటా రోజు విశేషం? అని ఆలోచించేను. కాని ఏమీ తట్టలేదు.

యథాలాభంగా మా ఆవిడని "ఏమిటి రోజు" అని అడిగేను. ఆవిడ ఆశ్చర్యం కనబర్చింది. "బాగుందండోయ్! ఈ వేళ ఏమిటో జ్ఞాపకం లేదంటే, మీ సంసారం మీద మీకెంత ప్రేముందో తెలిసిపోయిందిలెండి!" అంది. ఆమె అల్లాగ అన్నప్పుడు ఏ ముఖంపెట్టుకుని నా అజ్ఞానాన్ని ఒప్పుకోను?

ఉదయం ఆఫీసులో ఆలోచనలు సాగించేను. నా పుట్టిన రోజా? ఊహూ! ఆమెదా? కాదే! అబ్బిగాడిది మొన్ననే వెళ్లింది. వివాహ వార్షికోత్సవం? అబ్బే! మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చినప్పుడు ఆచూకీ దొరకకపోదనుకున్నాను. కాని భోజనానికి ప్రత్యేకమయిన పిండి వంటలేమీ లేవు. పదార్థాలు ప్రతిరోజూ లాంటివే అయినా, వాటిలో ఏదో కొత్తదనమూ, స్వాదిష్టతా కనబడ్డాయి. కాని, ఆమె వైఖరిలోనూ మాటలలోను మార్పేమీ లేదు. వంటకాల రుచిని గూర్చి ఆమె కభివందనలు చెప్పి, నే నాఫీసుకు వెళ్లబోయేను

అంతలో ఒక ఆశారేఖ కనబడింది. మేము నెలకి కావలసిన సరకులన్నీ ఒకటవ తారీఖున తెచ్చుకోవడం అలవాటు. ఆమె ఇచ్చే సరకుల జాబితాలో ఏవైనా ప్రత్యేక విషయాలుంటే వాటి నుంచి దొరకవచ్చుననుకున్నాను. అడగగానే ఆమె జాబితా అందించింది.

దారిలో జాబితా విప్పి చూసుకున్నాను. మామూలు చిన్న డాల్డా వనస్పతి డబ్బాకి బదులు పెద్ద డబ్బా తెమ్మనడం తప్ప ఆమె దాంట్లో చేసిన మార్పేమీ లేదు. మేం 'డాల్డా'ని పిండివంటలకి వాడుకునే వాళ్లం కనక సాయంత్రం ఏదో తతంగం ఉందని సూత్రం స్థిరపడింది.

మధ్యాహ్నం ఆఫీసులో నోములూ, వ్రతాలూ ఏకరువుపెట్టుకున్నాను. ఉహుఁ! ఏవీ సరిపడలేదు. చివరికి నిశ్చయానికి వచ్చేను. నా సిగరెట్లు ఖర్చు తగ్గించుకుని ఆమెకు పది రూపాయలు బహుమతి ఏదైనా ఇవ్వాలని. కాని సంగతేమిటో తెలియనిదే తగిన బహుమతి ఏదో నిర్ణయించడ మెల్లాగ? రొఖ్ఖమే ఇస్తే మంచి దనుకున్నాను. మెల్లగా డబ్బు ఆమె చేతిలోపెట్టి, అంతా తెలిసినట్లు నటించి, ఆమెనుంచి కూపీ లాగాలని నా ప్లాను. సాయంత్రం కాఫీ వేళ సరదాగా కబుర్లు మొదలెట్టేను. పది రూపాయలకి పీక్లు వదలుకోవడం వరకే

నా ప్లాను పారింది. మిగతాది బెడిసికొట్టింది.

"థేంక్స్!" అందామె, నోటు అందుకుని

అప్పుడు నా నీత నవ్వింది. దొంగ నాటకాల గోడలో కిటికీని వెలిగించే చిలిపి నవ్వు!

"ఇంత ఎం చక్కటి బహుమతికి కారణమేమీ కనపడకపోవడం మూలాన్ని, మధ్యాహ్నం వంటని గురించి మీరు నోటి మాటగా అన్న అభివందనల కిది రొఖ్ఖ రూపం అనుకుంటాను." అని కిలకిలలాడింది.

నేను విస్తుపోయాను. "మరి...ఏదో ఉండి తీరాలే! నువ్వే అన్నావ్! పైగా పిండివంటల కోసమే కదూ, పెద్ద 'డాల్డా' డబ్బా తెమ్మన్నావ్?


"ఓ! అదా?" అందామె నవ్వుతూ. "ఆ డబ్బా రోజూ వాడకానికి. వాళ్ల రామలక్ష్మి 'డాల్డా' పిండివంటలకి మాత్రమే కాక అన్ని వంటలకీ వాడ వచ్చునంది. ఆమె వంటకాల రుచి ఆ విషయాన్ని ఋజువు పరిచింది. కనక నేను నూనె సీసా నల్లా ఉంచేసి, మధ్యాహ్నం వంటంతా 'డాల్డా'తోనే చేసేను. పదార్థాలు ఎంచక్కా ఉన్నాయని మీరే అన్నారు" అన్నది.

"ఆ మాట నిజమే." అన్నాను నేను నోటుకేసి చూడకుండా.

"దానికి కారణం 'డాల్డా' యొక్క ప్రాశస్త్యమే!" అందామె. "అది పదార్థాలలోని అసలు రుచిని బయటికి రప్పిస్తుంది. ఇంకా సుగుణాలు చూడండి. 'డాల్డా' సీలువేసిన డబ్బాలలో అమ్మడం వల్ల కల్తీలకీ మురికికీ అవకాశం ఉండదు. పైగా దాంట్లో 'ఎ', 'డి' విటమిన్లూ కలుపుతారు. ఆరోగ్యాని కవసరమయిన ఈ సుగుణాలు—పోషకత్వమూ, విటమినులూ—రోజూ మనకి లభ్యమయేటట్లు చూసుకోవాలి కాని, పిండి వంటల వాడుంటే చాలుననుకుంటే ఎల్లాగ చెప్పండి?"

"మరే!" అని ఒప్పుకున్నాను నేను. "కాని, పెద్ద 'డాల్డా' డబ్బా మరచిపోకుండానా నువ్వు కేలెండరుమీద గుర్తుపెట్టేవు?"

అవునందామె. "చెంగు ముడేసుకుందామనుకున్నాను, కాని ఈవేళ సరకులు తెచ్చుకునే రోజవడంవల్ల కేలెండరుమీద గుర్తుపెట్టడం మంచిదనిపించింది. అది లాభకరం కూడా అనిపిస్తోందిప్పుడు." అంది మళ్లీ నోటు వాడిస్తూ.



మగవారికి మాత్రమే!

హత్య జరిగింది. అపరాధికి యిన్నాళ్ళకి తగినశిక్ష దొరికింది. ఆ నల్లని దుర్మార్గురాలు ఆఖరికి పీకపిసుకబడి రక్తంకక్కి చచ్చింది.

విశ్వం లైటు వెలిగించాడు. దుప్పటిమీద అక్కడక్కడ ఎర్రని మరకలు. ఇంకా వీపుమీద ఏదో పాకుతున్నట్టే ఉంది. అబ్బ, ఏంనల్లులు, ఏనల్లులు బాబూ!

నిజంగా దేవతలు ఎంత తెలివైనవాళ్ళు! ఏంచేస్తారుమరీ,నల్లి లేనిజాగా వాళ్ళకెక్కడా కనిపించివుండదు. స్ప్రింగు డబుల్ కుషన్ మొదలు రోజ్ ఉడ్ కాట్ వరకూ, పట్టె మంచం మొదలు పందిరిమంచంవరకూ అన్ని రకాల శయ్యలూ చూసేవుంటారు. హాయిగా నేలమీద పడుకోడానికికూడా వాళ్ళకి మనస్కరించలేదు. ఏమూలనుంచి వచ్చి అంటుకొడుస్తుందో! ఈనల్లిబాధ పడలేక శివుడు మామగారి కొండమీద మంచు మీద డాబామీద పక్కేశాడు. విష్ణుమూర్తి పాలసముద్రంలో పాముమీద పవ్వళించాడు. సూర్యచంద్రులు ఆకాశంమీద బిచాణా వేసి మరి దిగలేటట్టు. ఇలాంటి విషయాన్ని అనుభవించి పలవరించిన కవి చమత్కారానికి ఒక్క నమస్కారంగాని...మానవ మాత్రుడైన విశ్వానికి మరి కన్నుమూత పడలేదు. అలా లేస్తూనేవున్నాడు అలా గోక్కుంటూనే ఉన్నాడు. అలా పక్క దులుపుకుంటూనే వున్నాడు...అలా ఆలోచిస్తూనే ఉన్నాడు.

వారానికోమారు చెవికి బాగా కీయిస్తే మళ్ళీ చెప్పకుండా పనిచేసుకుపోయే ఇంటివారి గోడమీది టిక్కుటిక్కు టక్కులాడి ఆరుసార్లు టంగ్ టంగ్ మనిపించేవరకూ విశ్వం వింటూనే వున్నాడు. జతలేని అతిబాధలో శశిలేని నిశరాత్రిలో బ్రహ్మచారితో సహచారిగా ఊకొట్టేది జోకొట్టేదీ గడియారం వారి గంటమ్మ ఒక్కర్తేనేమో!

ఇంటి ఆయన జానకిరామయ్య గుర్రు యింకా స్పష్టంగా వినిపిస్తూనే ఉంది. ఇవతల గదిలో తను తెలవార్లూ నల్లులతో జాగరం చేసి – పక్కగదిలోనే పడుకున్న ఆయన రాత్రి ఎనిమిదింటికి పడుకుని ఆరంటికలా లేస్తున్నాడూ! ఆ ఆరింటి కయినా ఆ యిల్లాలు అకేం అపరూపమోగాని ఆయన్ని లేవనియ్యదే!

'పడుకోండి, పడుకోండి...ఇంకా ఆరే అయింది...అప్పుడేలేచి ఏం చెయ్యాలి... అబ్బా, ఏమిటమ్మ పాపా ఆగోల...నాన్న పడుకున్నారు ఊరుకోవే. లేచిందగ్గర్నుంచీ నిముషం విశ్రాంతి ఉంటేగా...పడుకోండి' ఆవిడ అతని పీకల వరకూ రగ్గుకప్పి పిల్లనోరు నొక్కి తలుపు జేరేసింది! ఇదేకాదు. ఆయన హాయిగా నిద్రపోడానికి ఆవిడ పడే తాపత్రయం ఇంతా అంతా కాదు. రెండు రోజులకోసారి మంచం పట్టెడ విప్పేసి ఉతుకుతూ ఉంటుంది. ఎండలో పట్టె మంచం తిరగేసి పెడుతూంటుంది. కోళ్ళ కింద పిడకలు పెడుతూంటుంది. వేణ్ణీళ్ళు సలసలా కాగేవి తెచ్చి మంచంకోళ్ళ మూలలో పోస్తూ ఉంటుంది. నాలుగుకోళ్ళ కిందా డబ్బాలలో నీళ్ళు పెడుతూంటుంది. నల్లిని నాశనం చెయ్యడం తప్ప ఈవిడకి పనిలేదా అనిపిస్తుంది. అయినా చేసింది

ఆవసరాల రామకృష్ణారావు

తక్కువే అని ఆవిడ అభిప్రాయం.

"అబ్బబ్బా...మా యింట్లో ఈ నల్లులు బాగా ఎక్కువై పోయాయండీ... ఆయన ఆఫీసుపని చేసుకుని అలసలసి వస్తారా. కాస్సేపు కన్నుమూస్తే మాంచి నిద్రవేళ లేచికూచుంటారు. 'ఇదుగో నల్లి, అదిగో నల్లి' అనుకుంటూ 'వీపుమీద ఏదో పాకుతున్నట్టుంది...ఇదిగిదిగో యిక్కడ...ఇటు వైపుగోకు... గట్టిగా...!' అంటూ. దొరికిందా దిక్కుమాలిన ముండ. దీని ముఖం మండ. నలిపెయ్యి, రాసెయ్యి' అనుకుంటూ. ఎంతకని ఈ నల్లుల వేట? అక్కడికీ నాలుగు కోళ్ళ కిందా గిన్నెలతో నీళ్ళు పెడితే ఆ సంగతి కనిపెట్టేయి కాబోలు — దూలం ఎక్కి సరిగా మంచంమీద ఒకటి ఒకటి రాలుతున్నాయి! ఇంకెందారి! ఆయన ఆఫీసుకివెడితే కుర్చీకింద కుషనులో నల్లి. ఇంటికి వస్తూంటే బస్సుసీటులో నల్లి. కాస్సేపు ఏ మేట్నీకో వెడితే సినిమాలో నల్లి. ఇంటికివచ్చి కాస్సేపు రెస్టు తీసుకుందామనుకునేసరికి అక్కడ కూడా ఈనల్లి తల్లోతల్లో తయారయితే ఎలా చెప్పండి? అందుకనే ఎంత జాగ్రత్తయినాపడుతున్నాను. పడతాను మీలాంటి చదువుకునే కుర్రాళ్ళకేం తెలుస్తాయి ఇలాంటి బాధలు? రాత్రి పడుకుని పగలు లేస్తారు అంది ఆవిడ ఒకసారి విశ్వంతో.

అవునవును ఎవరిబాధ ఎవరికి తెలుస్తుంది? కూతుళ్ళు లేనివాళ్ళకేం తెలుసు అల్లుళ్ళ బాధ? అయినా ఈవిడకి మొగుడంటే ఎంత అనురాగం, ఎంత అభిమానం, ఎంత అపురూపం! అందరు ఆడాళ్ళూ అలాగే ఉంటారా? ఎందుకుండరూ, రేపొద్దున్న తన...

గులాబీల పరిమళం, జిలేబీల మధురసం ఒక్కసారి పలకరించి విశ్వం మనసు పులకరించింది. మెరుపుతోల...వెలుగుడోల... ఎప్పుడు, ఎప్పుడోనుంది ఆ వలపుబాలకి ఆరు గంటలకిరువాత విశ్వంకనిన పగటికలల్లోంచి మందయాన మందమంద మంజులింపులు ఎన్నో వినపడ్డాయి.

'అబ్బా...ఏం మొగాళ్ళు బాబూ మీరు! ...అయిదునిమిషాలు ఆడదిక్కు లేకపోతే గంజనపడచేపల్లా విలవిలాడి పోతారు ... ఏమిటిదీ? మానవమాత్రులు నివసించే కొంపేనాయిది?...ఎవరు కాపురం చేస్తుందండీ మీతో యింట్లో...రామరామ... దీన్ని తుడిచి ఎన్నాళ్ళయిందీ?'

'చంటిపిల్లాడిలా యిలాగేనా కాలేజీ పుస్తకాలు చిందరవందరగా పారెయ్యడం? ఈనోట్ బుక్ యిలాగేనా సగం తెరిచి ఓమూల పారెయ్యడం? ఈ సిగరెట్టుపీకలన్నీ ఇంత జాగ్రత్తగా దాచారెందుకూ? మీకు పుణ్యముంటుంది. ఓసారి అవతలి కెళ్ళుదురూ బాబూ కాస్త గదిచులిపి శుభ్రంచేస్తాను... ఈగది తుడవగా వచ్చినమట్టితో రెండు మట్టి యిళ్ళు కట్టించొచ్చు...'

'ఎక్కడ చూసినా ఏం మరకలమ్మ గదిలో...కాఫీ మరకలు, నూనె మరకలు... సిరా మరకలు సిగరెట్టు పీక తుడిచిన మరకలు... నావల్లకాదు బాబూ యీ గదిని బాగు చెయ్యడం...'

ఇంటిశుభ్రం లేకపోయింది సరే, ఒంటి శుభ్రమేనా లేదమ్మా ఈ మనిషికి...ఇంకా అలా చూస్తారేమిటండీ ఇస్త్రీలు ఆసలా మొహం మీరూను! నే డబ్బులిచ్చుకుంటానుగాని ఆ జాతీయ క్షౌరశాలలో గడ్డం గీయించుకురండి. ఆ తల కాస్త పైకిదువ్వుకోండి మా శ్రేకుం డాఉన్నాం...కొంచెం పౌడరద్దుకోండి మరేం పాపం కాదు.'

'చాలుగాని ఆ పక్కమీంచి కాస్త లేచి యివతలికిరండి...రమ్మంటే ... ప్లీజ్ ...

ఇదేంమంచం బాబూ ఈ కన్నాలలో నలుతేం ఖర్మ... బల్లులా... ఇంకా చెప్పాలంటే పిల్లులేపడతాయి... లేవండి దులుపుతాను... అబ్బ... లెమ్మంటే'

'ఎక్సలెంట్!' అని తనకు తెలియకుండానే అరిచాడు విశ్వం... దానితో అతని కలలోని వెలలేని దృశ్యం అదృశ్యమైంది. 'ఎంత హాయి! ఏమి జాయి!' అనుకున్నాడు విశ్వం. అతని కంటికి అప్రయత్నంగా నవారు మీద షికారుచేస్తున్న నల్లి కనిపించింది. హాత్యైహాత్య చేయ. దానికి అతనికి ఇష్టం లేకపోయింది. 'ఇంకెన్నాళ్ళీ నీ ఆటలు?' అనిమాత్రం అతని మనసు సగర్వంగా ప్రశ్నించింది. దానిమీద కసికొద్దీ అన్నట్టు అప్పటికప్పుడు వాళ్ళమ్మకు ఉత్తరం రాశాడు.

'అమ్మా, నేనదివరకు రాసిన ఉత్తరం అందేఉంటుంది. గ్రంథస్సమధ్య సిగ్గుపడి అలా రాయవలసివచ్చింది... మరోలా అనుకోవద్దు. నీవు కోరినవిషయం నాకేం అభ్యంతరం లేదు... పెద్దవాళ్ళు నువ్వు అన్నయ్యా ఎలా అంటే అలాగే... ఓయ్యా పూర్తయిందాకా ఆగాలనే పట్టింపుకూడా నాకు ఇప్పుడు లేదు... ఎప్పుడు రమ్మంటే అప్పుడు వస్తాను.

విశ్వం—

* * *

అవతల గొళ్ళెం పెట్టిన చప్పుడైంది. పెళ్లి అయినవారి అనుభవాలూ, అవనివారి అంచనాలూ... అమ్మలక్కల తలపులన్నీ తలుపు దగ్గరే ఆగిపోయాయి. లోపలికి వచ్చిందీ, బయటకు వెళ్ళలేనిదీ శేషులు ఒక్కతే. అనుభవం లేకో ఆనందం భరించలేకో అయిదు నిమిషాలు ఆలోచించి పానుపుమీద విశ్వం... ఒణికిపోతున్నా 'క' భాషలో హాస్యం తొణికించాడు. 'కక కబు కయ'

లతాంగి కొని ఆ అమితాంగి మింగినట్టు చూసింది. చూస్తూ నవ్వింది. నవ్వుతూ దగిర కొచ్చింది. ఓస్తూ విశ్వం ధైర్యం ఎక్కువ చేసింది. దానితో అతడు 'బతికుండగా కీర్తిశేషుడైన రంగరాట్నావి' చేత పావలాయిచ్చి రాయించుకుని కంఠతా పెట్టిన ప్రాసబాస కవుతిరా ఏకరువు పెడదామనుకున్నాడు. 'నా మనసే లం దివానువి, నా ఫిడేలు కమానువి......

'......అవునవును. మీదాసి సమానిని ...మీ యింటి జవానుని... అడవిలో మానుని... అడవాన్ని నన్నెందుకు ఏడిపిస్తారు? నన్నెందుకు ఎతిపొడుస్తారు?' ఆ సుకుమారి కుమారి మారి భోరుమంది. చెడిసిగొటన ప్రేమపాఠం కధానాయకుడు ఆనోరెంగని చిన్నదాన్ని ఊరుకోపెటేసరికి చేతిరుమాలుతో తనకళ్ళు అద్దుకోవలసి వచ్చింది.

ఆతరువాత పిడు మల్లెపువ్వులెత్తు ఆ ఎత్తినిన్నది అడిగిన ప్రశ్నలూ చేసిన భోగట్టాలూ చెప్పుకోతగినవి.

"మీ అన్నదమ్ములు అస్తి పంచుకున్నారా? ఒక్కొక్కళ్ళకి ఏమాత్రం వస్తుందీ? ఇంతకీ ఈ యిల్లు ఎవరికీ?'

'మా నగారు అత్తగారిమాట జవదాటరుట, నిజమేనా?'

'అన్నట్టు మీ అమ్మగారి కేమాత్రం నగలున్నాయి? అవిడ తరువాత ఎవరికి వస్తాయో!?'

'మీ పెద్దక్కయ్య మొగుడు చిన్నప్పుడే పోయాడా? అవిడకి అత్తగారి వైపున ఏం రాదూ? మరి ఎప్పుడూ యిక్కడే ఉంటారేం?'

'మీ చినక్క మొగుడికి ఎంతజీతం? ప్రతి పండుక్కీ యిక్కడికి పిలుస్తారా? బట్టలూ అవీ బాగా పెడతారా?'

'మా తోడికోడలు పురుడు యిక్కడే పోసుకుందిటేం? మా అత్తగారు పంపరా? వాళ్లు తీసికెళ్లరా?'

'మీరంటే యింట్లో అందరికీ యిష్టమేనా?... యింటికోడల్ని కాబట్టి తెలుసుకుందామని అన్నీ బాధ్యతగా అడుగుతున్నాను. మరోలా అనుకోకండేసుమండీ'

విశ్వం యీ ప్రశ్నలన్నిటికీ జవాబులు చెబుతూ చెబుతూ మొట్టమొదట 'బహువిధాలా భారీగా తోచే భార్యని భరాయించడం భారంకదా!' అని ముక్కుమీద వేలేసుకున్నాడు. తరువాత 'శతవిధాలా సహధర్మచారిణి అయిన దాన్ని అనుమానించడం నేరంకదా!' అని గుండెమీద చెయ్యేసుకున్నాడు. అన్ని జవాబులూ విని శేషులు మొహం విచారంగా ఉండడం అతనికి ఆశ్చర్యం కలిగించింది.

'ఎండలోంచి నీడలోకి వచ్చాననుకున్నాను... నీళ్లలోకని నాకేం తెలుసూ? మా అమ్మకి మేం ఎనమండుగురు ఆడపిల్లలం. మా చిన్నక్కకి ఏడుగురు ఆడపిల్లలు. మా బుల్లెక్కకి అయిదుగురు. నాకు కనీసం నలుగురు ఆడపిల్లలైనా పుడతారు. మీ చదువూ ధోరణీ చూసి మీ జీతం నాలుగొందలు దాటేటట్టు కనపడదు... వచ్చే పాయ్యెకొంప... లెక్క చూసి మనిషికి ఎకరన్నర రాని ఆస్తి... సరి... మీ పెద్దక్క, పిల్లలు తప్పరాయె... ఇక యీ పిల్లలకి పెళ్ళిళ్లు ఎలా చేసేది? ముదూ ముచ్చట్లూ ఎలా తీర్చేది?'

ఆడాళ్లని పాటలగంధులు అంటారు. 'మాటల గ్రంధులు' అని ఎందుకనరో అనుకున్నాడు విశ్వం. పెళ్లినాటి ప్రమాణాలు సంస్కృతం. మనకి బోధపడవు (సినిమా చూస్తేతప్ప) అయితే కార్యంనాటి కబుర్లు ఇంత ప్రాకృతమా?
విధి కృతం యింత వికృతమా! అనుకున్నాడు విశ్వం.

* * *

అయిదేళ్లు గడిచాయి. విశ్వం యిప్పుడు అసిస్టెంటు యింజనీరుగా రెండువందల యాభై గ్రా చేస్తున్నాడు. ఊదిగా లక్షణంగా అయిదుగురు పిల్లలతో తలవంచి కాపురం చేస్తున్నాడు. అతని జీవితంలో చెప్పుకోదగ మార్పులేవీ లేవుగాని ఒకనాడు ఐస్సులో యింటికి వస్తూంటే అతనికి రోడ్డు



ముగ్గురు ఋషులు తపస్సు చేసుకుంటున్నారు. ఒకగుర్రం వారిపక్కగా దూసుకుపోయింది. అది వెళ్లిపోయినతరవాత ఐదేళ్లకి ఒకఋషి పక్కాయనవేపు తిరిగి 'ఇపుడు ఇలా వెళ్లిన గుర్రంతోక తెలుపు' అన్నాడు.

ఇది జరిగిన మూడేళ్ళ తరవాత పక్కాయన మందహాసంచేసి, 'కాదు నలుపు' అన్నాడు.

ఇంకో రెండేళ్లకి మూడోఋషి కొంచెం చిరాకుపడి "మీ రిలా చీటికీ మాటికీ పోట్లాడుకుంటే తపస్సుసాగదు. నేవెళ్తా" అని లేచిపోయాడు.

★ మగవారికి మాత్రమే! ★

మీద తను కాలేజీ చదువు వెలిగించే రోజుల్లో అద్దెకున్న యింటాయన కనిపించాడు. పలకరిద్దామనుకొనేసరికి బస్సు కదిలిపోయింది. ఆ యిల్లు...ఆ యింటావిడ...తినగది...నల్లుల మంచమూ యివన్నీ ఒకదాని తరువాత ఒకటి జ్ఞాపకం వచ్చి భారంగా అడుగులు వేసుకుంటూ యిల్లు చేరుకున్నాడు...అయిదు నిమిషాలు ఆ పీటమీద ఏం కూచున్నాడో నాలుగు మెతుకులు ఎంగిలిచేసి లేచి గదిలోకివెళ్లి పరధ్యానంగా పడుకున్నా...అయిదు నిమిషాలు ఏం సుఖపడ్డాడో అంతే...ప్రవేశించింది...తగనిగోల...ఈ ముముడోల...పిసుకుబాల!

'మూడోవాడికి నాలుగురోజుల్నుంచీ చెవి పోటుగా ఉంది, ఆ చలపతిరావుకి చూపించమంటే...ఆరే పరికల్లా పక్కమీద పానుపేశారా? ఇంత పట్టించుకోకపోతే నేనెలా చావనండీ? చంటివాడికి ఫారెక్స్ తెచ్చారా? అబ్బె ఎందుకు తెస్తారూ? అన్నిటికీ నే ఉన్నాగా జీతంలేని నౌకర్ని! బెల్లంకొట్టిన రాయిలా మాటాడరేమండీ? ఆఖరికి యిలా కొరకరాని కొయ్యలా, మేలిరకం మేకులా తయారయ్యారేమండీ! సంసారంలో మొగుడూ పెళ్ళాలు ఒక ఒఱలో కత్తులలా ఉంటే ఎలాగండీ, ఒక కాడి ఎద్దులా ఉండాలిగాని...అంటే అనుకో కూడదుగాని మా బుల్లెక్క కాపురం చూస్తే ముద్దొస్తుంది...దాని మొగుడు అది గీసిన గీటు దాటడు...అదే బంగారపు పువ్వుల పూజ చేసిందో...నాలాంటి దిక్కుమాలిన దానికి అంత అదృష్టమా! అయ్యో అమ్మ, పుట్టగానే నా పీక ఎందుకు పిసికేశావు కాదు!'

వెక్కి వెక్కి ఏడుస్తున్న శేషులువేపు విచిత్రంగా చూశాడు విశ్వం...అతనికి అప్రయత్నంగా నలులు జ్ఞాపకం వచ్చేయి. నలి పుట్టుకగురించి అతను చదివిన కథ ఒకటి అతన్ని వెక్కిరించింది. ఈ రోజుల్లోకి కాస్త తెగించి తెనిగిస్తే ఆ కథ యిలా చెప్పకోవచ్చు.


ఓ తల్లికి ముగ్గురు కూతుళ్ళు. ముగ్గురికీ పెళ్ళిళ్ళు చేసి కాపురానికి పంపిందావిడ. ఆరు నెలలు తిరక్కుండా అనుకోకుండా ముగ్గురూ ఒక్కసారే పుట్టింటికి తిరిగి వచ్చి 'అమ్మా!' అని బావురుమన్నారు. ఒక్కొక్కరూ తమ బాధలు వెళ్ళబుచ్చారు.

'ఈ మధ్య నాకు కాస్త జబ్బుగా ఉండి నేకపోయి మీ అల్లుడుగార్ని అడగలేక అనగలేక 'కాస్త చెయ్యి కాల్చుకుందురూ' అన్నా. చేశారు తల్లి వంటా మన యింటా వంటా లేదు...ముద్ద నోట్లో పెట్టుకుంటే కిందకి దిగదు, పైకి రాదు...నాలిక కాలేసి నట్టయిపోయింది...చెప్పొస్తున్న మా స్నేహితురాళ్ళు నలుగురూ కలుసుకుని మాటాడుకుంటున్నప్పుడు 'ఏమే, మీ ఆయనకి నాలుగు పనులూ వచ్చా?' అని అడుగుతే ఏం జవాబు చెప్పను? మా వీదరు బావ ఎనిమిదయ్యే పరికల్లా పీటా కంచం వేస్తే...మా అక్కయ్య లేవలేక లేవలేక కళ్ళుతిరుగుతూ ఒళ్ళు తూలుతూ ఎలాగో కూమని అరసేరు పెసలుగా ఖాళీ చెయ్యడం మనం ఎరగనిదా? అంతేగాని ఏదో చెప్పక చెప్పక పని చెబితే ఇలా తగలేస్తే పడగలమా? అక్కడ నిలబడగలమా?... ఈయన పగవాడుగాని మగవాడు కాదని పెంచి లేచి వచ్చేశానంతే'

'అయ్యో బతుకు! చెబితే మా ఆయన సంబడమే చెప్పాలి. ఆయన ఆజన్మ విరోధిగాని భర్త కాదు. లేకపోతే 'అయ్యో తీగలాంటి మనిషే, పువ్వులా వాడిపోవాలే' అన్న జ్ఞానం ఆయనకుంటేగా! మీరు చెబితే నమ్మరు. మూడు పేటల చంద్రహారం తెచ్చి మెళ్ళో పడేశారమ్మా...ఈ బరువుకి ఈ సుకుమారి ఓ పగలదా లేదా అని ఉండాలంటావా? ఇంకేం చెప్పను....మెడ సోడా వేసి అప్పుడంలా దద్దుర్లెక్కిపోయింది. ఇక తల నొప్పి ఏమిటో నే చెప్పలేను. పది మైళ్ళ దూరంలో ఉంది పోనీ ఓసారి విశాఖపట్నం తీసుకెళ్ళి మెడా అదీ ఎక్సరే తీయించాలంటావా? అంత సరసత ఏదీ! ఆఖరికి 'తీసుకోండి యాస్ప్రో' అని ఆ రేడియోవాళ్ళ నోటమ్మటేనా వచ్చింది గాని ఆయన నోటమ్మట రాలేదు. ఇక ఈ కోత పడలేక పోయాను. చాలుతల్లి చాలు...సంసారం అంటే ఇంత అంధకారం అని పోల్చుకోలేకపోయాను... తిన్నగా యింటికి టిక్కెట్టుచ్చుకున్నాను.'

'ఎందుకర్రా మీ వెర్రిగాని మనసూ మనసూ కలవకపోయాక ఒకరినొకరు పోల్చుకోలేకపోయాక సంసారిగృహాలకన్న సన్యాసిమఠాలు నయంకదూ! చిన్నపనితో మా ఆయన మొండితనం బయటపడింది. ఏదయినా ఎన్నాళ్ళు లెండి! అంగుళం కోటా కొడితే అగ్గిబరాటాలాంటి అసలు రూపం దాగుతుందా? మా అత్తగారింట్లో అందరం కలిసివున్నంతకాలం నేను పట్టించుకోనే లేదు. ఈమధ్య మేం వేరింటికాపురం వెలిగించాంకదూ...మొదటగా 'జాముచ్చట... ఏమీ లేదు, తెల్లారేసరికి ఎనిమిదిన్నరా అవకుండా లేచిపోతావా...లేచి వీధిలకి మొహం కడుక్కుందామని వచ్చాను. మరచెంబుతో నీళ్ళు...పక్కని ఏడుకొండల టూత్ పౌడరు పాకం ఉన్నాయి...చేతిలో కత్తివుంటే అప్పుడే పొడుచుకుచచ్చేదాన్ని.. పరువు, మర్యాద, కుటుంబగౌరవం, సేటస్, ప్రిస్టిజ్ ఈయన కొంచెమేనా ఆలోచించారా? రాజకుమారికి పచ్చగడ్డి పెడతారా? ఇంత సాహసమా! ఇంత అవమానమా! అంత దిక్కులేక బికపంచ చేరి వనుకున్నారా? కాలేట్ టూత్ పౌడరు అక్కడ పెడితే కాళ్ళతో తన్నేసేదాన్ని నా మర్యాద ఏడుకొండలతో కొలుస్తారూ? అమ్మా, యేం చెప్పను! కడుపు కరువైపోయింది, కడుపు

(45-వ పేజీ చూడండి)



ఆదిపర్వము షష్ఠాశ్వాసము

తే. వీఁడెఁ కృతహస్తుఁ డఖిలాస్త్ర విద్యలందు, వీఁడె యగ్రగణ్యుఁడు ధర్మవిదులలోన
వీఁడె భరతవంశం బెల్ల వెలుఁగఁ గుంతి, కపుడు చల్లగాఁ బుట్టిన ఘనభుజుండు.

క. అని పలుకుజనులపలుకులు, విని గొంతి యనంతహర్ష విస్ఫారితలో
చన యై నందను నృపసం, దనసంఘములోనఁ జూచి తద్దయుఁ బొంగెన్.

క. చారుమనస్సమ్మదరస, పూరము వెలి వేర్చునట్లు పొలతికి విగళ
ద్భూరి స్తనజనితపయో, ధారలు నానంద బాష్ప ధారలు నొప్పెన్.

వ ఆయ్యర్జున స్తుతివచనంబు లొక్కట జనసంఘంబువలన నెగసి వియత్తలవిదళనం బయిన నమ్మహాధ్వని విని యుదరి పడి ధృతరాష్ట్రుం డిది యేమిరభసం బని విదురు నడిగిన నాతం డిట్లనియె

క. భూరిభుజుం డర్జునుఁ డతి, శూరుఁడు దనయస్త్రవిద్యఁ జూపఁగ రంగ
స్ఫారంభుఁ డయిన నతని న, వారితముగఁ బొగడుజనరవం బిది యధిపా.

క. అనవుడు ధృతరాష్ట్రుఁడు దన, మనమున సంతోష మంది మానుగ వీనుల్
గనినఫలమునకు నిప్పుడు, వినఁ గంటిని పాండుసుతుల విద్యాశక్తుల్.

క. భూరినిజద్యుతితోడఁ బృ, థారణిసంభూత పాండవాగ్నిత్రితయం
బారఁగ నస్మత్కులదురి, తోరుతరారణ్యదాహ మున్నతిఁ జేయున్.

అర్జునుండు దనయస్త్రవిద్యాకౌశలంబు సూపుట

వ. అని పొగడుచుండఁ నర్జునుం డాచార్యు ననుమతంబున నస్త్రలాఘవ వైచిత్ర్య ప్రకాశనపరుం డయి యెల్లవారును జూచుచుండ.

సీ. ఆగ్నేయశరమున నతిభీకరాగ్నియు, వారుణాస్త్రమున దుర్వారజలము
ననిలబాణంబున నధికానిలంబును, మేఘాస్త్రమున మహామేఘచయముఁ
బుట్టించు మఱియును భూమిబాణంబున, భూప్రవిష్టుం డగు భూరిఘోర
శైలబాణంబున శైలరూపము దాల్చు, విరుఁ డదృశ్యాస్త్ర విద్యపేర్మిఁ

తే. దానదృశ్యదేహుండగుఁ దత్క్షణంబ, హ్రస్వుఁడగు దీర్ఘుఁడగు సూక్ష్ముఁ డగురయంబు
తోడ రథమధ్యగతుఁడగు ధూర్గతుండు, నగు మహీతలగతుఁడగు నద్భుతముగ.

వ మఱియుం బాఱెడు సింహవ్యాఘ్ర వరాహాది మృగంబుల ముఖంబులం దొక్కొక్క యమ్మేసినట్ల యేనునేసి యమ్ము లతిలాఘవంబున నేసియు రజ్జుసమాలంబితం బయిన గోశృంగంబునం దేకవింశతిశరంబులు వరుసన నాటనేసియు నిట్లస్త్రవిద్యావైచిత్ర్యంబు మెఱసి గదాఖడ్గాది వివిధాయుధదక్షతం జూపి యర్జునుండు జనుల కాశ్చర్యంబు సేయుచున్నంతఁ గర్ణుండు నిజవిద్యాకౌశలంబు మెఱయసమకట్టి రంగద్వారంబున నిలిచి భుజాస్ఫాలనంబు సేసిన.

మ. జను లెల్లం గడు సంభ్రమింపఁగ నజస్రంబై భుజాస్ఫాలన
ధ్వని శైలప్రకరంబుపైఁ బడుమహాదంభోళిశబ్దంబ గా
యన వీతెంచినఁ బాండవుల్ సనిరి ద్రోణాచార్యు డాయంగ సుయో
ధను వేష్టించిరి తమ్ము లందఱును ద ద్ద్వారంబు వీక్షించుచున్.

వ. అంత.

శా. సాలప్రాంశు నిజోజ్జ్వలత్కవచు శశ్వత్కుండలోద్భాసితున్
బాలార్కప్రతిమున్ శరాసనధరున్ బద్ధోగ్రనిస్త్రింశు శౌ
ర్యాలంకారు సువర్ణవర్ణు ఘనుఁ గర్ణాఖ్యున్ జగత్కర్ణపూ
ర్ణాలోలద్గుణుఁ జూచి చూపఱు ప్రభూతాశ్చర్యులై రచ్చటన్.

వ. కర్ణుండును జనుల నందఱ నదల్చి చొత్తెంచి రంగమధ్యంబున నిలిచి కలయఁ జూచి కృపద్రోణాచార్యులకు నమస్కరించి సజలజలధరధ్వానగంభీరరవంబున నర్జును నాక్షేపించి యిట్లనియె.

క. నీవ కడు నేర్పుకాఁడవు, గా వలవదు వీనిఁ గొన్ని గఱచితి మేమున్
నీవిద్య లెల్లఁ జూపుదు, మే వీరులు సూచి మేలు మే లని పొగడన్.

క. అనిన నినతనయుపలుకులు, జనులకు విస్మయము సవ్యసాచికిఁ గోపం
బును సిగ్గును మఱి దుర్యోధనునకుఁ బ్రీతియును జేసెఁ దత్క్షణమాత్రన్.

వ. అంత ద్రోణుచేత ననుజ్ఞాతుండయి కర్ణుం డర్జునుచూపిన యస్త్రవిద్య లెల్ల నవశ్రమంబునఁ జూపినఁ జూచి దుర్యోధనుండు దానుందమ్ములును గర్ణునిం గౌఁగిలించుకొని నాతో బద్ధసఖ్యుండ వయి నాకును బాంధవులకును హితంబు సేసి నన్నుం గురురాజ్యంబును నుపయోగింపు మనిన నట్ల చేయుదునని కర్ణుం డొడంబడి యిమ్మూఁగిన రాజలోకంబును నీవును జూడఁ బార్థుతో ద్వంద్వయుద్ధంబు సేయవలయు ననిన ధార్తరాష్ట్రమధ్యంబున నున్న యక్కర్ణుం జూచి పార్థుం డిట్లనియె.

క. పిలువంగఁబడక సభలకు, బలిమిం జని పలుకుపాపభాగులలోకం
బులకుఁ జన వేఁడి పలికెదు, పలువ యెఱుంగవు పరాత్మపరిమాణంబుల్.

క. అనిన విని పార్థునకు ని, ట్లనియె నినాత్మజుఁడు దుర్బలాయాసక్షే
పనిబంధమ్ములు పలుకక, ఘననిశితాస్త్రముల, బలుకఁ గడఁగుము నాతోన్.

క. ఈరంగభూమి యస్త్రవి, శారదు లగువారి కెల్ల సామాన్యము గా
కారయ వీరికిఁ జొర నగు, వీరికిఁ గా దను విచారవిషయము గలదే.

వ. అని గర్వించి దుర్యోధనానుమతంబునఁ బార్థుతోఁ బూని రణసన్నద్ధుండయి రవితనయుండు రంగమధ్యంబున నున్నంత నర్జునుండును నాచార్యభ్రాతృచోదితుండై యుగాంతకాలానలుండునుంబోలెఁ బ్రతిఘటించి నిలిచిన.

కర్ణార్జునుల ద్వంద్వయుద్ధము

మ. జనితామర్షణుఁ డంతఁ బార్థువయిఁ బర్జన్యాస్త్ర మక్కర్ణుఁ డే
సె నపారం బయి భూనభోంతరముఁ దజ్జీమూతయూథంబు గ
ప్పినఁ దద్ధ్వాంతతిరోహితాపఘనుఁడై బీభత్సుఁ డుండెన్ విరో
చనుఁ డాత్మద్యుతి విస్తరించె సుతుపై సంప్రీతచేతస్కుఁడై.

వ. అయ్యవసరంబున దుర్యోధనుం దొట్టి ధృతరాష్ట్రనందను లందఱుఁ గర్ణువలన నుండిరి భీష్మద్రోణకృపపాండవులు పార్థువలన నుండిరంత.

క. రవిసుతపార్థులఘోరా, హవమునకును వెఱచు చున్న యది కుంతి తదు
ద్భవఘనతరశరతిమిరౌ, ఘవృతాంగుఁ దనూజుఁ జూడఁ గానక వంతన్.

క. ధృతి దఱఁగి మోహమూర్ఛా, న్వితయైనను సంభ్రమించి విదురుఁడు ప్రత్యా
గతజీవఁ జేసె నప్పుడ, యతిశీతలచందనోదకాసేకములన్.

వ. అంత నర్జునుం డనిలబాణంబున నమ్మేఘపటలంబు పఱవనేసి యాదిత్యసమతేజుండయి యున్న విదురదర్శితులైన యక్కర్ణార్జునులం జూచి కుంతి సంతసిల్లె నపుడు ధర్మవిదుం డఖిలద్వంద్వయుద్ధసమాచారనిపుణుండు కృపాచార్యుం డయ్యిద్దఱనడుమ నిలిచి కర్ణున కిట్లనియె.

★

నాటిక

తుగ్లక్‌తో సంభాషణ

క్రొవ్విడి లింగరాజు

పత్రికా ప్రతినిధి: ఆదాబ్ అర్జ్ తుగ్లక్ సాబ్!

తుగ్లక్: ఆదాబ్ అర్జ్. తమరెక్కడ నుంచి దయచేశారు?

ప్ర: నేను ఇండియా అనే భారత్ నుంచి వచ్చానండి.

తు: అదేనండి! హిందూస్థాన్ నుంచే కదూ?

ప్ర: అవునండి. దానినే ఇప్పుడు భారత్ అంటున్నారండి.

తు: అలాగే! ఏపేరైతే ఏముంది? అసలు స్వరూపం విచ్ఛిన్నమైపోయాక పేర్లలో ఏముందిలెండి! ఇంతకూ మీ రెవరు? ఎందుకోసం ఇలా దయచేశారు? నన్ను చూడాలనే అభిలాష మీకెందుకు కలిగింది?

ప్ర: నేను పత్రికా విలేఖరినండి.

తు: అంటే!

ప్ర: మా లోకంలో జరుగుతున్న విశేషాలను గురించి, వార్తాపత్రికలకు వ్రాస్తూ ఉండడమే వృత్తిగా గలవాడిని. అప్పుడప్పుడు పెద్దలైన వాళ్ళదగరకెళ్లి వాళ్లను అనేక విధాలుగా కవ్వించి ప్రశ్న పరంపరలను గుప్పించడం నాకొక విలాసం. వాళ్ళ చేత అవాకులో చవాకులో పలికించి వీధుల్లో పెట్టడం నా విధి. అలాంటప్పుడు నన్ను 'ప్రత్యేక ప్రతినిధి' అంటారు.

తు: ఓహో! ఈ కాలంలో ఇలాంటి ప్రబుద్ధులు కూడా ఉన్నారా? బహుశా మాటాడేటప్పుడు తియ్యగా మాట్లాడి, సంగతులు విశదం చేసుకుని తీరా వాటిని ప్రచురణ చేసేటప్పుడు అడ్డమైన మసాలా సామగ్రీ తగిలించి తంటాలు తెస్తారు కాబోలు!

ప్ర: అలా అనకండి.

తు: పోనీలే. ఆ గొడవంతా నాకెందుకు? ఇంతకూ ఏనాడో భూప్రపంచాన్ని వదలిపెట్టిన నాదగ్గర కెందుకొచ్చావు నాయనా? ఏదో ఉంది కథ?

ప్ర: అందుకేనండి. వృత్తి ధర్మంలోనే వచ్చాను.

తు: ఓహో! నీ వృత్తిలో నాతో ఏం పనొచ్చిందయ్యా!

ప్ర: మరేమీ లేదండి. మన దేశంలో రాజ్యాంగం మునుపటిలా లేదుగదండి! ఇప్పుడు తమలా రాజంటూ ఒకడు లేడు. ప్రజలే ప్రభువులయ్యారంటారు?

తు: అదేమిటయ్యోయ్! అంటే అరాజకమైపోయిందా. అంతా సింహాసనాలెక్కితే వింజామర వేసే వారెవరయ్యా!

ప్ర: కాదండి. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకుంటే, ఆ ప్రజలంతా ఒక

> నేటి స్పుత్నిక్ యుగంలో వివిధ దేశాలలోని శాస్త్రపరిశోధకులు కుక్కలను, కోతులను సూర్యచంద్రాది గ్రహాలకు పంపుతున్నారు. ఈ రచయిత ఊహాప్రపంచంలో భారత శాస్త్రజ్ఞులు తయారుచేసిన స్పుత్నిక్‌లో స్వర్గలోకానికి పయనించి, పిచ్చివాడుగా పరిగణింపబడే మహమ్మద్‌బిన్ తుగ్లక్‌తో గోష్ఠి జరిపివచ్చిన పత్రికావిలేఖరి కథ.

నాయకుడ్ని ఎన్నుకొని అతనికు మీరన్న వింజామరాలన్నీ వీస్తున్నారు. దానినే ప్రజాస్వామికం, ప్రజారాజ్యం అంటున్నారు.

తు: ఓహో! బాగుంది—పోనీలే ఆ బాధంతా నాకెందుకు? అయితే నీరాకెందుకు?

ప్ర: ఆ ప్రజారాజ్యంలో ప్రభుత్వాన్ని కొందరు విమర్శ చేస్తుంటారు. అంటే దుయ్యపడుతుంటారు. అలాంటప్పుడు ప్రభుత్వంచేసిన అపరాధాలను తమ చర్యలతో పోలుస్తుంటారు.

తు: ఏం నాయనా నేనేమి తప్పు చేశానో! దుర్మార్గులు.

ప్ర: అదేనండి. అందుకే అసలు సంగతులేవో తమదగ్గర తెలుసుకుందామని పనిగట్టుకొచ్చాను.

తు: అవునులే. ఇంతకూ వాళ్ళు నేను చేసిన అపరాధ మేమిటంటారు.

ప్ర: ఏమిటంటారా! మీరేదో తోలు నాణేలు ప్రసిద్ధించారుట కాదూ?

తు: అయితే? అందులో అపరాధమేమిటి నాయనా?

ప్ర: తోలు నాణేలు ఏమిటని?

తు: ఓయి ప్రబుద్ధుడా! ఏదో కొందల సంవత్సరాల క్రితం మీ దేశం వదలిపెట్టి ఇక్కడెక్కడో పడున్నాం కదా అని, మీలోకంలో ఏం జరుగుతోందో మాకు తెలియదనుకుంటున్నారు కాబోలు! మాకూ తెలుస్తున్నాయిలే.

ప్ర: మీకూ ఏమైనా పత్రికలున్నాయా ఏమిటి?

తు: వెర్రివాడా! పత్రికలుండాలిటోయ్. మీలోకంలోనుంచి ఏరోజు కారోజు ఎవ్వరో ఒకరు వస్తూనే ఉంటారు. ఎవ్వరి కిష్టమైన వార్తలు వాళ్ళు పట్టుకొస్తూనే ఉంటారు. మాకు తెలుసుకోవాలనే అభిలాష అంటూ ఉండాలికాని, తెలుసుకోవడం కష్టంకాదు.

ప్ర: అలాగాండి! అసలు విషయం శెలవివ్వండి.

తు: సరే. నేను తోలునాణేలు వేశానని అపరాధంక్రింద లెఖ్ఖ వేస్తున్నారా? మీరు వేసే కాగితం ముక్కలు మహాబాగా ఉన్నాయనుకుంటున్నారు కాబోలు! ఉన్న బంగారాన్ని కుదువబెట్టి వాడకానికి బాగా ఉండే తోలుముక్కలనుపయోగిస్తే తప్పొచ్చిందా! పొదుపుగా వాడుకుంటే చాలాకాలం మన్నుతాయికదా అని అలాచేశాను. ఉన్న బంగారపు నిలవకు పదిరెట్లు కాగితాలను అచ్చు కొట్టడం గొప్పనుకుంటున్నారా? అవునులే. ఇలాంటి సలహాల నివ్వడానికి మా కాలంలో ఆర్థిక శాస్త్రవేత్తలమంటూ బిళ్ళలు కట్టుకు తిరిగేవారు లేకపోయారు. ఇప్పటివాళ్ళు మమ్మల్ని నిరంకుశ ప్రభువు

★ తుగ్లక్‌తో సంభాషణ ★

లని ఎంతగా పేరెట్టినా, నిజానికి మేము మాత్రం అడుగడుక్కీ ప్రజలనుగురించీ ప్రజల సౌకర్యాలనుగురించీ మథనపడుతూ ఉండేవాళ్ళం. ఏపనిచేసినా ఏవిలాసం అనుభవించినా పదిమందికి వృత్తి కల్పించే పద్ధతిని, పదిమందికి కడుపునిండే మార్గాన్ని అన్వేషించేవాళ్ళం. జీవితంలో అన్నిరంగాల్లోనూ, స్వదేశీ జీవకారుణ్యం తప్ప మరోటి ఎరుగం. అందుకే ఏ పసుపుముంతల్లో దాచుకున్నా, చెక్కు చెదరకుండా ఉండే తోలు నాణేలను చలామణీలోకి తెచ్చాం. వాటికి ఒకపాటి అగ్నిప్రమాదానికి, జలప్రమాదానికి తట్టుకునే శక్తి ఉండేది. ఈనాటి వాటికి అహంకారంకాని ఎన్ని చెప్పినా కాగితంముక్కలకన్న తోలు నాణేలు నయం కాదయ్యా: ఇంతకూ ఈనాటి కాగితం ముక్కలకులాగా తోలుముక్కలకు వందల విలువిచ్చామా!

ప్ర: చిత్తం. ఇంతవిశేషం ఉందంటారా.

తు: లేదుటయ్యా! మరేమనుకున్నావు?

ప్ర: మీరు రాజధాని నగరాన్ని ఢిల్లీ నుంచి దేవగిరికి మార్చారనీ, మళ్ళీ ఢిల్లీకి తరలించారనీ. అందుకు మీ బుద్ధి చాంచల్యమే కారణమనీ అంటారు మావాళ్ళు.

తు: అంటారు! మీ ప్రబుద్ధులు! ఏమైనా అంటారు! మాకన్న తెలివైనవాళ్లు లేరనుకునే అహంకారులకు మరేం తెలుస్తుంది. మరి అసలు సంగతంతా చెప్పమంటావేమిటి?

ప్ర: చిత్తం.

తు: హిందూ చక్రవర్తులు పుష్కలంగా పంటలు, నీటివసతులు ఉన్నచోటనే రాజధానులు కట్టుకున్నారు. పశ్చిమ దేశాలనుంచి వచ్చిన మావాళ్ళు ఆయా రాజులను జయించి అక్కడే కుదురుపడి పోయారు. అంతే. కాలానుగుణ్యమైన మార్పులుగురించి వారంతగా పట్టించుకోలేదు. నిజానికి పూర్వకాలపు ఇంద్రప్రస్థం, హస్తినాపురం వగైరా నగరాలన్నీ గొప్ప పట్టణాలు. మేధావులు, అలంకరణప్రియులు వాటిని చాలా విశేషబుద్ధితో నిర్మాణం చేశారు. కాని కురుక్షేత్రంలో జరిగిన మహాసంగ్రామంవల్ల ఆ నేలంతా ఈర్ష్యాయుతులైన వీరుల రక్తంతో తడిసిపోయింది. వాళ్ళ ఎముకల కణాలు ఆమట్టిలో కలిసిపోయాయి. అందుచేత అక్కడ శాంతిఉండదు. మేమెంత తురకలమైనా, కర్మభూమిలో జన్మించి, ఆగడ్డలోని అన్నం తిన్నాం కనుక మాకూ ఏదో కొంత ఆదేశపు సాంప్రదాయమూ, సంస్కృతి అంటుకునేది. మేమెంత పరదేశంనుంచి వచ్చినవాళ్ళమైనా, భారతభూమినే జన్మభూమిగా శిరసావహించాం. అక్కడిప్రజల సహజసంస్కృతిని జీర్ణం చేసుకున్నాం. దానివికాసానికి తోడ్పడాం. అది విరజిల్లిన సౌరభానికి ఆనందోన్మాదులమైనాం. అదంతా ఎందుకుకాని, మొత్తంమీద హిందూ సాంప్రదాయాల తాలూకు చాదసమైనా మాకంటిందనుకో. అందుచేతనే మహాస్మశానమైన ఆ ఢిల్లీనగరంలో రాజధానిఉంటే ప్రజలకు శాంతిలేదనుకున్నాను. నిజానికి మీ హిందువులు ఎందుకో కాశీనగరాన్ని మహాస్మశానమంటారు. విశ్వేశ్వరుని పరిపాలనక్రింద ఉండడంచేత అలా అంటారు కాబోలు! ఢిల్లీ సంగతి ఆలోచించు మా కాలానికే ఢిల్లీ ఆరు సామ్రాజ్యాలను గోరీ అయింది. మొగలాయిల సామ్రాజ్యంతో ఏడు పూర్తయింది. ఇప్పుడు ఫరంగి సామ్రాజ్యంతో ఎనిమిదయింది. మీరు సామ్రాజ్యాలంటూ లేకుండా చేశారుకనుక మీ ప్రజారాజ్యం మన్నుతుందేమో! ఆరురాజ్యాలు పోవడం ఎరుగుదును కనుక ఏదో మనస్సులో సంకోచంకలిగి రాజధాని మార్చుదామనుకున్నాను.

ప్ర: కేవలం మనస్సంకోచంవల్లనే మార్చారా?

తు: కాదయ్యా! కొంచెం నిదానించు చెపాను. ప్రజాసౌకర్యం కూడా లేకపోలేదు. ఆరోజుల్లో ఇప్పట్లాగ రైళ్లు, విమానాలు, మోటారుకార్లు ఉన్నాయా? బళ్లమీద, గుర్రాలమీద, పల్లకీలమీద ప్రయాణాలుచేసి రాజుగారి దర్శనంచేయ్యాలంటే తలప్రాణం తోకకొచ్చినంత పనయ్యేది. మహావిస్తీర్ణమైన దేశంలో, న్యాయంగా ప్రజాపరిపాలన సాగించాలంటే, జనానికి అందుబాటులో ఉండాలి

కదా! దక్షిణా పథాన్నుంచి ఈ ఉత్తరదిశలో చివరున్న ఢిల్లీకి రాజదర్శనంకోసం రావడం కష్టం కదయ్యా, రాజధాని కేంద్రస్థమైన ప్రదేశంలో ఉంటే అందరికీ అందుబాటులో ఉంటుందని అభిప్రాయం. ప్రజలను శ్రమ పెట్టి మన దగ్గరకు రప్పించుకోవడం కన్న ప్రజలకు దగ్గరగా పోవడమే ప్రజారంజకత్వ మనుకున్నాను. పాలకుడైన వాడి ధర్మమను కున్నాను. అందుచేతనే ఏటికెదురీదైనా, ఢిల్లీలో ఆస్తిపాస్తులు సంపాదించుకుని ధరాజా కూచున్న పలుకుబడిగల పెద్దలు పేచీ పెట్టినా రాజధానిని దేవగిరికి మార్చాను. ఈ కాలపువాళ్ళు కుశాగ్రబుద్ధులు! నే చెప్పక్కరలేదు కానీ, ఎప్పుడో ఒకప్పుడు, క్రమంగా రాజధాని, దక్షిణానికి దిగక తప్పదు. కాకపోతే ఈనాడు మీకు ఆకాశగమనం సుగమమైపోయింది కనుక అంతగా బాధ కనుపించడంలేదు. ప్రజల పుణ్యమా అని పన్నులక్రింద కోట్ల కొద్దీ డబ్బిస్తున్నారు. మీ ఉద్యోగస్తులు ఆకాశ విమానాలమీద విహరిస్తూ రాజ్య పాలన ఢిల్లీనుంచే జరిపిస్తున్నారు. తెలిసిందా గా?!

ప్ర : మీ ఊహ బాగానే ఉంది. కాని మార్చిన రాజధానిని మళ్ళీ ఎందుకు తరలించారండీ? మంచో చెడ్డో మార్చిన వారు అలా మార్చేసి ఉంచితే ప్రజలు చచ్చినట్టు సర్దుకుండేవారు కదా! మాట వరసకి చెపాను. ఈ నాటి మా ప్రజాపరిపాలకులు ఆంధ్రకు మూరుమూలనున్న కర్నూలును రాజధాని అని పేరుపెడితే అయి ఊరుకుంది. ఏదో కర్మవశాత్తూ హైదరాబాదుకు చేర్చారు కాని లేకపోతే అదే రాజధాని అయేది. మీరన్నట్టు రాజా తలుచుకుంటే దెబ్బలకు కొదవేమిటి. ప్రజలు కోట్లు పన్నులుగా ఇస్తున్నంత వరకు ఎడారిలో మహా పట్నాన్ని కట్టించవచ్చును కదా!

తు : అవునయ్యా! ఈ కాలపుమాటలు చెపుతున్నావు. నిజానికి ఇప్పటికీ అప్పటికీ అదే తేడా. మేము పేరుకు నిరంకుశప్రభువులమే కాని ప్రజాభిప్రాయాన్ని, ప్రజల ఆందోళనను మన్నించేవాళ్ళం. దానిని కొంత భయంతోటీ భక్తితోటీ చూచేవాళ్లం. వాళ మంచికి చెప్పినా వాళ్ళు గుర్తించలేకపోతే ఏదో యుక్తిగా మేమే వాళ్ళకి తలొగ్గే వాళ్ళం. అందుకే ధైర్యం చాలక వెనుకడుగేశాను. కనుక నే పిచ్చితుగ్లక్ అంటున్నారు కాబోలు మీవాళ్ళు నన్ను.

ప్ర : మానసికమైన అస్థైర్యానికి మీరు లోబడి పోయారన్నమాట.

తు : అల్లాగే అనుకోవయ్యా, నాదేమి పోయింది? ప్రజాభిప్రాయాన్ని ధిక్కరించడానికి, ఈనాడు అమాంతంగా పుట్టుకొచ్చిన ప్రజాస్వాములకున్నంత ధైర్యం నాకు లేకపోయింది. మీ రాజ్యాల్లో ఏం జరుగుతోందో మాకు తెలియదంటే లేదనుకోకు. ఊరికే నన్ను పిచ్చాడని మీ రానందిస్తున్నారు కాని మీరు చేస్తున్న పనులనేకంగా ఉన్నాయి. మీరు పట్టిన కుందేటికి మూడే కాళ్ళనడానికి మీకు ధైర్యముంది. నాకు లేకపోయింది.

ప్ర : అంతే అంటారా?

తు : కాకపోతే ఏమనమంటారు. మీరు పెట్టిన మద్యనిషేధం అమలు జరుగుతోందంటారా? ఒక్క చోట ఉన్న కలుషితాన్ని సర్వత్రా వెదజల్లేరు. అవడానికి మంచిదే కాని ఏటి కెదురీత. సర్వత్రా చట్ట నిర్మూలనానికైనా మీ రొడబడుతున్నారు కాని మీరు చేసిన తప్పును అంగీకరించే ధైర్యం లేదు. అంగీకరించడమేమిటి సవరించే ఆలోచనసలే లేదు. మీరుచేస్తున్న వ్యభిచార నిర్మూలన చట్టాలు వరకట్న నిషేధచట్టాలు, సంస్కరణలు మొదలైనవన్నీ ఆచరణ శూన్యమైన ఆర్భాటాలు.

ప్ర : అవి నైతిక సిద్ధాంతాలకు సంబంధించిన సమస్యలు కదండీ!

తు: కావచ్చును. అలాంటి వ్యవహారాలలో నైతిక ప్రబోధం జరగాలి కాని శాసనాలేమిటని మా బోటి పూర్వకాలపు వాళ్ళకు అనిపిస్తుంది. కాని ఈ కాలపు ప్రజాస్వాముల కాలాంటి సంశయాలు లేవు. వారు తలుచుకున్నది జరుగవలసిందే-ప్రజల క్షేమ ప్రమాదమున్న సంగతి తరువాతి మాట.

ప్ర : మరీ బొత్తిగా ఆగ్రహంగా చెపుతున్నారు.

తు : ఆగ్రహం కాక మరేమిటయ్యా, ప్రజాక్షేమాన్నే ప్రధానంగా పెట్టుకున్న మాబోటి వాళ్ళని పిచ్చివాళ్లంటారూ? మీరు చేసే పనులు పిచ్చివి కావూ? 8 ఏళ్లనుంచి మీ దేశం నుంచి ఎవళ్ళెక్కడ కొచ్చినా ప్లానింగు ప్లానింగు అంటూ ఏవో చెపుతుంటారు. పంచవర్ష ప్రణాళికలు, జాతీయ విస్తరణ కంపోస్టు గోతులు, జపాన్ వరిసాగు ఇల్లాంటి మాటలే చెపుతున్నారు.

ప్ర : ఇప్పుడు జపాన్ కాదండి. చైనా వరిసాగు.

తు : అవును ఇవ్వాళ చైనా అంటారు రేపు ఆస్ట్రేలియా, ఎల్లుండి మలయా అవల తెల్లుండి ఏవో పేర్లు చెప్పి జనాన్ని కలద్రొక్కుతుంటారు.

ప్ర : అభివృద్ధి కార్యక్రమాలు జరగద్దండీ.

తు : జరిపించండయ్యా, ఎవరువద్దన్నారు. అసాంప్రదాయంగా చేయడమేమిటి అనే మా బాధ! ఇంతకూ మీ లెక్క ప్రకారం మా పుణ్యభూమిలో ఇంగ్లీషురాని జనమంతా మూర్ఖులని మీ అభిప్రాయం. వాళ్లను మీరు అభివృద్ధి పరుస్తారు కాబోలు. మీకు ఇష్టమున్నా లేకపోయినా జరిగే అభివృద్ధి జనాభా. మీరు చేసే అభివృద్ధి పన్నులు. రోగాలు విలాసాలు. మీ ప్లానింగు ఉబుసుపోక ఉద్యోగుల కాలక్షేపం... ఉదర పోషణ.

ప్ర : ఆవేశ పడకండి.

తు : ఆవేశ మేమిటయ్యా! ఆవేశమా? నిజం మీరు తల్లక్రిందుగా నిలబడ్డారు. లోకాన్ని తలక్రిందంటున్నారు. మీ ప్రభుత్వాలు చేసే పనులు పిచ్చిపనులు. మీ ప్రజాస్వాములు పిచ్చివాళ్లు. మళ్ళీ మాటాడితే స్వార్థపరులంటాను. ప్లానింగు పిచ్చిలో నిజస్థితిని మధ్యపెడుతున్నారు...

ప్ర :మీరు బొత్తిగా విషయాలు తెలుసుకోకుండా.

తు: అన్నీ తెలుసునయ్యా. మీ ప్లానింగు తాలూకు పత్రికలు చదివితే కాని మాకేం తెలియదనుకొన్నావా? అన్నీ తెలుసు. పోనీలే నాకెందుకు? నన్ను దిలిపెట్టు. మనుష్యులను నవ్వించడం నీ వృత్తి విశేషమని చెప్పేవు లేదూ? అందుకే నన్ను వాగించావు కాబోలు. వాగేను. ఇక నీ ఇష్టం. నీకూ నిజం చెప్పితే కోపమొస్తోంది కలవు.

ప్ర : శలవండి. ★

మెయిల్ ఎక్కడుంది?

రాజావారి జీవితంలో ఫోన్‌లో మాట్లాడటం అదే మొదటిసారి. రైల్వే ఎంక్వయిరీ ఆఫీసుకు ఫోను చేసి "మద్రాస్ మెయిలు ఇప్పుడు ఎక్కడుంది?" అని అడిగాడు.

"మీరెవరు? ఎక్కడనుంచి మాట్లాడుతున్నారు?" అన్నాడు అవతల ఆసామి.

"అదంతా నీ కనవసరం. నేను యిక్కడనుంచే మాట్లాడుతున్నాను. చెప్పు - రైలు ఎక్కడుంది?" అని మామూలుధోరణిలో గర్జించారు రాజావారు.

"ఆగ్రహపడకండి. ఇప్పుడు రైలు పట్టాలమీద వుంది" అని రిసీవరు క్రింద పెట్టేశాడు అవతలి పెద్దమనిషి.

—నాదెళ్ళ

టెన్నిస్ టూర్నమెంటు



సి. రామచంద్రరావు

టెన్నిస్ ఆటలకని నాలుగు మూలలా తిరిగి అలిసిపోయి, మిగిలిన సెలవు వారం రోజులూ ఇంటిపట్టున విశ్రాంతిగా గడుపుదామనుకుంటున్న సమయానికి గిరి ఉత్తరం వచ్చిపడింది. కరూరులో తన అధ్వర్యాన కాస్మాపాలిటన్ క్లబ్బు టెన్నిస్ టూర్నమెంటు నడుపుతున్నదనీ, నేను తప్పకుండా పాల్గొనాలనీ రాశాడు. రాకపోకల ఖర్చులూ, దిన వెచ్చాలూ మొదలైన టూర్నమెంటు ఆటగాళ్ల మామూళ్లు బాగానే ముట్తాయని కూడా ఒక ముక్క ఇరికించాడు. ఇండియన్ రేంకింగ్ కి లెక్కకిరాని కరూరు టూర్నమెంటువంటి ఆటలో పాల్గొనేటప్పుడు మేం ముఖ్యంగా గమనించేది ఖర్చులూ ఇత్యాదికని రాబట్టుకునే సొమ్మే అయినా, ఈసారి నన్నాకర్షించింది అదికాదు. ఈ టూర్నమెంటు గెలవడంవల్ల రేంకింగ్ కి పాయింట్లురావు. పోనీ గత మాసాలో నన్ను జయించిన ముగురిలో ఎవరితోనైనా తిరిగి ఆడి గెలవడానికి ప్రయత్నించే అవకాశముందనుకున్నా. ముగురూ కూడా వింబిల్డన్ లో ఆడడానికి ఇంగ్లండు వెళిపోయారు. ఇంక కరూరులో ఆడేవారు, ఇంతకుముందు నేను జయించినవారైనా ఉండాలి, లేదా నన్ను గెలవగలిగిన శ్రేణికి చెందినవారు కాకనైనా పోవాలి. అంటే ఈ టూర్నమెంటు గెలవడంవల్ల నాకు ఒరిగేది ఏమీ లేకపోగా, ఏ కారణం చేతనైనా ఓడిపోతే టెన్నిస్ లోకంలో చెప్పలేని నామర్దా కలుగుతుంది. కాని ఈ విషయాలన్నీ నన్నంతగా బాధించలేదు. ఇన్నేళ్ల తరవాత గిరినీ కమలనీ చూసే అవకాశం నేను ససేమిరా వదలదలుచుకోలేదు. అసలు ఉత్తరం వచ్చింది మొదలు ఎప్పుడువెళి వాళ్లింట్లో వాల్తామా అని మనసు ఒకే ఆరాటపడడం మొదలు పెట్టింది. ఆనాడే బయలుదేరుతున్నట్టు గిరికి తంతి ఇచ్చాను. కరూరు వెళ్ళడానికి ఒక పగలు మద్రాసులో ఎలాగూ ఆగవలసి ఉంటుంది. కనుక, వీలుంటే మర్నాడు సాయంత్రం ఎగ్జిబిషన్ టెన్నిస్ ఏర్పాటు చేయవలసిందని నా మిత్రుడు రామకృష్ణకి కూడా ఒక తంతి పంపించాను.

మద్రాసులో అనుకోని సంఘటన జరిగింది. ఎగ్జిబిషన్ ఆట ముగించి, స్నానం చేసి బట్టలు మార్చుకోడానికని క్లోక్ రూమ్ కి వెళుతున్న సమయంలో రావుగారు వచ్చి పలకరించారు. రావుగారు,—కమల తండ్రి—అక్కడ ఉండడం నన్నాశ్చర్యపరిచింది. తనంతతానువచ్చి పలకరించడం మరీ ఆశ్చర్యపరిచింది. నా ఆశ్చర్యాన్ని వెలిబుచ్చడానికిముందే ఆయన తొందరగా మాట్లాడడం ప్రారంభించారు. క్లబ్బులో నేను ఎగ్జిబిషన్ ఆడుతున్నట్టూ, తిరువాత కరూరు వెళుతున్నట్లూ పొద్దుటి పేపర్లో చదివి నా సహాయం అర్థించడానికివచ్చారట. "కాదనడానికి వీల్లేదు," అన్నారు. ఇంకా ఏదో అదేధోరణిలో చెప్పుకుపోతున్నారు. నేను ఆయన మాటలు వినడం లేదు. ఆయన రీతిలోని మార్పు, ఆయన మా[illegible]లోని వలత నన్ను కలవరపెట్టాయి. రావుగారిని చూసి సుమారు ఆరేళ్లయింది. అప్పటికీ ఇప్పటికీ ఆయన ముదురురంగు కొంగ్ సూటులోనూ, స్టార్చి పెట్టిన వర్తు కాలరులోనూ, స్వహస్తాలతో ముడి వేసిన "బో" టైలోనూ, లక్షణంగా మెరుగుపెట్టిన "[illegible]" షూస్ లోనూ ఏమీ తేడాలేదు. కాని ఆ గంభీరమైన ఆకారం, కించిత్తయినా తొణకని ఆత్మవిశ్వాసం ఏమైపోయాయి? ఆయనలో నిలువెల్లా విషాదచ్ఛాయలు కనిపించాయి నాకు. బట్టలు మార్చుకొని వచ్చి మాట్లాడదామని చెప్పి, ఆయన్ని క్లబ్ లాన్ మీద కూర్చొపెట్టి నేను క్లోక్ రూమ్ కి వెళ్ళిపోయాను.

స్నానాలగదిలో షవర్ కింద నుంచున్నానన్నమాటే కాని నా మనస్సు అక్కడ లేదు. రావుగారికి నేను చెయ్యగలిగిన సహాయం ఏముంది? కమల కేదైనా కబురు చెప్పడమో, కాకపోతే ఆమెకేదో తీసుకు వెళ్ళడమో అయిఉంటుంది. అయితే, తండ్రీ కూతురూ మనస్పర్థలు మర్చిపోయి తిరిగి కలుసుకున్నారన్నమాట. కమలా గిరి ప్రణయం, పెళ్ళి—ఆ రోజులన్నీ జ్ఞాపకం వచ్చాయి.

ఆరేళ్ళ క్రితం కమలా గిరీ మొదటిసారి కలుసుకున్నారు. ఆ యేడాది గిరీ నేనూ యూనివర్సిటీ టెన్నిస్ పోటీలలో నెగ్గి కొంత పేరు సంపాదించుకోడంవల్ల చాలా టూర్నమెంట్లకి మాకు ఆహ్వానాలువచ్చాయి. పరీక్షలు అయిపోయిన తర్వాత మైసూరు, బెంగుళూరు, కాలీగావ్, మదనపలి మొదలైన చోట్లంతా ఆడి చివరకి లాలీ ఇన్స్టిట్యూట్ టూర్నమెంటులో ఆడడానికి ఊటీ చేరుకున్నాం. ఎండాకాలం కొండల్లో గడపడానికి వచ్చిన రావుగారూ, కూతురు కమలా లాలీ ఇన్స్టిట్యూట్ లోనే ఉండడంవల్ల మాకు వారిపరిచయం కల్గింది. నా పరిచయం పరిచయంగానే ఉండిపోగా కమలా గిరి స్నేహం ప్రణయకలాపంగా మారి కూర్చుంది. నిజానికి అందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. గిరి అప్పట్లో బాగానే ఆడేవాడు. మంచి భవిష్యతు ఉందని పేపరు రాసేవి. పైగా అందగాడని చెప్పుకోవాలి. కాలేజీలో అత

పిల్లలు అతని స్నేహానికి ఎంతగానో ప్రాకులాడేవారు. అసలు ఆడవాళ్ళని ఆకర్షించేశక్తి ఏదో అతనిలో ఉందని నా ఊహ. అయితే కమల గిరిని పెళ్ళాడడం రావుగారికి సుతరామూ ఇష్టంలేదు.

రావుగారు శ్రీమంతుల కుటుంబంలో పుట్టారు. కుటుంబ సాంప్రదాయం, ఆర్థికస్థోమతు పొందలేనివాటి ఆవశ్యకత ఆయనలో కరడుగట్టుకుపోయింది. గిరికి చెప్పుకోదగ్గ ఐశ్వర్యంలేదు. అతని తల్లిదండ్రులు సమాజంలో అనామకులు; అంటే రావుగారి తరగతికి చెందిన సమాజానికి వారు చెందరు. పోనీ, గిరికి ఉద్యోగమైనాలేదు. రెండు మాసాల్ర్కితం యమ్. ఏ. పరీక్ష రాసి వచ్చాడు. అతి గారాబంగా, సమస్త ఐశ్వర్యాలలో పెరిగిన తమ ఏకైకపుత్రిక ఇటువంటివాడిని పెళ్ళాడడానికి రావుగారు అంగీకరించలేక పోయారు. కమలా, గిరీ–వారితో పాటు నేనూ ఆయన్ని ఒప్పించడానికి సకల ప్రయత్నాలు చేశాం. కాని లాభం లేకపోయింది. చివరకి ఆయన యిష్టం లేకుండానే పెళ్ళి జరిగిపోయింది. రావుగారు పెళ్ళికి రాలేదు. కూతురు తనకి ఇంకేం సంబంధం లేదనీ, తన డబ్బులో చిల్లిగవ్వకూడ ఆమెకి రాదనీ మధ్యవర్తులద్వారా కబురు చేశారు. కమల లొంగలేదు.

కమల కొంచెం తెలివిగా ప్రవర్తించినట్లయితే ఇంత రాద్ధాంతం జరిగి వుండకపోనేమో అనిపిస్తుంది నాకు అప్పుడప్పుడు. "నేను గిరిని ప్రేమిస్తున్నాను, పెళ్ళి చేసుకోమంటావా నాన్నా?" అని ఆమె రావుగారిని ఎప్పుడూ అడగలేదు. పెళ్లి చేసుకోడానికి నిశ్చయం చేసుకున్న తర్వాత "మేం పెళ్లి చేసుకోబోతున్నాం" అని తండ్రితో చెప్పింది. ప్రాణసమంగా చూసుకుంటున్న కూతురు తన ప్రసక్తి లేకుండా పెళ్లి నిర్ణయించుకోడం రావుగారి ఆత్మాభిమానాన్ని గాయపరచి వుంటుంది. బాగా డబ్బున్నవాడూ, ఉన్నతకుటుంబంలో పుట్టినవాడూ కమలకి భర్త కావాలని ఆయన కోరుకున్నా, "గిరిని పెళ్లి చేసుకుంటే నా జీవితం ఆనందంగా వుంటుంది. నాకోసం ఈ పెళ్లికి అనుమతి ఇయ్యి" అని కమల అడిగివుంటే తప్పకుండా ఆయన ఒప్పుకునేవారని నా అభిప్రాయం.

షవర్ లో నీళ్ళ వేడి ఎక్కువయి, ఒళ్ళు చుర్రుమన్న తర్వాతగాని ఈ ఆలోచనలోనుంచి నేను బయటపడలేదు. త్వరగా స్నానం ముగించి, బట్టలు మార్చుకుని, రావుగారి దగ్గరకి వెళ్లాను.

రావుగారు చెప్పింది విని విస్తుపోయాను. రావుగారికి కూతురిమీద కోపం ఆట్టేకాలం నిలవలేదు. కమల తనని నిర్లక్ష్యం చేసినందుకు కోపంవచ్చి అన్నిమాటలన్నారేకాని, కమల వాటినంతగా పాటిస్తుందని అనుకోలేదు. పెళ్ళయిన తర్వాత వచ్చి క్షమాపణ కోరుతుందని ఆయన అభిప్రాయం. కమల రాలేదు. ఆర్థికంగా గిరిస్థోమతు అంతంతమాత్రమే అని ఆయనకి తెలుసు. కొంతకాలానికైనా క్లిష్టపరిస్థితులు ఏర్పడి కూతురు తమ దగ్గరికి వస్తుందని ఆశించారు. కాని పెళ్లయి నెల తిరగకుండానే గిరి గవర్నమెంటులో మంచి ఉద్యోగం సంపాదించాడు. గవర్నమెంటు జీతంతో కమల అవసరాలు గడవవని కూడా ఆయనకి తెలుసు. ఇంకా కమల వస్తుందనే ఆశ ఆయనకి పోలేదు. తనంతతాను వస్తే కూతుర్ని క్షమించడానికి ఆయన కాచిపెట్టుకుని ఉన్నారు. అది పడలేదు. కమల తన అవసరాలను తగ్గించుకుంది. కూతురు తిరిగి రానందుకూ, అంతకంటే తననుకున్న ప్రకారం ఒక్కటీ జరగనందుకు ఆయనకి పట్టరాని కోపం వచ్చింది. ఇంక కమలను గురించి



ఆలోచించవని భీష్మించి కూచున్నారు. కాని ఆమెను మరచిపోవడం ఆయన తరంకాలేదు. తల్లిపోయినవాటినుంచి తనే తల్లీ తండ్రిగా ఆమెనిసాకుతూ వచ్చారు; ఆమెకోసం తిరిగి పెళ్ళిచేసుకోడం మానేశారు. కమల ఆయన జీవితంలో ఒక భాగమైపోయింది. ఆత్మాభిమానం దిగమింగి కూతురికి రమ్మని ఉత్తరాలు రాశారు. కమల జవాబియ్యలేదు; డబ్బు పంపించారు. తిరిగి వచ్చేసింది. చివరికి ఉండబట్టలేక కూతురి ఇంటికి వెళ్ళారు. కమల ఆయన్ని పలకరించనైనాలేదు. ఆయన్ని చూసిన మరుక్షణమే స్నేహితుల ఇంటికి వెళ్ళికూచుంది. చేసేది లేక తిరిగి మద్రాసు వచ్చేశారాయన.

"ఇంక నేం చెయ్యగలిగిందేమీ లేదు. భారం మీ మీద వేస్తున్నాను. ఏం చెప్పి దాని మనస్సు మారుస్తారో."

రావుగారు దగిరగా జరిగి నా రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుని అన్నారు. ఆయన దీనస్వరం నన్ను కలిచివేసింది. శాయశక్తులా ప్రయత్నిస్తానని చెప్పి సెలవు తీసుకున్నాను.

* * *

సినిమాకి కమల ఒక్కతే వచ్చింది.

"గిరి ఎక్కడ?" అని అడిగాను.

"ఒక పక్కన టెన్నిస్ ఉండగా ఆయనగారికి తీరిక ఎక్కడుంటుంది?" నవ్వింది.

"అయితే గవర్నమెంటు ఉద్యోగం కూడా ఇతని టెన్నిస్ పిచ్చి వదలగొట్టలేకపోయిందన్నమాట?"

"ఉద్యోగానికి కాదుగదా, దేనికీ సాధ్యం కాదు."

ఇద్దరం నవ్వుకున్నాం.

కార్లో ఎక్కుతూ కమల చెప్పింది: "బట్టలు మార్చుకుని నిన్ను క్లబ్బుకి రమ్మన్నాడు."

ప్రయాణం అలసటమీద నాకు ఆడబుద్ధి కాలేదు.

"నాకు పొద్దున్న 'మేచ్' ఉందేమో తెలుసా?" అని అడిగాను.

"ఇప్పుడు కాదు గాని సాయంత్రం సింగిల్సూ డబుల్సూ కూడా ఆడాలి. ఇప్పుడు కొంచెం ఆడితే కోర్టుకి బంతులకీ అలవాటవుతుంది కదా!"

"మొదటి రెండురోజులూ బహుశా కష్టమేమీ ఉండదు. అయినా, ఇంటికివెళ్ళి బట్టలు మార్చుకునివచ్చి ఈ ఎండలో గంతులెయ్యడం నావల్ల కాదు."

"నిజమే" ఒప్పుకుంది కమల.

"దార్లో ఒక నిముషం క్లబ్బు దగిర ఆగి గిరిని పలకరించి పోదాం" అన్నాను.

కాస్తా కూస్తా సేపటికి గిరి ఇంటికే వచ్చేస్తాడు. అయినా నా వెంట నేను తన్ని చూడకుండా వుండడానికి మనసు ఒప్పలేదు. ఒకసారి పూర్వంమాదిరి విపులం చదువుకుని అప్యాయంగా అడుచుకుంటే మతి తీరిపోతుంది. కమలకి క్లబ్బుదగ్గర ఆగడం ఇష్టం లేకపోయింది.

"నన్ను ఇంటిదగ్గర దింపేసి నువ్వువెళ్ళు" అంది.

క్లబ్బుకి వెళితే ఒకపట్టాన ఊడిపడనేమో నని ఈవిడ భయమేమో అని నేను అన్నాను. "ఒక్క నిముషం అంటే ఒక్క నిమిషమే. అలాతొంగిచూసి వచ్చేద్దాం ఎంతకాదన్నా ఒకప్పుడు ప్రాణస్నేహితులం కదా!"

"నన్ను దింపేసి వెళ్ళి నీకు పుణ్యం వుంటుంది. నేవెళ్ళేవరకూ ఇంటిదగ్గర పను లన్నీ కూచుంటాయి.'

ఆమెవైఖరి నన్ను పట్టుబట్టనియ్యలేదు.

గిరి వచ్చేలోగా కమలా నేనూ పిచ్చాపాటి మాట్లాడుతూ కూచున్నాం. ఇదే మంచి సమయం అని రావుగారి విషయం కదిపాను. కమలలో చెప్పలేనిమార్పు వచ్చింది. ఆమెనవ్వూ చిలిపితనం ఒక్కసారిగా మాయమైపోయాయి. మొహం జేవురించింది. గొంతు జీరపడింది. శరీరం కోపంతో ఒణుకుతున్నట్టనిపించింది.

రాత్రి రైల్లో నాకంటికి కునుకుపట లేదు. రావుగారి తరఫున కమలని ఎలా ఒప్పించాలో, ఎన్ని విధాలగా నచ్చచెప్పే అవకాశా లున్నాయో ఆలోచించడంలో నే తెల్ల

(53-వ పేజీ చూడండి)

తోగరుచెట్టు

జిల్లా ట్రెజరీ హెడ్ అకౌంటెంటు చిట్టి వెంకట్రామయ్యగారు ఆవాళ సాయంత్రం గడియారం టంగు టంగున ఐదు కొట్టగానే టక్కున లేచారు. ఇంటికి వెడిపోయారు.

ఏం చెప్మా అనుకున్నారు పెద్ద గుమాస్తా లంతా. ఏదో కొంప మునిగిందనుకున్నారు. ఆయనలో అంత కలివిడిగా వుండని అభ్యుదయ గుమాస్తాలంతా వెటకారంగా, ఇవాళైనా వెలుగులో భార్యా బిడ్డల మొహాలు చూస్తామనుకున్నారు టైపిస్టులూ అటెండర్లూ. అయ్యో యివాళ చిట్టి వెంకట్రామయ్యగారు లేకుండా వొంటరిగానే మరి రెండున్నర గంటలదూరం నడవాలా అనుకుని ఆఫీసు గడియారం వలవల యేడిచింది.

అయితే, గత పన్నెండు సంవత్సరాలలో యిలాంటి విపరీతం జరగలేదు. ఇది జనన తేదీలు అజాయించేపట్ల మనవాళ్ళు భూత కాలంలోని తుఫానులు, భూకంపాలు మొదలైనవి వుటంకించినట్లు చెప్పుకోతగది.

చిట్టి వెంకట్రామయ్యగారు పన్నెండేళ్ళ కిందట ఆ జిల్లా ట్రెజరీకి హెడ్ అకౌంటెంటుగా వచ్చారు. అప్పటికీ యిప్పటికీ ఆయన హోదాలోగాని, ప్రవర్తనలోగాని మార్పు లేదు. ఉదయం పదకొండింటికివచ్చి సాయంత్రం ఏడున్నరకి లేచేవారు. ఎప్పుడూ నవ్వకపోయినా, యేడుపుముఖం పెటలేదు. ఎవర్నెన్ని తిట్టినా పై అధికారితో చెప్పి అపకారం చేయించలేదు. ఆయన్ని అర్థం చేసుకున్నామనుకున్నవాళ్లు గత్యంతరం లేక సమాధానపడ్డారు. ఇతరులు ఆయన మూర్ఖుడనీ, హృదయంలేనివాడనీ ఇంకా ఇంకా 'ఈస్థటిక్ సెన్స్' లేనివాడని అనుకునేవారు.

పోతే, అవాళ సాయంత్రం ఐదింటికి అకస్మాత్తుగా ఆయన యెందుకు లేచి వెడిపోయారో యెవ్వరికీ తెలీదు. చివరికి ఆయన ప్రైవేట్ సెక్రటరీలాంటి బంట్రోతు అహమ్మదుకుకూడా తెలీదు. అసలాయనకి ప్రైవేటు జీవితం లేదనే అందరి అభిప్రాయం.

చిట్టి వెంకట్రామయ్యగారిగురించి యితరులకి తెలిసినది ఆయన వొక గౌరవనీయ కుటుంబానికి చెందినవారని, ప్రస్తుతం ఆయనకి 'నా'అన్న దగ్గర దూరం బంధువు లెవ్వరితోనూ యెక్కువగా ప్రమేయంలేదనీ, ఆయన వొంటరిగా వొక మేడలో నివసిస్తున్నాడని మాత్రమే. ఆయన భార్య సుమారు ముప్ఫయ్యేళ్ల కిందట పెళ్లిఅయిన కొద్ది నెలలలోనే పోయిందనికూడా కొందరికి తెలుసు. ఇంకా లోతైనవిషయాలు బంట్రోతు అహమ్మదుకీ, కనీసం పన్నెండేళ్లనుంచీ వంట చేస్తూన్న నరసింహానికీ కూడా తెలీవు.

సూర్యుడికంటె ముందు లేచి స్నానం చేసి, సంధ్యవార్చి, ఆఫీసుకాగితాలు చూసుకుని, తొమ్మిది గంటలకి వేడివేడి పెసరట్టూ, వుడికించిన కూర, పెరుగూ అన్నం తిని ఆఫీసుకు వెళ్ళడం, సాయంత్రం సుమారు ఎనిమిదింటికి యిలుచేరి మడికట్టుకుని భోంచేసి, రాత్రి సుమారు పదకొండువరకూ తిరిగి ఆఫీసు కాగితాలు చూసుకుని పడుకోవడం ఆయన దినచర్య. దీనిలో యెన్నడూ యేమీ మార్పుండదు.

అంగర వెంకట కృష్ణారావు

ఆయన యెప్పుడూ సినిమాలూ నాటకాలూ చూడరు. ఎప్పుడైనా వాళ్ళ బంధువు లెవరేనా అవూరు వస్తే వాళ్ళింట్లోనే దిగేవారు దూరపు అన్నదమ్ములు, రెండు వేళ్ళు విడిచిన మేనమామ మనవరాళ్లూ, స్నేహితులు, స్నేహితుల స్నేహితులు యిత్యాది. కారణం ఆయనమీద అభిమానం అనుకోవడం సత్యానికి చాలా దూరం; ఆయన కలిగినవాడని, కర్చులేనివాడని. వాళ్ల ఊహ నిజమే. అయితే ఆయన యెవ్వరితోటీ అట్టే మాట్లాడేవారు కాదు. చుట్టపక్కా లున్నప్పుడు కూడా ఆయన మేడమీద తన గదిలోంచి బైటికి వచ్చేవారు కాదు. అంచేత ఆ వచ్చినవాళ్లు కూడా ఆ నవాయితుకు 'బాబాయీ బాగున్నావా' అనో 'అన్నయ్యా యెన్నాళ్ళయింది నిన్ను చూసి' అనో పలకరించినా, ఆ యింటిని సుమారొక విశ్రాంతిగృహంగానే భావించేవారు, చార్జీలు మినహా.

చిట్టి వెంకట్రామయ్యగారి 'గది' మేడమీదుంది. మేడమీదున్న గది అదొక్కటే. ఆ గదికి ఉత్తరం వేపున్న కిటికీ గుండా పెరట్లో వున్న తోగరు చెట్టు పైభాగం సూటిగా అగుపిస్తుంది. తీరికగా వున్నప్పుడల్లా ఆయన దానివేపు చూసేవారు. ఆయన యెరికని ఆ చెట్టు యెప్పుడూ అలాగేవుంది. ఆకులు లేకుండా మోడులా. దానినిచూస్తూన్నంతసేపూ ఆయన మనసు శాంతియుతంగా వుండేది.

అవాళ ఆయన సాయంత్రం ఐదుగంటలకి టక్కున లేచి ఆఫీసునుంచి వెళ్లిపోవడం లగాయతు, ఆర్నెల్లపాటు ఆయన ఆఫీసు జీవితంలో వింతమార్పు వచ్చింది. ఉన్నంతసేపూ అందరిమీదా రుసరుసలాడ్డం, తిట్టడం, ట్రెజరీ ఆఫీసుమీదే ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ విసుక్కోవడం. ఎంత గొడవచేసినా సాయంత్రం ఐదింటికల్లా డ్రాయర్లుమూసి వెడిపోవడం. ఆయన్ని యెవరూ యేమీ అనేవారుకారు. కారణం ఆయనకి అప్పుడే చాలా సర్వీసు అయిపోయింది. పైగా ఆయన వయసు యాభైలోపైనా, పండిపోయి, దిగజారిపోయి అరవై యేళ్లవాడిలా అగుపించేవాడు.

డిసెంబరు నెల నడుస్తోంది. హేమంతుడి ప్రతాపానికి తట్టుకోలేక పృథక్ శయ్యలు ఏకశయ్యలౌతున్నాయి. చిట్టి వెంకట్రామయ్యగారు వొక్క నిద్ర తీశారు. ఈదురుగాలికి తెలివివచ్చింది. పెరటివేపు కిటికీ తలుపు మూసివేద్దామని లేచారు.

కిటికీదగ్గరకి వెళ్లగానే తోగరుచెట్టు కొమ్మల్లోంచి వొకదృశ్యం అగుపించింది. అవతల వీధి మేడగది కిటికీ తెరిచి వుంది. ఎలక్ట్రిదీపం కాంతి చక్కగావుంది.

★ తోగరుచెట్టు ★

ఒక యువకుడు ఒక యువతి—నిటారుగా, నగ్నంగా, గాఢాలింగనంలో పెనచుకు పోయేరు, చెట్టుతీగలా. చిట్టి వెంకట్రామయ్యగారి హృదయం వేగంగా కొట్టుకుంది. వెంటనే చలి పటాపంచలై ఆ పాద మస్తకం వేడెక్కింది.

కిటికీమూసి వెడిపోదామా అనిపించింది. కాని అలా చెయ్యలేకపోయేరు. తను చీకట్లోవున్నారు. వాళ్లు లోకానికి మటుకే చీకట్లోవున్నారు. వాళ్లు నూతన దంపతులై వుంటారు. నిర్భయంగా, నిస్సంకోచంగా, నిర్లజ్జగా, రక్తమాంసాసి వరాలకు పంచభక్ష్య పరమాన్నాలతో విందుగా ప్రవర్తిస్తున్నారు. చిట్టి వెంకట్రామయ్యగారి శరీరం విపరీతంగా కంపిస్తూంది. నిత్యశిశిర జీవితం గడుపుతూన్న ఆ నిర్భాగ్యపు తోగరుచెట్టు అవతలి, జీవితపరిణామంలో మహోద్రేకపూరితమైన యీ ఘటపు విశ్వరూపం యిలా ఆ హేమంత నిశామధ్యంలో ప్రత్యక్షం అవుతుందని ఆయన కలలోకూడ అనుకోలేదు. ఆ సన్నివేశం ఆయన ప్రవృత్తిని పునాదులతో కుదిపింది.

ఆఫీసులో అంత అలజడి ఆమర్నాడే జరిగింది. కిటికీలో నాటకం ఆరంభం ప్రతిరోజూ సాయంత్రం ఆరుగంటలకే. దానికి చివరి అంకం భరతవాక్యం వుంటాయని చిట్టివెంకట్రామయ్యగారు అనుకోలేదు. ఆలసించిన ఆశాభంగమని ప్రతిరోజూ ఐదు గంటలకే ఆఫీసు విడిచిపెట్టేవారు.

కాలచక్రం తిరుగుతూంది. మార్చినెల ప్రవేశించింది. హటాత్తుగా పెరట్లో తోగరు చెట్టు చిగిర్చింది పన్నెండేళ్ళ తరవాత. చూస్తుండగా చెటంతా గుబురై, పచ్చటి ఆకులునిండింది. తోగరుపూల పరిమళాలు చిట్టివెంకట్రామయ్యగారి గదిమీద, కాదు గుండెలమీద దాడితీస్తున్నాయి. ఏంలాభం? కిటికీ కనుపించడంలేదు. ఆయనకి చిర్రెత్తింది. వెర్రెత్తింది. కాలుగాలిన పిల్లిలా అటుమటించిపోయేడు. నిద్ర ఇదివరకే లేదు. కాని ఇప్పుడు నిద్రలేని సుఖంకూడా లేదు.

ఒకనాడు ఆఫీసుకువస్తూనే అహమ్మదుతో చెప్పేడు 'సాయిబూ, మన పెరట్లో తోగరు చెటు నరికించి...వెధవచెట్టు...' సాయిబు హడలిపోయేడు. 'అదేం అయ్యగోరూ—పాపం ఆ చెటు యెన్నాళ్లకో ముచ్చటగా చిగిర్చింది. దాన్నెందుకు నరకాలి?'

'నీకు తెలీదు—సాయంత్రానికి నరికించి' అహమ్మద్ గొణుక్కుంటూ వెడిపోయేడు.

ఒంటిగంటకి ఆఫీసుకి ఒక యువకుడొచ్చాడు చిట్టివెంకట్రామయ్యగారికోసం. ఆయనకి సరిగ్గా గుర్తురాలేదు.

'మరేంలేదు. మీయింటో క్రింద భాగములో చాలాగదులున్నాయిట. నాకో గది అద్దెకిస్తారేమో అని అడుగుదామనివచ్చా.'

'నేనెప్పుడూ యెవరికీ అద్దెకివ్వలేదే... అయినా మీ రెక్కడుంటున్నారు?'

'ఇక్కడే...అంటే ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. మీయింటి దగ్గర సానే వుంటున్నా. మా మేడమీంచి మీ పెరట్లో తోగరుచెట్టు అగుపిస్తుంది...'

చిట్టివెంకట్రామయ్యగారు అదిరిపడ్డారు. ఇప్పుడు పోల్తి అందింది. కొంచెంసర్దుకుని అడిగారు, 'మీరు బాచిలరా?'

అతడు సిగ్గుతో అన్నాడు, 'కాదండీ... మా ఆవిడ...పుట్టింటికి వెడుతూంది... మరేం...పురిటికి...ఈలోగా నాకెందుకు అంత యిల్లని...మీయింట్లో ఏదో ఒకగది ఇస్తే చాలు...'

చిట్టివెంకట్రామయ్యగారి మనసులో ఒక పెద్ద అల్లకల్లోలం లేచి క్రమేణా చల్లబడింది. అది ఒక పెద్ద శస్త్రచికిత్స! యువకుడిని మర్నాడు మంచిరోజని తనయింట్లో దిగి పొమ్మన్నాడు.

'అహమ్మదూ...'

'అయ్యగోరూ...'

'తోగరుచెటు నరకొద్దురా...'

'ఏం అయ్యగోరూ...'

'తోగరుచెట్టు చిగిర్చిందిరా...' చిరునవ్వుతో అన్నారు. అహమ్మద్ తో సహా ఆఫీసంతా మూర్ఛపోయింది. ★

నక్షత్ర ఫలితాలు

[11-2-59 మొదలు 17-2-59 వరకు]

గ్రహ స్థితి.

కే		శు	
కు	తే 12 దిని రవి కుంభములో ప్రవేశించును. తే 13దీని బుధుడుకుంభములో ప్రవేశించును. మీన మేష వృషభ మిథునంలలో చంద్రుడు.		
ర బు			
శ	గు		రా

అశ్వని [చూ, చే, చో, లా]

ఈ వారము మీకు యోగప్రదము. అధికారుల సహాయముతోనూ, బంధువుల సహాయముతోనూ, గతవారము కలిగిన ఆటంకములను గడిచి ఫలం పొందుతారు. ఆదాయము వృద్ధి అవుతుంది. వైద్యజ్యోతిషశాస్త్ర ప్రసంగాలు చేస్తారు. ఈశాన్య దిక్కునుండి క్షేమము తెలుస్తుంది. విద్యార్థులకు మంచికాలము గణితశాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు, నటీనటులకు యోగకాలము. 13, 14, 15 ధనలాభము, కార్యసిద్ధి.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈ వారము మీకు యోగదాయకముగా వుంటుంది. నూతనకార్యములు ప్రారంభిస్తారు. అనుకున్నసొమ్ము చేతికి వస్తుంది. కోర్టు దావాలలో కొంత అనుకూలముగా వుంటుంది. పండితగోష్ఠిజరిపినూతనవిషయాలు తెలుసుకుంటారు. వారమంతా శుభయోగములతో యున్నా కొంత ఆందోళనతో కూడి వుంటుంది. 13, 14, 15 కార్యలాభము, ధనలాభము, పుత్రులకు క్షేమలాభములు. 16, 17 అధిక ఖర్చులు. విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు, పండితులకు, ఉపాధ్యాయులకు మేలుగా వుంటుంది.

* కృత్తిక [ఆ, ఈ, ఊ, ఏ] *

ఈవారము నీటిమీద ప్రయాణము చేయుట, తలచిన కార్యములలో జయము, వినోదములలో పాల్గొనుట, దధిక్షీర యుక్త సుభోజనము వెండిపాత్రలలో చేయుట, మొదలగు యోగములు కలుగును. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, బియ్యము, వెండి, ద్రవపదార్థ జనిత వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలము. విద్యార్థులకు చురుకుగా చదువు సాగుతుంది. వారాంతమున అధిక ఖర్చులు.

* రోహిణి [ఓ, వా, వీ, వూ] *

ఈ వారము ధనధాన్య సమృద్ధి. కృషిమూలకముగా లాభము, ఇష్ట వస్తులాభము, వివాహాది శుభకార్యములలో పాల్గొనుట, పరోపకారమువల్లకీర్తి వంటిరాజయోగాలు కలుగును. విద్యార్థులు వినోదాలలో పాల్గొన్నా చదువు బాగా సాగుతుంది. విలువగల వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు రెట్టింపులాభము కలుగుతుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. ఆప్తులతో విందు, వినోదము.

బి. నరసింగరావు

* మృగశిర [వే, వో, కా, కి] *

ఈ వారము మీకు కార్యభారము ఎక్కువ. రాబడి తక్కువ. గృహావసరములు తీరక కలతలు. ఆరోగ్యము సరిగాలేని సూచనలు కనబడగానే ఔషధచికిత్స పొందడమే కాకుండా, గ్రహారాధైన శని శాంతి చేయించడము మేలు. ఉద్యోగస్తులకు క్రొత్త సమస్యలు. వర్తకులకు ఆందోళన. విద్యార్థులకు చదువు సరిగా సాగదు. రాజకీయవాదులకు ఆందోళన. 13, 14, 15 పితృవర్గ సహాయము, ధనలాభము, ప్రయాణము. 16, 17 ఆరోగ్యభంగము.

* ఆరుద్ర [కూ, ఖ, ఙ, ఛ] *

ఈ వారము మీకు మిశ్రమయోగము. మొదట్లో నిరాశగావున్నా మిత్రసహాయము వల్ల కార్యలాభము పొందుతారు. ధనలోపమువల్ల ఆందోళన. ఉద్యోగస్తులకు ఏమంత బాగుండదు. విద్యార్థులకు బద్ధకము వల్ల చదువు సాగదు. ఆప్తుల ఆరోగ్యము ఆందోళన కలుగజేస్తుంది. వారములో అవయోగము లున్నా మిత్రసహాయము, కార్యసిద్ధి, విదేశీయుల పరిచయము, విచిత్ర వస్తు సంపాదన వంటి శుభయోగములు కూడా వుంటవి.

* పునర్వసు [కే. కో. హా. హి] *

ఈ వారము మీరు సహాయము పొందదలచుకున్న వ్యక్తిమూలముగా కార్యహాని అవుతుంది. ధనాభావంకూడా ఎక్కువ. ఇంట్లోవారి ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది. అయినా ఆధ్యాత్మిక చింతవల్ల దైవముపై భారము వేసి కార్యలాభము పొందుతారు. ఉద్యోగస్తులకు ఒత్తిడి. వ్యాపారస్తులకు నిరాశ. విద్యార్థులకు మంచికాలము కాదు. పుణ్యక్షేత్ర సంచారము, దేవతాదర్శనము, విచిత్రములను చూచుటవంటివి జరుగును. వారమంతా అవయోగ శుభయోగ మిశ్రమముగా వుంటుంది.

* పుష్యమి [హూ. హే. హో. డా.] *

ఈ వారము మీకు అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. యత్న కార్యాలు ఎక్కువ కష్టముతో ఫలిస్తాయి. కోర్టుదావాలు అనుకూలిస్తవి. ఇతరులకు సహాయము చేయపూని ఫలించక నిందలు పొందుతారు. ఇచ్చిపుచ్చుకోవడములో వివాదాలు వస్తాయి. ఉద్యోగస్తులకు అధికారుల అనాదరణ, తోటివారి సహకారము వుంటాయి. వర్తకులకు వారమంతా నిరాశ, వారం ఆఖరున మేలు. 16, 17 భార్యకు అనారోగ్యముచే ఆందోళన. విద్యార్థులకు చదువు బాగా సాగదు.

* ఆశ్రేష [డీ. డూ. డే. డో] *

ఈ వారము ఎన్ని ఆటంకములు కలిగినా పట్టుదలతో ప్రయత్నించి కార్యసిద్ధిని పొందుతారు. ఆశించిన సొమ్ము సమయానికి అందక అప్పుచేస్తారు. దెబ్బలు తగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. రసాయనిక శాస్త్రజ్ఞులకు, రంగులు, లోహం వ్యాపారస్తులకూ కష్టముతో కూడిన లాభము. గనుల యజమానులకు, యంత్రములు నడుపు నిపుణులకు, ఇంజనీరింగుశాఖ ఉద్యోగులకు మేలుకాలము. 16, 17 ప్రమాదభయము.

* మఖ [మా మీ మూ మే] *

ఈ వారము మీకు యోగకాలము. అధికారుల సహాయము, బంధు సహాయము కలుగుటచేత ఆటంకములనుగడచి కార్యసిద్ధి పొందుతారు. వైద్య, జ్యోతిశ్శాస్త్ర ప్రసంగాలలో పాల్గొంటారు. కవులు నూతన రచనలు చేస్తారు. దూరమందున్న బంధువుల క్షేమవార్త తెలియుటచే సంతోషము పొందుతారు. విద్యార్థులకు ఉత్సాహముగా చదువు సాగుతుంది. కవులకు, శిల్పులకు, గణితశాస్త్రజ్ఞులకు, నటీనటులకు మేలుకాలము.

★ నక్షత్రఫలితాలు ★

*** పూర్వఫల్గుణి (పుబ్బ) ***
(మో, టా, టీ, టూ)

ఈ వారము మీకు మంచి భాగ్యయోగము. అనుకున్న డబ్బు చేతికివస్తుంది. కోరు దావాలలో గెలుపు కలుగుతుంది. పిలల యోగక్షేమాలకై చేసిన ప్రయత్నాలు ఫలిస్తవి. పండిత గోష్ఠివల్ల, నూతన గ్రంథపఠనవల్ల విజ్ఞానాభివృద్ధి కలుగుతుంది. విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగస్థులకు పండితులకు, ఉపాధ్యాయులకు మేలు కాలము.

*** ఉత్తరఫల్గుణి (ఉత్తర) ***
(టే, టో, పా, పీ)

ఈ వారము మీకు యోగదాయకము. నీటిపై ప్రయాణము చేయవలసివస్తుంది. సంగీత సభలు, కవితాగోష్ఠివంటి వినోదాలలో బంధువులతో కలిసి పాల్గొని, వెండి పాత్రలలో మృష్టాన్నభోజనము చేస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు. నూలు, బట్టలు, బియ్యము, వెండి వర్తకులకు లాభము. విద్యార్థులు ఉత్సాహముగా చదువుకుంటారు. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుగా వుంటుంది.

*** హస్త [పూ, ష, ణ, ఠ] ***

ఈ వారము కూడా గతవారమువలె యోగదాయకంగా వుంటుంది. అసంపూర్తిగా పోయిన పనులు లాభదాయకముగా ముగుస్తాయి. శుభపుణ్యకార్యాలలో పాల్గొంటారు. వాహనయోగము కలుగుతుంది. ఉద్యోగస్థులకు హోదా పెరుగుతుంది. వర్తకులకు విలువగల వస్తువుల క్రయవిక్రయములలో ఎక్కువ లాభము కలుగుతుంది. వారమంతా శుభయోగములతో కూడియున్నా 16, 17 తేదీలలో కుటుంబ కలహము కలుగుటచే ఆందోళన పొందుతారు. స్త్రీలతోనూ, మిత్రులతోనూ విందు వినోదము.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము మీకు రాబడి తక్కువ. ఖర్చులు ఎక్కువ. గృహావసరములు తీరక కలతలు వస్తాయి. అనారోగ్య సూచనలు కనబడగానే ఔషధసేవ పొందడం, రవికి శాంతి చేయించడము మంచిది. ఉద్యోగస్థులకు కొత్తసమస్యలు, వర్తకులకు ఆందోళన. విద్యార్థులకు చదువు సరిగా సాగదు. వారమంతా భయాందోళనలతో కూడివున్నా పితృవర్గమునుండి సహాయము, కార్యలాభము కలుగుతవి.

*** స్వాతి [రూ, రే, రో, తా]***

ఈ వారము మొదట్లో నిరాశగా వున్నా మిత్రసహాయమువల్ల కార్యలాభము అవుతుంది. ధనలోపమువల్ల ఆందోళన. ఇంట్లో వున్నవారి అనారోగ్యమువల్ల అశాంతి కలుగుతుంది. ఉద్యోగస్థులకు స్వల్ప అనుకూలత. వర్తకులకు వారాంతమున లాభము. వారమంతా ఉద్రేకముతో వుంటుంది. విదేశీయుల పరిచయము, అపురూప వస్తు సంపాదన కలుగుతవి. 16, 17 ఎక్కువ ఖర్చులు, మనోవ్యథ.

*** విశాఖ [తీ, తూ, తే, తో]**

ఈ వారము మీకు మిశ్రమయోగము. ఆశించిన సహాయము లభించక, అవసరములు తీరక, ఆందోళన కలుగుతుంది. అయినప్పటికీ దైవానుగ్రహంవల్ల కష్టములు గడిచి కార్యసిద్ధి పొందుతారు. ఉద్యోగస్థులకు అధికారుల అనాదరణ, వర్తకులకు చాంచల్యము. పుణ్యపురుషుల సాంగత్యమువల్ల మనోవికాసము కలుగుతుంది. వారమంతా శాంతిగా వున్నా నష్టద్రవ్య లాభము పొందుతారు. 16, 17 అధిక ఖర్చులు.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారము అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. ఇచ్చి పుచ్చుకునేపట్ల వివాదములు వచ్చి మనోవ్యథ కలుగుతుంది. కోర్టు వ్యవహారాలు అనుకూలించినా అమిత ఖర్చులవల్ల సంతోషము వుండదు. భార్యకు అనారోగ్యము కలిగే సూచనలున్నవి. మినుములు కొర్రలు రాగులు ఉప్పు నువ్వులునూనె వ్యాపారస్థులకు లాభయోగము. ఇతరజాతులవల్ల గౌరవము కలుగుతుంది. 12 బంధువులరాక, అధిక ఖర్చులు. 16, 17 భార్యకు అనారోగ్యము.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈవారము ఎంత ప్రయత్నించినా కార్యాలకు ఆటంకాలు కలుగుతుకే

—ధరలు:—

నూలు వస్త్రములు: స్వల్పముగా పెరుగును.

నూనెగింజలు: సమ స్థాయిలో వుండును.

ఆహారధాన్యములు: నిలకడగా వుండును.

బెల్లము, పంచదార: మార్పు లేదు.

చింతపండు: తగ్గుదలలో వుండును.


పప్పుదినుసులు: వెలగలవిగా వుండును

వెండి, బంగారము: స్వల్ప తేడాలో వుండును.

దక్షిణ ప్రాంతముల స్వల్ప మేఘాడంబరము కలిగితరచు గాలివీచు చుండును.

* * *

జన్మనక్షత్రమునుబట్టిగాని, జన్మనక్షత్రము తెలియనివారు నామ నక్షత్రము (వారివారి పేర్లననుసరించి పేరు మొదటియక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకోనునది. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును, హృషీకేశుడను పేరునకు స్వాతియు, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడను పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయున్నూ చూచుకోనునది.



వుంటవి. అయినప్పటికి పట్టుదలవల్ల కార్య లాభము పొందుతారు. సోదర సహాయము వల్ల ఒడిదుడుకులు సర్దుకుంటాయి. దెబ్బలు తగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. గనుల యజమానులకు ఖనిజ, లోహవ్యాపారస్తులకు భూస్వాములకు కష్టముతో కూడిన లాభము. పోలీసుశాఖ ఉద్యోగస్తులకు మేలు కాలము. 12 ఖర్చులు ఎక్కువ. 16,17 ప్రమాద సూచన.

***మూల [యే, యో, బా, బీ] ***

ఈ వారము మీకు యోగదాయకము. ప్రయత్నించిన పనులు నెరవేరగలవి. ధన లాభము కలుగుతుంది. ఈశాన్య దిక్కు నుండి క్షేమ సమాచారము తెలుస్తుంది. శుభ కార్యములలో పాల్గొంటారు. బంధు దర్శనము. గణిత జ్యోతిషశాస్త్ర చర్చలవంటివి జరుగుతాయి. ప్రత్తి, దూది, నూలు, బట్టలు ఇత్తడి కంచు వర్తకులకు లాభదాయకము. కవులకు శిల్పులకు నటీనటులకు మేలుకాలము. 16 17 అధిక ఖర్చు.

పూర్వాషాఢ [బూ, ధ, భా, డా]

ఈ వారము. మీకు శుభయోగము ఆశించిన డబ్బు చేతికివస్తుంది. ఇంట్లో శుభకార్యాలు జరుగుతవి. పుణ్యకార్యాచరణ, ప్రభుత్వ సన్మానము, వైద్యజ్యోతిషశాస్త్ర ప్రసంగముల వంటివి జరుగును. విద్యార్థులు నూతనాంశాలు నేర్చుకుంటారు. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు, పండితులకు, ఉపాధ్యాయులకు, మేలుగా వున్నా కొంత ఆందోళన కూడా వుంటుంది. పిల్లల క్షేమమునకు కొన్ని యేర్పాట్లు చేస్తారు.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము మీరు తలపెట్టిన కార్యములలో జయము పొందుతారు. శుభకార్యములలో పాల్గొని, బంధుమిత్రులతో మృష్టాన్న భోజనము చేస్తారు. వినోదములలో పాల్గొంటారు. విద్యార్థులకు చదువు ఉత్సాహముగా సాగుతుంది. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, వెండి, బియ్యము, ద్రవపదార్థజనిత వస్తువుల వర్తకులకు లాభదాయకముగా వుంటుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలము.

*** శ్రవణము [జూ, జే, జో, ఘా]***

ఈ వారము మీకు యోగప్రదము. ధన ధాన్యవృద్ధి వుంటుంది. వివాహాది శుభ కార్యాలలో పాల్గొంటారు. ఇష్ట వస్తు లాభము, పరోపకారమువల్ల కీర్తి కలుగుతవి. విద్యార్థులకు చదువు చురుకుగా సాగుతుంది. ఖరీదైన వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు అమిత లాభము కలుగుతుంది. వాహనయోగము వున్నది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగ కాలము.

*** ధనిష్ఠ [గా, గీ, గూ, గే] ***

ఈ వారము కార్యభారము ఎక్కువ. వింత మాటలు వినుట, పరాక్రమమువల్ల ఘనత, ప్రయాణము, ధనలాభము ఉండును. అకాలభోజనమువల్ల అనారోగ్యము కనబడగానే జాగ్రత్తపడుటవల్ల మేలు. ఉద్యోగస్తులకు స్వల్ప అనుకూలత. విద్యార్థులకు చదువు బాగా సాగదు. రాజకీయవాదులకు వారమంతా అలజడితోపాటు అనుకూలత. 13, 14, 15 పితృవర్గ సహాయము, కార్య లాభము. 16, 17 అనారోగ్యము.

*** శతభిషం [గో, సా, సీ, సూ]***

ఈ వారము తలపెట్టిన పనులకు ఆలస్యము. వర్తకులకు లాభము తక్కువ. ఆత్మీయుల ఆరోగ్యము చికాకు కలిగిస్తుంది. ఉద్యోగస్తులకు వనపర్వతప్రాంతములకు బదిలీఅయే సూచనలున్నవి. రహస్యములను కనిపెట్టుటకు నియోగించబడుతారు. వారమంతా చికాకుగావున్నా వారాంతమున విదేశీయుల సహాయము, కార్యసిద్ధి జరుగును. విద్యార్థులకు చదువుసాగదు.

పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]

ఈ వారము ధనాభావము ఎక్కువ. ఎవరి సహాయముపొంది కార్యసాధన చేదామనుకున్నారో వారివల్లనే ఆటంకములు కలుగుతవి. దైవబలమువల్ల క్రమేణా కార్యానుకూలత అవుతుంది. ఇంట్లోవారి ఆరోగ్యము బాగుండదు. ఉద్యోగస్తులకు ఒత్తిడి. వర్తకులకు నిరాశ. విద్యార్థులకు మంచిరోజులు కావు. వారమంతా ఎంత ఆందోళనవున్నా సాధుసజ్జన సాంగత్యము, పుణ్యక్షేత్ర సంచారము, దేవతాదర్శనము, వస్త్రద్రవ్యలాభము కలుగును.

ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా]

ఈ వారము అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. యత్నకార్యములు శ్రమాధిక్యముతో ఫలించును. కోర్టుదావాలు అనుకూలిస్తవి. పరోపకారానికి యత్నపడి సాగక నిందలుపొందుతారు. భార్య ఆరోగ్యము సరిగావుండదు. ఇచ్చిపుచ్చుకునేపట్ల వివాదములు. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడి ఉన్నా తోటివారి సహకారము లభిస్తుంది. వర్తకులకు వారమంతా నిరాశ. వారాంతమున విద్యార్థులకు చదువు బాగా సాగదు.

*** రేవతి [దే, దో, చా, చీ] ***

ఈ వారము ఎన్ని అవాంతరాలువచ్చినా పట్టుదలతో ప్రయత్నించి కార్యలాభమును పొందుతారు ఆశించిన డబ్బు సమయానికి అందక అప్పుచేస్తారు. సోదరసహాయము కలుగుతుంది. ఆత్మీయులవల్ల నిందలుపొందుతారు. దెబ్బలుతగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. గనుల యజమానులకు, భూస్వాములకు, ఇంజనీరింగుశాఖ ఉద్యోగస్తులకు, రంగులు, లోహపుసామానుల వ్యాపారస్తులకు కష్టముతో కూడిన లాభము. 16, 17 ప్రమాదభయం. ★

★ దొంగయుక్తి ★

ఊరి బైట, కు
టీర మందొక
ముసలి యవ్వ, వ
సించుచుండెను.

తిరుగలిని, గిర
గిరా త్రిప్పి
మిన ప్పిండిని
విసరు చుండెను.

నాడు, రాతిరి
ఊరి జనముల
జాడ, కానగ
రాని, సమయము

దొంగ యొక్కఁడు
సన్న సన్నగ,
దూరె నెట్లో, కు
టీర మందున.

అవ్వ తెల్లెల
బోయి, "యేలా
వచ్చితివి ? యె
వ్వడవు, నీ"వనె.

"నే నెవడనై
తేమి ? అవ్వా !
పిండి, నీదా ?
లేక, నాదా ?

'గప్పు చుప్పు'గ
సమాధానం
చెప్పు"మని ప్ర
శ్నించె, చోరుడు.

చప్పి దౌడల
ముసలి యవ్వయు,
గొప్పగా, నని,
"పిండి నాదే !"

"నీదయిన, మేల్;
నిదరిసెనముగ,
గుప్పిటం గొని,
చప్పరింపుము."

అనియె, చోరుడు
ఆదరముతో,
అవ్వ, నవ్వుచు,
సంబరముతో

పిండి గుప్పెడు
తీసి, చప్పున,
వేసికొని, తన
నోట, గుప్పున.

గొంతు పెగలదు;
పెదవి గదలదు;
నోరు జిగురై,
బిగిసె, నవ్వకు.

— దొంగ, 'లొడ్డూ
లొసుకు,' దీసుక,
'టింగు రంగా'
అనుచు, పోయెను. ★

★ సోమంచి సూర్యనారాయణ శర్మ ★

ఆత్మవిశ్వాసం


పి. అనసూయ

కబీర్‌దాసును ఒక మహాత్ముడయులేగాక హిందువులు కూడా భక్తితో పూజించేవారు. రామ్-రహీంలకు భేదములేదని, భగవంతు డొక్కడేనని ప్రబోధించేవాడు కబీర్‌దాసు. కబీర్ గీతాలు నేటికీ ప్రజలలో బాగా వ్యాపించి వున్నాయి. అటువంటి మహనీయుడైన భక్త కబీర్‌కు కమాల్ అనే కుమారుడు జన్మించాడు. కమాల్ భక్తిలోగానీ, మంచిగుణాల్లోగానీ తండ్రిని మించిన వాడనిపించుకొన్నాడు. పులి గర్భమందు మేకపిల్ల జన్మిస్తుందా ?

కబీర్ భక్తుడు కాబట్టి ఆయన ఇల్లు ఎప్పుడూ వచ్చేఅతిథితో పోయే అతిథితో కలకలలాడుతుండేది. ఆ గ్రామములోకి వచ్చే ప్రతిసన్యాసీ, ప్రతి బైరాగీ ప్రతి భక్తుడు కబీర్‌దాసుకు అతిథి. తండ్రితోపాటు కమాల్ కూడా అతిథి అభ్యాగతులను అతిశ్రద్ధతో సత్కరించేవాడు. తెలివి తేటల్లో భక్తి విశ్వాసాల్లో కమాల్ కబీరంతటి వాడయ్యాడు.

ఇలావుండగా ఒకనాడు కబీర్‌దాసు కుమారుడైన కమాల్‌ను పిలిచి "నాయనా కమాల్, ఈరోజు మన పితృదేవతలకు పిండప్రదానం చేసేరోజు. కాబట్టి నీవు గ్రామములోకి పోయి త్వరగా ఒక చెంబెడు పాలు తీసుకొనిరా" అని చెప్పాడు. కమాల్ వెంటనే ఒక పెద్ద చెంబు తీసుకొని పాలుతేవడానికని గ్రామములోకి పోయాడు. ఇంటిదగ్గర కబీర్‌దాసు కుమారుడికొరకు ఎదురుచూస్తూ కూర్చున్నాడు. ఎంతకూ కమాల్ జాడ కానరాలేదు.

మధ్యాహ్నం అయింది. పితృదేవతలకు పిండంవేసి ఇంటికివచ్చిన అతిథులను సత్కరించాలి. వేళ మించిపోతుంది. ఎదురుచూసి చూసి కబీరుకు విసుగుపుట్టింది. తనే స్వయంగా కమాల్‌కొరకు బయలుదేరాడు. వెదకి వెదకి చివరకు పూరుబయటకు వచ్చాడు. అక్కడ కమాల్ కనిపించాడు. కబీర్‌దాసు కొడుకు దగ్గరకు వెళ్ళాడు.



చి॥ బులుసు అధ్యాత్మరామం
బాలఆనందం మొదటిపోటీలో ద్వితీయ
బహుమతి గెలుచుకున్న సభ్యుడు
[A వర్గం : 2335]
శ్రీకాకుళంజిల్లా సింగుపురంలో 5-వ
ఫారం చదువుతున్నాడు.

తనతో తీసుకొనిపోయిన పాత్రను ఒక చనిపోయి పడివున్న ఆవుప్రక్కనపెట్టి కమాల్ దానిదగ్గర కూర్చొని "ఓ గోవా, నాకు ఆపాత్ర నిండా పాలుఇవ్వవూ ?" అని అడుగుతున్నాడు.

కబీర్‌దాసు కొడుకును సమీపించి 'నాయనా, కమాల్ పాలు ఎక్కడా దొరకలేదా ? చనిపోయిన గోవు ఎక్కడైనా పాలు యిస్తుందా? రా నాయినా యింటికి పోదాం" అని అన్నాడు. దానికి కమాల్ లేచి నిల్చొని తండ్రికి నమస్కరించి "తండ్రీ ఏనాడో చనిపోయిన పితరులు ఈనాడువచ్చి ఆఆహారము స్వీకరించగా, కొద్దిగంటల క్రిందట చనిపోయిన ఆవుమాత్రం ఎందుకు పాలివ్వదు ?" అని ప్రశ్నించాడు! కమాల్ సమాధానం విని కబీర్ నిశ్చేష్టుడయ్యాడు. కానీ, వెంటనే సర్దుకొన్నాడు. "కమాల్ తన్ను వుద్దేశ్యపూర్వకంగానే ఆ విధంగా ప్రశ్నించాడని, పితృదేవతలకు పిండంవేయడం అవివేకం అని కమాల్ ఎత్తి పొడుస్తున్నాడని కబీర్ గ్రహించాడు. అందుకని కబీర్‌దాసు చిఱునవ్వుతో "కమాల్ పితృదేవతలు పిండం గ్రహించేందుకు తప్పక వస్తారు. దానికి ఆత్మవిశ్వాసం

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
బాలల సంఘం
[సభ్యత్వపు దరఖాస్తు]

GROUP
A లేక B

సభ్యుని (సభ్యురాలి) పూర్తిపేరు (విడివిడి అక్షరాలలో) ....

పుట్టినతేదీ, నెల, సంవత్సరం : జులై 1 నాటికి వయస్సు ....
తండ్రి, లేక, సంరక్షకుని పూర్తి పేరు : ....
ఊరిపేరు, జిల్లా, తాలూకా, పోస్టు [వీథి: నెంబరు] ....
* చదువుతున్న తరగతి, లేక, ఫారము ; ....
పాఠశాల పేరు : ....
ప్రధానోపాధ్యాయునిపేరు (తెలిస్తే) ;

ఆర్యా :
ఆంధ్ర సచిత్ర వారపత్రిక బాలల సంఘములో నన్ను సభ్యునిగా/సభ్యురాలుగా చేర్చుకొనప్రార్థన. పైన వ్రాసిన విషయాలన్నీ యదార్థములు.

ఇట్లు

[తేదీ : -1958]

(సంతకము)

* గమనిక : ఏ పాఠశాలలోనూగాక ఇంటివద్దనే ట్యూషన్ చెప్పించుకొనే బాలబాలికలు కూడా సభ్యులుగా చేరవచ్చు. 'చదువుతున్న తరగతి' అనే విషయానికి ఎదురుగా 'ప్రైవేట్ స్టడి' అని వ్రాయాలి.

సంచిక: 11-2-59 | ఈ దరఖాస్తు 14-2-59 నాటికి మాకు చేరాలి |

★ ఆత్మవిశ్వాసం ★

వుంటే చాలు" అని అన్నాడు. అని అనుమానానివృత్తికోసం "కమాల్ అదిగో అటు చూడు. వారే మన పితృదేవతలు" అని చెప్పాడు.

ఎదుట లీలగా కన్పిస్తున్న పితృదేవతలకు నమస్కరించి కమాల్ తండ్రికి నమస్కరించి "నాయనా నా అవివేకాన్ని మన్నించండి. నా పితృదేవతలను చూచే మహాభాగ్యం నాకు కలుగచేశారు. సంవత్సరాల క్రితం చనిపోయిన నా పితృదేవతలు ఆహారం స్వీకరిస్తారనే ఆత్మవిశ్వాసం మీకు వున్నట్లే, కొద్దిగంటల క్రిందట మృతిచెందిన ఈ గోవుకూడా పాలు యిస్తుందన్న ఆత్మవిశ్వాసం నాకూ వున్నది. అది సత్యమైనట్లే ఇదీ సత్యమవుతుంది. నన్ను దీవించు తండ్రీ" అని చెప్పాడు. కుమారుని అపారమైన జ్ఞానానికి, ఆత్మవిశ్వాసానికి కబీర్ దాసు ముగ్ధుడయ్యాడు. "కమాల్ నీ ఆత్మవిశ్వాసాన్ని వరమాత్మను వృథా చేయడు" అని కబీర్ పలుకగానే కమాల్ గోవు చుట్టూ ముమ్మారు ప్రదక్షిణం చేసి నమస్కరించి పాత్రను గోవు పొదుగువద్ద పెట్టాడు. వెంటనే గోవు పొదుగునుండి పాలధార రావడం మొదలుపెట్టింది. పాత్ర పాలతో నిండగానే కబీర్ కమాల్ లిద్దరూ యిల్లు చేరారు. ఆత్మవిశ్వాసంతో సాధించలేనిది ప్రపంచంలో ఏదీ వుండదని తండ్రీ కొడుకులు ఋజువు చేశారు. ★

దొంగ సైకిలు

మా మామయ్యకు ఒక బలేమంచి సైకిలుంది. ఆయన ఎక్కడకు వెళ్ళినా దానిమీదే వెళుతుంటాడు. మామయ్య దానిపై ఎక్కి కూర్చొని సరదాగా కాళ్లు తిప్పుతుంటాడు. అంతే! ఆయన ఎక్కడకు వెళ్ళ దలచుకుంటే తిన్నగా అక్కడకే వెళ్లి ఆగుతుంది...!

ఒక రోజున మా మయ్యగారి అబ్బాయి కృష్ణవర్మ, నేను ఒక ఎత్తువన్నాం ఎలాగైనా ఆ సైకిలును ఏడిపించాలని! మా కన్నమ్మగారి గోపీగాణ్ణి పిలిచి "ఒరే గోపీ యీ వేళ మామయ్య సైకిలు ఎక్కి కైనా బయలుదేరితే దారి కడ్డంగా నుంచో" అన్నాం. అతనలాగే నిలబడ్డాడు. సైకిలు దూరాన్నుంచే చూచి "టింగ్" అని అరచింది. భయంవేసి గోపీ తప్పుకున్నాడు. "దీనికెంత పొగర్రా!" అనుకున్నాం.

ఈసారి మరొక ప్లాను వేశాం. దారిలో పెద్ద బెడ్డలు పెట్టాం. అది యీసారి అరిచినా బెడ్డలు తప్పుకోవుగా! ఏంచేస్తుందో చూదాం..." అని చాటునుండి చూస్తున్నాం. సైకిలు వచ్చింది. బెడ్డలను తప్పించుకొని వెళ్ళిపోయింది. అబ్బ ఎంత తెలివైందిరా! అనుకున్నాం. మా పట్టుదల రెట్టింపైంది.

ఈసారి దారి కడ్డంగా ఒక కంత తవ్వాము. ఈసారి ఎలా తప్పుకుంటుంది...? తప్పక పడిపోవాలి అనుకున్నాం. ఇంతలో సైకిలు రావడం చూసి దూరంగా వెళ్లి దాక్కొని రహస్యంగా చూస్తున్నాం. సైకిలు కంత దగ్గరకు వచ్చింది. ఏమనుకుందో ఆగిపోయింది...! మామయ్యను దిగిపొమ్మందేమో దిగిపోయాడు. కంత దాటించాడు. తిరిగి ఎక్కి మామూలుగా వెళ్లి

అల్లూరి బసవరాజు

పోయాడు. మేము పూర్తిగా నిరాశ చెందాము.


"ఎందుకురా అనవసరంగా దాన్ని పడగొట్టడం...? మనం ఎక్కితేమాత్రం తీసుకెళ్ళదా...?" అన్నాడు మా కృష్ణవర్మ. ఔను! మనం ఎక్కినా తీసుకెడుతుందను కుంటాను. తీసుకొని వెళ్ళకపోతే అపుడే చూడొచ్చు...ఇపుడు మాత్రం చేసేదేముంది...! సరేఐతే సాయంత్రం ఎక్కి చూదామని నిశ్చయించాము.

రాత్రి అంతా నిద్రపోతున్నారు. వర్మ, నేను లేచాము. మెల్లగా సైకిలుదగ్గరకు వెళ్లాం. బహుశః సైకిలు నన్ను పడగొట్టదుగాని, ఎక్కేడపుడు నేనే పడతానని వర్మను పట్టుకోమన్నాను. సరిగా కూర్చోవడం కుదరాక రైట్. మా వూరు వెళ్లిపో" అన్నాను. సైకిలు కదల్లేదు. "వదిలెయ్‌రా వర్మా..." అన్నా వదిలేశాడు. అంతే సైకిలు దమ్మునపడింది! నాకు దెబ్బ తగిలిందిగాని ఏడిస్తే ఎవరైనా వింటారని ఏడవలేదు.

పడ్డ చప్పుడు విని అమ్మ మామయ్య లేచివచ్చారు. "నిన్న సైకిలుదగ్గఱకు వెళ్ల వద్దన్నానా...?" అని అమ్మ నా చెవులు వడేసింది. "బావే రమ్మన్నాడు..." ఏడుస్తూ నివ్వెరపోయి చూస్తున్న వర్మను చూపిస్తూ అన్నా. "ఔనా వెధవ..." అని రెండు తగిలించాడు వర్మకు వాళ్ళ నాన్న, ఇద్దరం శ్రుతి కలిపాం. ఏడుస్తూనే నిద్ర పోయాం.

మర్నాడు "వర్మా...! మన్నే ఏడిపించిందిరా సైకిలు..."అన్నా.

"దొంగసైకిలు......" అన్నాడు వర్మ. ★



వయ్యారి భామ

గుళ్లపల్లి భవానీ ప్రసాద్ (బాలల సంఘం) వేసిన చిత్రం. గుంతకల్లు హైస్కూలులో. 4-వ ఫారం విద్యార్థి.

సమర్పణ

కందుకూరి లింగరాజు

(గత సంచికతరువాయి)

(౮)

"హరికథ వినాలంటే అజ్జాడాదిభట్ల నారాయణదాసుదే వినాలి-సామెత చెపుతారు చూశారూ. తింటే గారెలు తినాలి, వింటే...అన్నట్లు. ఏమంటారు సోమయాజులుగారూ?" అన్నాడు దివాను చతురంగం బల్లదగ్గర కూర్చుంటూ.

"చిత్తం. రాల్గరిగించు కంఠమాధుర్యం, ఆశుకవిత్వం, మంచి సమయస్ఫూర్తి, సంస్కృతాంధ్రఆంగ్లభాషలలో ప్రావీణ్యత, నృత్యశాస్త్రకళ ఇవన్నీ ఆయనగా మూర్తిభవించినపుడు ఇంక చెప్పాలా వారి ప్రతిభమాట వేరుగా!"

"సమయస్ఫూర్తి అంటే జ్ఞాపకం వచ్చింది. ఈ మధ్య చిన్న రాణీవారు వారి కథ వింటూ అంగంలో ఏదో చెప్ప మన్నారు. నారాయణదాసు అంగసంగీతం ఎప్పుడు నేర్చుకున్నాడో, కంఠం ఎత్తేసరికి సభంతా సమ్మోహనమే అయిపోయింది! సంతోషం పట్టలేక రాణీవారు నూట పదహార్లు పళ్ళెంలోపోసి పంపేరు. పంపుతూ "వారిని మరోసారి అది పాడవలసింది"గా విన్నవించమన్నారు..."

"చిత్తం...తర్వాత ఏమైందండీ?"

"ఆ కట్నం స్వీకరిస్తూ కట్నాలకూడా వన్స్‌మోర్‌!" అనేసేడు దాసుగారు.

రాణీగారు డీలాపోయి వెంటనే క్రమ్మకుంటూ ఈసారి ఇన్నూటపదహార్లూపంపితే, పొంగిపోతూ మన సంస్థానంమీద ఆశువుగా శతకం చెప్పేశాడు!"

"అంతఘటికుడు మహాప్రభూ! అందుకనే అతని, ఆదర్శం అతనిలో! నిజం చెప్పాలంటే, అతన్ని చూస్తుంటే మాకు నోళ్ళు కడిపోతాయి" అని సోమయాజులు తల ఒగ్గినట్లు అంటూనే 'ష' అన్నాడు.

దివాన్జీ ఉలిక్కిపడ్డట్లుగా బల్లవైపు చూస్తూ "ఏమిటి యాజులుగారూ! చాలా ఉధృతంగా వచ్చేస్తున్నారు. ఇవ్వాళ మీ ఆట ఎలాగైనా కట్టి తీరాలన్న ఉత్సాహం పుడుతోంది...."

"తమలాంటివారికి మాలాంటి అల్పుల ఆట ఓ లెక్కలోనిదా! అదీ ఓ గౌరవమే మాకు" సోమయాజి వినయం బాగా ప్రదర్శించేడు.

నవ్వుకున్నాడు దివాన్జీ, సోమయాజులు లౌకికం చూసి. కొంతసేపు ఆట నిడిగానే సాగింది. ఆఖరుకు స్తంభించిపోయేస్థితి వచ్చేసరికి దివానీకంఠం సవరించుకుంటూ "పెద్ద రాణీగారిగృహస్థితి ఎల్లావుంది?"అని ప్రశ్నించాడు.

ఉలిక్కిపడ్డాడు సోమయాజీ, ఇంత ముక్కుకు సూటిగా అడగడం క్రొత్త అనిపించినందువల్ల "అబ్బాయిని క్షుణ్ణంగా పరిశీలించమన్నానండి" అనిమాట తప్పించినట్టూ అవుతుంది. పైగా ఎల్లాగైనా వసుపతికి దివాన్జీ ప్రాపకం కావాల్సివుంది. కాబట్టి దానికి ఇదో ప్రాతిపది అవుతుందీ అన్న ఊహాల్లో.

"అంత శ్రద్ధా?" అని ప్రశ్నించేడు.

తప్పిందికాదు యాజులుకు "ఇప్పుడు శని మహాదశలో రవ్యంతరం అయ్యింది. రోజులు..."

"అంత మంచివిగా లేవంటారా? ప్రాణభంగం ఏమైనా?"

"లేదండి...కాని..."

"సంశయం ఎందుకూ?"

"జమిందారుగారి జాతకంకూడా ఇప్పుడు ఏమంత బాగుగా లేదు. గత్వగత్వ అయితే వీరా, వారా అన్నదే మీమాంస..."

"ఆ!" ఉలిక్కిపడ్డాడు దివాన్జీ.

"ఎంతకాలం?"

"శ్రావణం దాటేవరకూ?"

"మరి, మీ అబ్బాయి ఏమన్నాడు?"

ప్రశ్నకు జవాబు చెప్పకూడదన్నట్టే, "మీ మంత్రి...రాక...ఇల్లా వచ్చేరా?" అనేసేడు.

కోరల్లోంచి ఓసారి చూచినట్లుగా బల్లవైపు తిరిగి, సంబాళించుకుని 'చెప్పేరు కాదు!" పునహః ముదలకించేడు.

"ఏదో తప్పుగా అర్థంతీసివుంటాడు. అందుకే మళ్ళీ పరిశీలించమన్నా..."

"ఎందుకు దాచారు! చెప్పండి"

"విషప్రయోగం తప్పదన్నాడు."

"ఎవరికి?"

"జమిందారుగారికే!"

ఈ దెబ్బతో దివానీ మనస్సు చెదిరిపోయింది! నెరసిన తలలో ఈ గండాలు దాటడం అన్నది నిత్యకృత్యం అయినట్టే తోచినా, దీనికిమాత్రం మార్గంలేదా అనిపించింది. "ఎప్పుడో ముఫ్పైవత్సరాల క్రితం చేరేను. తండ్రిగారు ఓనమాలు దిద్దేరు. కంటికి రెప్పలాకాస్తూ, తిండీ, నిద్రా, రక్తం మాంసం అన్నీ వచ్చిన పెనుగాలులను అడ్డుకోవడంతోటే సరిపోయాయి. జీవితం అశాంతితోనే గడచిపోయింది."

ఉప్పు పులుసూ తిని, ఈ పంచనే పెరిగిన కృతజ్ఞతంతా చూపించినా, ఆ వారసుల పన్నాగాలు అల్లాగే వుండిపోయేయి. దిన దినగండంగానే వుండిపోయింది బ్రతుకు.

సోమయాజులుగారూ! ఎప్పటికి శాంతీ, మోక్షం వస్తాయీ?"

ఆ ఆఖరుప్రశ్న వేసేటప్పటికి దివాన్జీ గొంతుక రుద్ధం అయిపోయింది. హృదయం క్షుభితం అయి, సప్తస్వరాలు అందులో మేళవించినట్లే అయ్యింది. కళ్ళు చెమ్మగిలేయి.

ఆస్థితి చూచేటప్పటికి సోమయాజులు గుండె తరుక్కుపోయింది. వెల్లువలా దుఃఖం పొరలివచ్చినా అపుకుంటూ!

"మీకే అల్లా అయిపోతే ఎలాగ చెప్పండి ఎవరికర్మకు ఎవరు బాధ్యులు? కర్మ పరిపక్వం గానిదే ముక్తిరాదు; మానవత్వం అన్నది దానికోసమేకాదూ? అయినా కాని..." అని ఆపేడు మధ్యలో.

కారుచీకట్లలో మెరుపు మెరిసినట్లు దివానీ కళ్లు మిలమిలా మెరిసేయి. 'ఏమిటో' అన్న ప్రశ్న వాటిలో గోచరించింది.

"ఎందుకేనా మంచిది, ఆ ప్రతిష్ఠ ఇప్పుడు కూనిపించలేరూ?" అనేసేడు.
"ఏం?"
"దాంతో నే ముసలం ప్రారంభమయ్యేట్లువుంది!"
"మహారాజం కొమ్ములు తిరిగిన కాకి పండితులే పెట్టేరు!"
మావాడు మాత్రం అది బలి కోరుతోంది- అందులోనూ నరబలి! అన్నట్టు చెప్పేడు.
అర్థం అయ్యింది దివాన్జీకి. ఇప్పుడు నర హాయమ్మగార్ని ఆ ప్రయత్నం విరమించ మనడంసాధ్యంకాదు. పైగా ఇప్పటికప్పుడే అది మూడు పర్యాయాలు వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పుడు ఏ విధమైన ప్రయత్నంకూడా వట్టి వ్యర్థమే అవుతుంది. విరాళి కలిగింది. అయినా ఇలాంటివెన్నో చూచిన గుండె అవడంవల్ల భీరుత్వం రాలేదు.
"యాజులుగారూ! మీ ఆట ఇంక మూడేత్తుల్లో కట్టేస్తాము!" ఏదో పానకంలో పుడకలా ఈ సంభాషణంతా వచ్చిందన్న భావంతో అన్నాడు దివాన్జీ.
ఉలిక్కిపడ్డాడు యాజులు. ఓసారి కలయ చూచుకున్నాడు. అప్పటికే ఆట లుగసాను అయ్యింది. కబుర్ల మధ్యలో తను చూసెక. మొదట్లో కూర్చున్నప్పుడు వచ్చిన ఇవ్వాళైనా ఆయన ఆట కట్టాలన్న పట్టుదల నీళ్ళు కారిపోవడం ఓ విధంగా కుమిలిపోయేట్టే చేసింది. అయినా ఏ మొండి ఎత్తులో వేసి ఏ మన్నుగానో ఆటను అంతం చేద్దాం అన్నా అదీపాసగనట్లేవుంది. మనస్సు ఓసారి గజిబిజీ అయిపోతే, అవ్యక్తంగా:
"మా కాలం వెళ్ళిపోయింది. ఇప్పుడు మారిపోతున్న కాలంలో ఆమె గౌరవం అన్నది సంకేతమే అయింది. ఒదులుకో లేక ఆ పూర్వాచరణలన్నీ పట్టుకుని జీవుళ్ళాడ్డంగా తయారయింది మా జీవితం. మాకసలుసలం లేనట్లేవుంది" అన్నాడు.
దివాన్జీ "ఏం అలా అంటున్నారు!"
"ఏం చెప్పమన్నారు? వర్ణాశ్రమ ధర్మాలు పాటించనక్కరలేదు. హరిజనోద్ధరణ, స్త్రీ స్వాతంత్ర్యము, వితంతువివాహము, వర్ణాంతర వివాహాలు ఇవన్నీ ఆ గాంధీతో మొదలయ్యాయికదా! ప్రతివాడూ నాయకుడే! మరి ఇంక మేము అస్త్ర సన్యాసం చెయ్యవలసిందేకాని ఇంకో మార్గం ఏమీ కన్పట్టం లేదు." అన్నాడు బాహాబాగా వ్యక్తమైంది ఆ మాటలలో.
"పోనీ మీరూ మారండి" అన్నాడు నవ్వుతూ దివాన్జీ.
"ఇంత బతుకూ బతికి ఇంటివెనకాల వచ్చినట్లే!" అంటూ పావులన్నింటిని భరిణలోకి ఎత్తేడు. కాలువా సద్దుకుంటూ.
"మాకు శెలవు ఇప్పించాలి. ఉదయమే మా గ్రామం వెళ్ళిపోతాం. పెద్దరాణీవారి శెలవూ పుచ్చుకున్నా. ఇంక తమవద్దకూడా" అని వసికేసేడు.
ప్రక్కగావున్న సందుకా పెట్టె తీస్తూ ఓ పవ్వ కాగితంతీసి! "ఏదో ఖర్చులకు వుంచుకోండి...మరి అవివయం మాత్రం..."
"ప్రాణంపోయినా బయటకు రాదు! ఎంతమాటన్నారు!" అంటూ లేచి వేదోక్తంగా ఆశీర్వదిస్తూ దేవిడీ గుమ్మందిగేడు. బసకు వెళ్ళేసరికి వసుపతి చేతిలో వుత్తరం వుండడం, పార్వతి దిగాలుపడి కూర్చోవడం చూచి ఏం పుట్టి మునిగి పోయిందో అని ఖంగారుపడుతూ "ఏమిటిరా?" అన్నాడు.



చి॥ బోడపాటి సీతాకుమారి

బాలల సంఘం సభ్యురాలు; వయస్సు పదేళ్లు. మద్రాసులోని శారదా విద్యాలయంలో రెండోఫారం చదువుతున్నది. చక్కగా నాట్యం చేస్తుంది.

"శ్రీపతి వ్రాసేడు. చేలో పశువుల్ని వాళ్లు తోలి-అడ్డుపడితే, పిణ్ని, వెంకటస్వామిని వాళ్లు దుర్భాషలూ ఆడేగుట. చేనంతా నాశనం అయ్యిందట. మొండి ధైర్యంచేసుకుని వెంకటస్వామి బందెల దొడ్డికి తోలుకు వెళ్లితే మునసబు 'ఖాళీలేదు' అని మొరాయించేట!"
"అవధాని వున్నాడుగా, వాడేంచేస్తున్నాడు?"
"వాడు వున్నా లేనట్లే అయ్యింది!"
"మరి?"
ఏమీ పాలుపోలేదు. కోపం ఒణికించింది. తను పుట్టి, పెరిగి ఏలిన రాజ్యం, విచ్ఛిన్నంలో పడిపోయింది. అటు దివానుకు తనకీ పరిస్థితుల తేడాతో, ఒకే సందిగ్ధావస్థ ఎదురైనట్టు అనిపించింది.
"కానివ్వండి. సామానంతా సర్దేరా?"
తల ఊపేడు వసుపతి.
"అరసవిల్లిసూర్యదేవాలయం, శ్రీకూర్మం సింహాచలం వెళదామన్నారుగా" అంది మధ్యలో పార్వతి.
"అక్కడ కొంపలు తగులడుతుంటే ఇక్కడ దేవుళ్ళెమిటే! తెల్లవారుఝాము బండికే వెళ్లిపోదాం."
నోరు కట్టేసుకుంది పార్వతి.
కనీసం ఆ సింహాచలం కొండమీద ఉన్న సంతానస్తంభంను చూసేనైనా తనమీద కనికరించి సింహాచలేశ్వరుడు ఓ పుత్రుణ్ణి ప్రసాదిస్తాడేమో అన్న వూహాపటాపంచలై పోయింది. నిస్పృహ కలిగినట్లే అయినా 'శ్యామలకూడా లేదుగా, దేవుడిని అర్చించడానికి అన్న భావం స్ఫురించగానే తలవంచుకున్నాడు వసుపతి.

—ఇంకా వుంది]

ఆమె సౌందర్యవతి...
ఆమె పాండ్స్‌ను ఉపయోగిస్తుంది



మీ ముఖమును మృదువుగా మరియు మనోహరముగా ఉంచుకొనుటకు

పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్‌ను వాడండి

తేలికైన మరియు మంచువలెనున్న పాండ్స్ వ్యానిషింగ్ క్రీము చర్మమునకు రక్షణనిచ్చి దానిని చక్కగా మరియు మనోహరముగా ఉంచుతుంది. అది జిగురుగా ఉండదు మరియు రాసుకొన్న మరుక్షణము లోనే కనపడకుండాపోతుంది. పాండ్స్ వ్యానిషింగ్ క్రీమును పౌడరు అద్దుకొనే ముందు వాడితే పౌడరును గంటలతరబడి అంటుకొని ఉండేలా ఉంచుతుంది.



చర్మమును శుభ్రపరచే క్రీమ్
ప్రతి రాత్రి మీ ముఖమునకు పాండ్స్ కోల్డ్ క్రీమును రుద్ది రాసుకోండి. అది చర్మమును శుభ్రపరుస్తుంది మరియు మీ లావణ్యమును- కాపాడుతుంది.

చీస్‌బ్రో-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమితమైన బాధ్యతతో యు.ఎస్.ఎ.లో స్థాపించబడినది)

జీవన లీల

(19 వ పేజీ తరువాయి)

ఉన్నా లేకపోయినా తనంటే ఒకరికైనా హృదయం నిండా ప్రేమ ఉంది... ఇక్కడున్న వాళ్ళూ వీటన్నిటినీ సులభంగా అనుభవించవచ్చు. పరాయి ఇంట్లో ఉన్నట్లు రోజులు గడపటంవల్ల లాభమేమిటి?

మర్నాడు ఉదయం పరాన్ ఇంటికి వెళ్ళాడతడు. పరాన్ ఆ రోజునా యింట్లో లేడు. మోక్షదా వసారాలో కూర్చుని ఉంది. గొంతుపుండు చూపించుకోటానికి వాజిత్పూర్ వెళ్ళాడు పరాన్.

ఊళ్ళో తను యింటికి దగ్గరలోనే ఉన్నాడు డాక్టర్ శశి. ఊళ్ళో అతడి ఆస్పత్రి ఉంది. అయినా గొంతుపుండు చూపించుకోటానికి పరాన్ వాజిత్‌పూర్ వెళ్ళాడు. కోపంతో శశికి ఒళ్ళు మండిపోయింది. పరాన్ తననిలా అవమానించగలడని అతడెన్నడూ ఊహించనైనా లేదు. ఓరోజున ఏదో కాస్త కటువుగా మాట్లాడాడని అతడిని నిర్లక్ష్యంచేసి, చికిత్సకోసమై వాజిత్‌పూర్ వెడతాడా పరాన్? పట్టుదలకేం తక్కువలేదు పరాన్‌కి! వంటచేస్తోంది కుసుమ వచ్చి ఎత్తుపీట తెచ్చి వేసింది.

“ఉహూఁ కూర్చోను” అన్నాడు శశి.

“కూర్చోవా యనా, కూర్చో, ఇంటికి వచ్చిన వాళ్లు కూర్చోకుండా వెడతారా ఎక్కడైనా? ‘నీకు వేరేపని ఏదయినా ఉంటే వెళ్ళు వాజిత్‌పూర్. అంతే కాని, మన శశి ఉండగా నువ్వు మరొకరికి పుండు అవీ చూపించుకోవద్దు. ఎంత పరకాయ డాక్టరైతే మాత్రం మన శశికంటేనా?’ అని ఎన్నో విధాలా చెప్పాను బాబూ! దానికేమనుకున్నాడనుకున్నావ్? ఒక్క తెలివి తక్కువ సమాధానంతే అది: “చినబాబుగారు హడావిడిగా ఉంటారెప్పుడూ. విసుక్కుంటారు. వారిని ఇబ్బందిపెట్టి ఏం ప్రయోజనం, అన్నాడు” అన్నది మోక్షదా.

ఇదివరకు ఇలాంటి మాటలకి ముసిముసినవ్వులు నవ్వుతూండేది కుసుమ. కాని ఇవాళ ఆమెముఖంలో నవ్వు కన్పించలేదు.

“చినబాబుగారి మందు తీసుకోవటంమూలంగా పుండు పెద్దదయిందిగా: అందుకని వాజిత్పూర్ వెళ్లాడు” అన్నది పైగా.

మోక్షదా భగ్గుమంది. “అందుకని వెళ్ళాడా వాజిత్పూర్! ఆ! నీతో చెప్పి వెళ్ళాడు కాబోలు అందుకే వెడుతున్నావని. ఈ మాటలు నువ్వు కల్పిస్తున్నావి. నోటికి వచ్చినట్లల్లా మాట్లాడుతుంటావ్ నీకెందుకు—నువ్వు వంటింట్లోకి వెళ్ళరాదూ?”

శశి నిజంగానే కుసుమ నవ్వు చూడాలని ప్రతీక్షిస్తున్నాడు.

ఇంతసేపటికిప్పుడు నవ్వింది ఆమె. “నేనెందుకు కల్పించి చెపుతానత్తయ్యా, వెడుతూ వెడుతూ మీ అబ్బాయి నాతో చెప్పిన మాటలే ఇవి. నాతో అన్న మాటలేవో నే చెప్పాను. అంతే...” అన్నది కుసుమ.

కొంచెం నొచ్చుకున్న మనస్సుతోనే ఇంటికి తిరిగివచ్చాడు శశి. పరాన్ ఏమనుకుని ఉంటాడు! ఆ రోజున తానిచ్చిన మందుకి పరాన్ గొంతుపుండు కాస్త పెద్దదయితే అయివుండొచ్చు. దానికేమీ ఆశ్చర్యంలేదు. ఆ మాత్రానికే భయపడిపోయి వెళ్ళాడా పరాన్? తన చికిత్సమీద విశ్వాసంలేదా అతడికి?

—ఇంకా వుంది]

మగవారికి మాత్రమే!

(28-వ పేజీ తరువాయి)

చెరువై పోయింది, బ్రతుకు బరువై పోయింది. ఎవరైనా ఎన్నాళ్ళు భరిస్తుంది చెప్పు?’

మళ్ళీ ముగ్గురూ ఒక్కసారి ‘బాపురే’ అన్నారు. తల్లికూడా శ్రుతి కలిపింది. ఎలాగో నిలదొక్కుకుని ఆమె అంది:

‘అయ్యో, తల్లి ఎంతెంత కోతలుపడ్డారే అమ్మా, పడి ఇంకా ఎలా బతికున్నారే మా అమ్మా! ఎంతటి ఓర్పుతల్లి మీది! సీతను మీ పక్కన నిలబెడితే సిగ్గుతో తల వొంచుకొంటుంది! మనకథలు వింటే తడారిపోయిన ఎడారి భూదేవికుండే అయినా భగ్గున బ్రద్దలవదుటే! ఎవరెవరికో ఏందుకు, ఈమధ్య మీవాళ్ళు ఇలా గేతయారయ్యారు. ఏమీ లేదు, ఈ మధ్య యిద్దరం భోజనాలు చేసి వీధిలో కూచుని కబురు చెప్పుకొంటున్నాం. అలా సినిమాబండీ వెళ్లింది. ‘మావా ఒకంటి అలుసే’ ఆ సినిమా. నాకుమాత్రం చూడాలని ఉండదా చెప్పు? మీవాన్నలాంటి గుడివాళ్లు కానుకోలేరనే అంది మీద తాటి కాయలంతఅక్షరాలతో ‘నేనే చూడండి’ అని రాశారు. అవాళే చూడకపోతే వాళ్ళేమనుకుంటారు చెప్పు? అవాళ లేదు, మర్నాడు లేదు, మూడోనాడు లేదు! ఇహ ఆరంపపు కోత భరించలేకపోయాను. ఒక్కటేచాటా వినండి, అమ్మా, మొగాళ్ళు అంతా మోసగాళ్ళు... మొదటిరకం మొనగాళ్ళు. ఆడాళ్లు అంతా అమాయకురాళ్లు. అడుగడుగునా ఆరళ్లు... ఈ కాపురాల తిప్పలింక చాలు గాని పదండి అమ్మమ్మ దగరకి పోదాం.’

‘ఆగండి’ అని అటకాయించాడు అన్నీ చాటూ తిరిగే ఆదిదేవుడు. ‘మీరు ఒకచోటికి వెళి సుఖపడేదేమిటి? అంతులేని మీ అసంతృప్తి తీరదేమిటి? గొంతెమ్మ కోర్కెల కోమలాంగు లందరూ బల్లులై వసించండి.’ అని శపించాడు. అంతే. వాళ్ళు బల్లులయి పోయారు.

* * *

చిన్నప్పుడు ఈ కథ విన్నప్పుడు విశ్వం ‘భలే, భలే’ అని సంతోషించాడు. ఇప్పుడు ‘అరే, అరే’ అని విచారించాడు. ఈ పరిస్థితిలో అతనికి కథేం నచ్చలేదు. ఎంత రక్తం తాగినా బల్లికి తృప్తి ఉండదు. ఇంకా కుడుతూనే ఉంటుంది. దాని దాహం తీరకుండానే మనం చంపేస్తాము. అలా దాహం తీరని బల్లులన్నీ... ఆడవాళ్ళయి పుడతాయి. అవును... అదే నిజం... ఇంటి పనులన్నీ చేసుకొచ్చి మళ్ళీ శేషులు అందుకుంది:

‘ఇంగితజ్ఞానం లేకపోయాక ఇంజనీరు అవుతేనేం, ఇంగ్లండు కెళ్ళి తిరిగొస్తేనేం? మా చిన్నన్నయ్య రామకృష్ణ పేనయింది బియ్యేడీ అయినా కలెక్టరు భోగం అనుభవిస్తున్నాడు. వాడూ, మా వదిన కారకా సినిమా కెడుతూంటే చూడ వేడుకగా వుంటుంది. నేనూ ఉన్నాను... ఏ వేళ చూసినా వేవిళ్లూ పురుళ్లూ అనుకుంటూ... నేనూ ఆయనా పిల్లా కర్మంచాలక రిక్షా ఎక్కి సినిమాకి వెడితే వేరే బొమ్మల కొలువు పెట్టనక్కర లేదు... చూసి నవ్వనివాడిది పాపం... ఎందుకొచ్చిన బతుకిది!’

శేషులు అరచి అరచి పడుకొన్న తరువాత విశ్వం ఆలోచనలు మళ్ళీ తరలాయి. నిజం చెప్పాలంటే బల్లి బాధపడలేక అతను పెళ్ళి చేసుకున్నాడు. బల్లిబాధ పోయిందా? అతను లైటు వేసి చూశాడు. అవాళ తనమీద కోపం వచ్చి శేషులు భోంచెయ్యలేదు... మంచం చివరికి చుట్టుకొని పడుకుంది... బల్లని చీర కట్టుకుంది... సరిగ్గా చూస్తే ఎలా ఉందీ? బల్లి! విశ్వం ఏడవలేక నవ్వుకున్నాడు... మొగవాడు ఎంత వెర్రివాడు! ఎక్కడో బస్సులో ట్రాములో రిక్షాలో సినిమాలో ఆఫీసులో స్కూలులో, హోటలులో బల్లి ఉందని భయపడి ఇంటికొస్తాడు. నిజానికి ఎక్కడుంది బల్లి? తన పక్కపక్కనే... పక్కలోనే! ★



వనితాలోకం

సర్వప్రియ సరోజినిదేవి

వనితాలోకానికి ఆదర్శమహిళ సర్వప్రియ సరోజినీదేవి. 1879 ఫిబ్రవరి 13 తేదీని హైదరాబాదు నగరంలో అఘోరనాథ చటోపాధ్యాయ, వరదసుందరీ దంపతులకు జన్మించింది. సరోజినీదేవి చిన్ననాటనే తన కవితాప్రతిభను ఉపాధ్యాయులు అబ్బుర పడునట్లుగా మెరిసేది. లెక్కలు చేయుటకు తీసిన పుస్తకం కవిత్వంతో నిండేది. పన్నెండు సంవత్సరములు నిండేటప్పటికి మెట్రిక్యులేషన్ పరీక్షయందు ఉత్తీర్ణురాలైనది. పదహారవయేట ఉన్నతవిద్యకై యింగ్లాండు వెళ్ళింది. లండన్‌లోని కింగ్స్ కాలేజీలో కొన్నాళ్లూ కేంబ్రిడ్జి లేడీస్ కాలేజీలో కొన్నాళ్లూ చదువుకొని ఎం.ఏ. పట్టా పొందింది. అటుపిమ్మట ఇటలీదేశమంతా పర్యటించి భారతదేశానికి తిరిగి వచ్చింది. వర్ణాంతరవివాహం చేసుకొని తెలుగువారి కోడలై నలుగురు పిల్లలకి తల్లి అయినది. ఇద్దరాడపిల్లలూ, ఇద్దరు మొగపిల్లలూను. జై. సూర్య, పద్మజ, రణధీర, లీలామణి అని వారి పేరు.

అంత చదువుచదువుకొని గృహిణియై, మాతయై మామూలుస్త్రీవలె సంసారయాత్ర సాగిస్తోన్నా ఆమెలోని శక్తియుక్తులు కవితాప్రతిభా నశించలేదు. సరోజినిదేవి వంటి మహిళలు మామూలు సుఖదుఃఖాలతో తృప్తిపడరు. వారిప్రతిభ లోకోపకారార్థమై వినియోగించుటకు ఆరాటపడతారు. ఆ ఆరాట ఫలితమే సరోజినీదేవి కవయిత్రి కావడం, ఆ ఆరాటఫలితమై ఆమె కాంగ్రెసువాదినిగా దేశసేనకు పాటుపడడం; మహిళాజనప్రగతికి కృషి చేయడం. ఆమె ప్రతిభా సేవానిరతి మహాత్మునికి ఆమెను ప్రీతిపాత్రురాలుగా చేసింది.

భారతదేశ స్వాతంత్ర్యము, భారతమహిళల పురోభివృద్ధి ఆమె ప్రధాన ఆశయాలు, దేశస్వాతంత్ర్యమునకై ఆమె చేసిన త్యాగము సాటిలేనిది. ప్రకృతి ఆమె కారాధ దేవత. సరోజినీదేవి రచనలు మృదుమధురములు. వానిలో జాతీయభావములు నిబిడీకృతములు కండుకోయిల గొంతుకలోని మాధుర్యము ఈ కవికోకిల కవిత్వమున కాన్పించును. బర్డ్ ఆఫ్ టైమ్, గోల్డెన్ త్రెష్‌హోల్డ్, బ్రోకన్ వింగ్ మొదలైన రచనలు రసవంతములు. జగన్నుతములు. ఈ రచనలతో ప్రపంచమంతా భారత కవయిత్రిని గుర్తించారు. అలిండియా సోషల్ కాన్ఫరెన్సుకు ప్రఖ్యాత కవయిత్రిగా యామెను ఉపన్యాసమిమ్మని కోరరు. అటువంటి గౌరవంపొందిన మొదటి భారత నారీమణి సరోజినీదేవి. సరోజినీదేవి ఆడంబరము ఎరుగదు. ముతుక ఖద్దరు నేకడుతూ ఆకర్షణీయంగా వుండేది. చీనిచీనాంబరాలూ రత్నాలు తాపిన సువర్ణాభరణాలు విసర్జించి గాంధీమహాత్ముని అడుగుజాడలలో నడచి 1924వ కాన్పూర్ కాంగ్రెస్‌కు అధ్యక్షురాలై అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి అనేకసార్లు కారాగారశిక్షలు అనుభవించింది. కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఆమె వేదికనెక్కి చెప్పినమాటలు అమూల్యములు.

"ఉయ్యాలలూపి జోలపాట పాడిన పిలల తల్లిని, నేను భారతమాత చిహ్నంగా స్వాతంత్ర్యజ్యోతిని వెలిగిస్తున్నాను. నన్నీ స్థానంలో కూర్చుండబెట్టి మీరు భారతస్త్రీలకు వేదయుగంనాటి గౌరవాన్ని కలిగించి మన జాతిధర్మం నిలబెట్టేరు" అన్నది.

ఎన్ని వ్యాపకాలు వున్నప్పటికీ సరోజినీదేవి పిలల పెంపకమునందు అశ్రద్ధ చూపలేదు. గృహకృత్యాలను విస్మరించలేదు, ఆమె పిల్లలందరూ ఉన్నత విద్య నభ్యసించి ప్రతిభావంతులని పేరు తెచ్చుకొన్నారు. సరోజినీదేవి ముద్దులకుమార్తె పద్మజనాయుడు ప్రస్తుతం బెంగాల్ గవర్నరు పదవి నిర్వహిస్తోన్నారు. సరోజినీదేవి సోదరుడే ప్రసిద్ధ కవి, గాయకుడు, గొప్ప నటుడూ, ఐన హరీంద్రనాథ చటోపాధ్యాయ, సరోజినీదేవి చెల్లెండ్రు. మృణాళినీదేవి, సుహాసినీదేవి, బొంబాయి నగరములో పేరు ప్రఖ్యాతు లార్జించిన మహిళలు. సరోజినీదేవి కావ్యరంగమున స్వాతంత్ర్య కదనరంగమున, ప్రతిభతో విహరించిన మహిళ. దేశసేవాభిలాషిణి. ఆదర్శమహిళ. 1947 ఆగష్టు 15 తేదీని భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక సంయుక్త రాష్ట్రాలకు గవర్నర్ అయింది. సర్వప్రియ సరోజినీదేవి భౌతికంగా 1949 మార్చి 2 తేదీని చనిపోయినా ఆమె పేరు శాశ్వతంగా హిందూదేశ ప్రజల హృదయసీమలో అధిష్ఠించి వుంటుంది. ★

మోచర్ల సుబ్బలక్ష్మి (భీమవరం)



ఎంతమంది పిల్లలు మీకు?

పవని నిర్మల ప్రభావతి

ఆవిడతో పరిచయమైన ఓ అరగంట తర్వాత—ఏదో మాటవరసకు "ఎంతమంది పిల్లలుమీకు? అనడిగాను.

"ఎనిమిదుగురు ఆడపిల్లలు ముగ్గురు మగపిల్లలు ఇప్పుడు ఆరో నెల..." అందావిడ సన్నగా!

నిజానికి నా కౌతుకంలో—చిన్నప్పుడెప్పుడో చూసిన్న ఫిట్స్-తిరిగి వస్తాయేమోననిపించింది. చూస్తే ఆవిడా ఏమంత పెద్దదిగా కూడా లేదు. మహావుంటే ముప్ఫై ఎనిమిది—ముప్ఫైతొమ్మిది ఏళ్లకుమించి వుండవు...పదకొండు మంది పిల్లలు, మళ్ళీ ఇప్పుడు గర్భవతి! మనిషినిచూస్తే సైన్స్ లేబరేటరీలో స్కెలిటన్ జ్ఞాపకానికొస్తుంది. ఎప్పుడు చూచినా ఏదో ఓ జబ్బుతో బాధ పడుతుంటుంది. ఇది ఆవిడరూపం! ఇక ఆవిడ పిల్లల్ని చూద్దాం: పెద్దమ్మాయికి ఇరవై రెండేళ్ళట! ఇక ఆ తర్వాత వాళ్లందరూ, ఒక్కొక్కరికి మధ్య ఒకటిన్నర సంవత్సరం కంటే ఎక్కువ తేడా లేదన్నమాట! ఆపిల్లల్ని చూస్తుంటే ఉత్సవాలలో ఓ పొట్టిమనిషికి పెద్దతల పెట్టి వూరేగిస్తుంటారు చూశారూ. అది జ్ఞాపకం వస్తుంది. కాళ్లు చేతులు సన్నగా జలుబూ దగులూ, తప్పితే మరిదేంతోనో బాధపడుతుంటారు. అసలు ముఖ్యమైన విషయం—ఆ ఇంటి యజమాని చేసేది హైస్కూలుటీచరు పని! ఇక సంసారం సంగతి ఎలా వుంటుందో అనుభవించే వాళ్ళకేగానీ తెలీదు! పై కుటుంబాన్ని కేవలం పోలిక చెప్పామనిగానీ, వాళ్ళ రూపు రేఖల్ని విమర్శిద్దామనిగానీ రాయు తున్నా ననుకోకండి...ఈ వ్యాసానికి నాంది అదే కాబట్టి వుటికి పరిచయం చేస్తున్నానంతే. ఆ మాటకొస్తే మనదేశంలో అలాంటి సంసారాలు ఎన్నో ఉన్నాయి. వాళ్ళంతకూడా, జీవితంలో వెలుగనేది చూడకుండా, జీవచ్ఛవాల్లా సంసారాలను సాగిస్తుంటారు. బాగా ఆస్తిపాస్తులూ, మేడలూ మిద్దెలూ, లక్షల లక్షల డబ్బూ వుంటేవాళ్ళ సంగతిగాదు నే చెబుతూంట. మధ్య తరగతి కుటుంబాలు—అంతకంటే హీనంగా (అన్న వస్త్రాలకి) బ్రతుకుతున్న చివరి తరగతివాళ్ళు—లెక్కొడితే గాని డొక్కాడనివాళ్ల సంగతన్నమాట. ఒక్కొక్కరూ పదిమంది, పన్నెండుమంది పిల్లల్తో జీవితాన్ని భారంగా సాగిస్తూనిరాశా నిస్పృహలమధ్య నలిగిపోతుంటారా సంసారులు!

నిజానికి మనదేశంలో రోజు రోజుకూ జనాభా ఎక్కువైపోతోంది. దానితో పాటు రోగాలు రొచ్చులు కూడా పెరిగిపోతున్నాయ్! ఎక్కడ చూడినా హాస్పిటల్స్ క్రిక్కిరిసి పోతున్నాయ్! ఇక డాక్టర్ల సంగతి సరేసరి...ఊపిరి కూడా పీల్చుకోటానికి లేదు...అంతటితో సరిపోకుండా, ముప్ఫై, ముప్ఫైఐదేళ్ళొచ్చే సరికే, యువతులూ, యువకులూ కూడా బాగా ముసలివాళ్లయిపోతున్నారు. అలాగే మృత్యువుకూడా చాలా తొందరగా వచ్చేస్తోంది. ఇక పిల్లల సంగతిచూస్తే, బాగా ఆరోగ్యంగా, పుష్టిగా వుండే పిల్లలు ఎక్కడో ఒక్కరూ ఇద్దరూ తప్పిస్తే మరి కనపడరు! అది విదేశాల్లో ఒక్కొమనిషి కనీసం—ఎనభైఏళ్లు బతుకుతాడు. అరవై



సింహళం (కాంటి) నుంచి మొదటిసారిగా కళాకారులు మద్రాసులో ప్రదర్శన ఇవ్వడానికి వచ్చారు. ట్రిప్లికేన్ కళామండపంలో వారి 'గజగమన నృత్యం'

[illegible] పిల్లలు మీకు?

సంవత్సరాలు వచ్చినా, ముసలితనమొచ్చిందనిపించదు! అలాటివాళ్ళకు మృత్యువు కూడా త్వరగా దగ్గరికిరాదు! బాగా ఆరోగ్యంగా పుష్టిగా ఆనందంగా వుంటారందరూ! మరి అదలా సాధ్యమౌతుంది? మనమిలా అనారోగ్యంగా అన్నివిధాలా అన్యాయంగా వుంటానికి కారణమేమిటి? అదే. నేచెప్పానే ఒక ముఖ్యకారణం పైన చెప్పిన తరహా కుటుంబం—అలాటివి మనదేశంలో ఎక్కువ!

మొదట నే చెప్పిన కుటుంబం సంగతి పరిశీలిద్దాం! ఆ యజమాని తెచ్చే ఆదాయం, తెలుగు ఎంత ట్యూషన్ చెప్పినా, రెండు వందలరూపాయలు మించివుండదు. ఇంట్లో మొత్తం జనాభా పదమూడుమంది! అందులో అద్దెకొట్టు వాళ్ళు సగంమందే అనుకున్నా, మొత్తానికి జీవితావసరాలన్నీ, కావల్సిన వేగదా! రెండు వందల రూపాయల రాబడితో బస్తీలోగాని, నగరంలోగాని ఇంతమందిని పోషించాలంటే ఆ బాధ దేవుడికూడా అర్థంకాదు! పిల్లలందరికీ చదువులు పెళ్ళిళ్లు చెయ్యాలి! రోగాలకు మందులు, మాకులు కావాలి! ఆర్థికంగా ఇబ్బందులకు లోనుగావాలి! ఇలా సంసారంలోని సమస్యలన్నిటితో సతమతమౌతూ ఉద్యోగం చెయ్యాల్సిన ఆ మగవాడి పరిస్థితి నిజానికి రాళ్ళుకూడా (ఈ కాలపు రాళ్ళు సాన్ఫొరైజ్డ్ చేసేండి!) కరిగిపోవాల్సిందే! ఇక ఆ తల్లిసంగతి చూద్దాం! ఇంతమంది పిల్లలకి వంటావార్పూ, మొదలైన పనులన్నీ చేసి, సంవత్సరానికో బిడ్డను కంటూ, గృహిణిగా అన్ని ధర్మాలు నిర్వర్తించాలంటే తలకుమించిన పనే అవుతుంది. దాంతో ఆరోగ్యంగా వుండమంటే ఎలా వుంటుంది? పర్మనెంటు పేషెంట్‌గా తయారౌతుంది!

ఆ పిల్లలంటారూ? కుటుంబ పోషణకై వచ్చే ఆదాయంలో ఆడపిల్లలందరికీ చదువులూ, పెళ్లిళ్ళూ అంటే అది అయ్యే పని కాదు. అలా అని పెళ్లిళ్లు మానేసి కేవలం చదువుకుందామనుకున్నా వీలుపడదు. ఉద్యోగం చేసేపాటి చదువు ఆడపిల్లలకి చెప్పించాలంటే, (వెనక ఇంకా మగతా పిల్లలు పెరిగి వస్తున్నారు కాబట్టి) అదీ సాధ్యంకాదు! చివరికి స్త్రీకి కావాల్సిన 'కనీసపు విద్య'కూడా నోచుకోరా అభాగ్యులు! సరే ఎలాగో ఓలా, ఒకడికిచ్చి ముడిపెట్టేస్తారు. ఇంకేముంది? వారి జీవితం కూడా ఓ నరకకూపంగా తయారౌతుంది.

మగపిల్లలూ అంతే. బాగా పెద్ద చదువు చదివించే ఆర్థిక స్తోమతు లేకపోవటంతో, ఏ ట్రెయినింగో చదివి మానేయ్యాల్సొస్తుంది. ఇక ఆ తర్వాత మనం చెప్పక్కరలేదు. వాళ్ల సంసారాలూ ఇలాగే మురికికూపాలుగా తయారయి, వెలుగు అనేది అందని పండయిపోతుంది. కుటుంబ సమస్యలతో చిన్నప్పట్నుంచీ, ఆ పసి హృదయాలు బాగా మొద్దుబారిపోతాయి! ఇలా ఒకటిన్నర, రెండేళ్ళ వ్యత్యాసంతో పుట్టిన ఆ పిల్లలు దేశనాయకులభావ ప్రకారం



రచయిత్రి

ఇక "ఆరోగ్యంగా, పుష్టిగా, ఆనందంగా" వుండమంటే ఎలా వుంటారు?

ఇలా ఆ తల్లిదండ్రులిద్దరూ యమయాతన పడుతుంటారు, శారీరకంగా, మానసికంగా కూడా! ఒకరిద్దరు ఆడపిల్లలకి ఈ కాలంలో వయస్సు 'కాసుక్కూచ్చే' సరికి తల బట్ట కట్టిపోతుంది. "పెద్ద పిల్లలకు జీతం కట్టాలి చిన్నపిల్లలకు బట్టల్లేవు, ఇంట్లో సామాను నిండుకున్నాయి, ఆరోగ్యాలు సరిగాలేవు, మళ్లీ రేపు కాన్పుకు డబ్బెలా?" ఇలాటి సమస్యలతో రాత్రింబగళ్ళు కుస్తీపడుతూ, వాటిని పరిష్కరించలేక, అలా అని వదిలెయ్యలేక అవస్థపడుతుంటారా దంపతులు. పోనుపోను ఈ ఆలోచనతో ఓ విధమైన నిస్పృహ ఏర్పడుతుంది, అదే విరక్తిగా మారిపోతుంది, చివరికి అనేక అనర్థాలకు దారితీస్తుంది.

చివరకు "సంసారం సాగరం దుఃఖం" అంటూ వేదాంతానికి దిగాల్సొస్తుంది! కానీ దానివల్ల ప్రయోజనం శూన్యం!

నిజానికొక్కసారి నింపాదిగా ఆలోచిస్తే ఇన్ని సమస్యలూ ఎందుకొచ్చాయంటే, ఆదాయానికంటే పిల్లలసంఖ్య పెరిగిపోవడం వల్లే! అలా అని ఆదాయానికీ, పిల్లలకీ లంకేమిటి? అంటారేమో. ఉదయం లేచి నిమిష నిమిషమూ డబ్బుతో పనుండే, ప్రపంచంలో ఆదాయం స్వల్పంగా వుండే వారికి పదిమంది పిల్లలుంటే ఆ సంసారం సంగతి వూహించుకోటానికి కూడా అంతుదొరకదు! దానికీ ఓ పరిమితి వుంది! డెబ్భై రూపాయలు సంపాదించే అతనికి, ఆరుగురు పిల్లలుంటే ఆ సంసారం గతేం కావాలి? అలాఅని అసలు పిల్లలొద్దనటం లేదు. కానీ ఆదాయాన్నిబట్టి, ఆరోగ్యాన్నిబట్టి, ఒకరో, ఇద్దరో పిల్లలుమాత్రం వుండేలా ప్రతి దంపతులూ, ఓ పథకం తయారుచేసుకోవాలి. ఈ సంగతి, బామ్మలతో, తాతలతో అంటే, వాళ్ళు పిల్లలేని రాజుల కథలూ, యజ్ఞయాగాలూ, పిల్లలెక్కువమంది (ఓ అరడజనుకు తగ్గకుండా) వుంటే, ఆ ఇంటికి కళ, అదృష్టమూ వస్తుంది వస్తుంది చెబుతారు! ఆ కాలంలో బాగా దేహధార్ఢ్యం, ఆ స్తిపాస్తులూ కలిగివుండేవాళ్లు! అందుకే వాళ్ళకంత కష్టమనిపించేది కాదేమో! కాలం మారింది—దాంతోపాటు మనుషులూ, మనస్తత్వాలూ, శరీరాలూకూడా మారిపోయాయ్! అల్లాగే డబ్బు విలువకూడా మారింది! మానవుడు విజ్ఞానపు అంతస్తులోని ఒక్కొక్క మెట్టే ఎక్కుతున్నాడు! ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించి వేస్తున్నాడు! ఇప్పుడే ఫామిలీ సమస్యలనుకూడా పరిష్కరించటానికి కొన్ని వుపాయాలు కనుక్కున్నారు! ఇంకేం అలాటప్పుడు ఏ సమస్యలూ లేకుండా, జీవనయాత్ర సాఫీగా, సుఖంగా నడుపుకోటానికెందుకు ప్రయత్నించగూడదు? ఆనందంగా సంసారయాత్ర సాగిస్తే అది "...సాగరం దుఃఖం!" ఎందుకవుతుంది? ఆడపిల్లల పెళ్లిళ్లూ, మగవాళ్ల చదువులూ, రోగిష్టివాళ్ల సంఖ్య పెరగడం లాటి సమస్యలెందుకెదురౌతాయ్? వీటన్నిటిని పరిష్కరించటానికో చక్కటి మార్గం వుందిప్పుడు.

అదే ఫామిలీ ప్లానింగ్. ఈమధ్య అన్ని కేంద్రాల్లో, హాస్పిటల్స్‌లో ప్రత్యేకంగా డాక్టర్లను నియమించారు! ఆ డాక్టర్లు సలహాలూ మందులూ ఇస్తున్నారు. వాళ్లలో నమ్మకముంచి, ఆ సలహాలను పాటిస్తే ఏ సమస్యలూ వుండవు. తలకుమించిన సమస్యలతో, చీపురుపుల్లల్లాంటి అనారోగ్యపు పిల్లల్తో, సతమత మవకుండా

(62 వ పేజీ చూడుడు)



బాలలసంఘం సభ్యుడు సి. ఏ. సుభాష్‌చంద్ర ప్రేమకుమార్ వేసిన చిత్రమిది. ప్రేమకుమార్ వయస్సు 12 ఏళ్లు : అనంతపురంజిల్లా ధర్మవరం బోర్డు ఉన్నతపాఠశాలలో నాల్గోఫారం చదువుతున్నాడు.

★ వంటలు ★

ఇడ్డీ : మామూలుగా మనం తినే యిడ్లీలు అంత బలంకలిగించేవి కావు. పైగా అవి రెండు తిన్నామంటే మరి ఆకలే వెయ్యదు. చిన్నపిల్లలకు సాధారణంగా యివి అరగవు కూడాను. ఇప్పుడు నేను చెప్పబోయే యిడ్డీ రెండుతింటే బలంగానూ ఉంటుంది; మధ్యాహ్నానికి బాగా ఆకలి వేస్తుంది. చెయ్యడం అంతా మామూలు యిడ్లీవలెనే కాని, కొద్దిగా మార్పులు ఉన్నయి.

తయారుచేయు విధం : మనకు పరిపడిన్ని మినుములు తీసుకొని బాగుచేసి ఎనిమిది గంటలు నానబెట్టి కడిగి బుట్టలోపవేసి ఉంచితే సుమారు పదమూడు గంటల్లో మొలకలెత్తుతాయి. ఆ మొలకలు వచ్చిన మినుములను రోట్లోవేసి కాటుకవలె రుబ్బాలి. పిండి చేత్తోపట్టుకొని ఊదితే బుడ్లు బుడగవలె ఎగరాలి. అంత మెత్తగా నన్నమాట. ఆ రుబ్బిన పిండిలో దంపుడు బియ్యపు రవ్వగాని, పెద్ద పెద్ద ఫ్యాక్టరీలలో, మరలక్రింద తయారయిన (అంటే ఊకమాత్రం తీసివేసిన) బియ్యం తీసుకొని దానిని రవ్వచేసి మినుములకు నాలుగురెట్లు యీ రవ్వకలిపి కొంచెం సోడా, తగినంత టేబుల్ సాల్టు చేర్చి మామూలు యిడ్డీవలె ఆవిరిలో ఉడికించి, మామూలు యిడ్లీ చట్నీతో చేర్చి తినవచ్చు. ఈ బియ్యాన్ని మళ్ళీ మరలో పట్టించకూడదు. రవ్వవలె రుబ్బుకొన్నా రుబ్బుకోవాలి మరపట్టిస్తే, ఇందులో సారం అంతా ఉళ్ళనే పెపార పోతుంది. లేక, మనమే తిరుగలిలో పోసి విసురుకోవాలి. ఈ పిండిలో, గుప్పెడు సన్నగా పొటువలె తరిగిన కాబేజీగాని, తోటకూరగాని, చేర్చికలిపి యిడ్డీ చేస్తే వడుగు యిస్తవి. వంటికి మంచి బలంకూడాను. బలహీనులకు, యిలాచేసి పెడితే రెండు నెలల్లో సత్తువ చేకూరుతుంది. బలవంతులుగా అవుతారని, అరడజను చొ॥ పెట్టేరనుకుండీ! ఇవి తినడంవల్లనమున మలబద్ధకం దరికిరానీయదు. అందులో కాబేజీవంటివి పడితే దేహానికి భారంకాకుండా తేలిగ్గా జీర్ణమవుతవి. అసలు మరబియ్యం, మరతో తయారయిన, యిడ్డీగాని, ఉప్పుడు రవ్వతో తయారయిన యిడ్డీగాని తిన్నప్పుడు విటమిన్స్ లోపిస్తవి. అందులో ఉప్పుడు రవ్వ యిడ్లీ అయితే విటమిన్స్ ఉండవు. మామూలు రవ్వతో తయారయిన యిడ్లీలో విటమిన్ బి ఉండదు!

కాయకూర అట్లు (దోశలు) : పరిపడిన్ని బియ్యం – పైచెప్పిన బియ్యంవంటివి. అనగా దంపుడు బియ్యంగాని, మరలక్రింద (ఊకతీసిన) బియ్యంగాని నాలుగు గంటలు నానబెట్టి కాటుకవలె రుబ్బాలి. ఆ పిండికి రెండురెట్లు లేతబీరకాయలు గాని, కాబేజీ గాని, నూల్‌కోల్ గాని వేసుకోవాలి. కాబేజీ అయితే సన్నగా తరిగి రుబ్బాలి. బీరకాయ మొదలైనవయితే ఎండుకొబ్బరి కురుముతో కురిమి కాటుకవలె రుబ్బి కొంచెం అల్లం జీలకర్రకూడా చేర్చి, కావలిని ఉల్లిముక్కలు, కొద్దిగా పచ్చి మిర్చిముక్కలు, తగినంత ఉప్పుచేర్చి, పొయ్యిపై పెనంవేసి, ఒక పుల్లకు గుడ్డగాని దూదిగాని చుట్టి, నేతిలో ముంచి పెనంమీదరాసి, పిండిని పలుచగా పోసి, అట్లకాడతో తిరగేసి బాగా కాలిన తరువాత తీసి తినవచ్చును. సన్న సెగమీద యీ దోశ కాల్చవలెను. పెనంపై ఉన్న అట్టుమీద నెయ్యివేస్తే రుచిగా ఉంటుందనుకునేరు. రుచి విషయం అలాఉంచి అలా వెయ్యటంవలన నేతిలోనున్న విటమిన్స్, పోషక పదార్థాలు నశించిపోవడమేగాక దోశకూడా జీర్ణమవడం కష్టం. ఈ దోశలో, బియ్యం పిండికంటె రెండురెట్లు అధికంగా కూర చేరినందువలన దేహానికి కావలసిన లవణములన్నీ లభించడమేగాక, బియ్యంలోని పోషకపదార్థాలన్నీ వ్యర్థం కాకుండా మనకు లభించగలవు.

పెసరట్లు : నల్ల పెసలుగాని, పచ్చ పెసలు గాని తీసుకొని, బాగుచేసి ఎనిమిది గంటలు నాననిచ్చి కడిగి కడవేసి ఆ నానిన పెసలు చల్లనిచోట ఉంచితే పదమూడు గంటల్లో మొలక లెత్తుతాయి. అందులో కొన్ని మొలకలెత్తకపోవచ్చు. అయినా ఫరవాలేదు. ఈ మొలకెత్తిన పెసల్లో రెండురెట్లు లేతబీరగాని, లేతబూడిదగుమ్మడిగాని, సొర తోటకూరగాని, కాబేజీ, క్యారెట్లు మొదలైనవిగాని చేర్చి కాటుకవలె రుబ్బి కొంచెం అల్లం, జీలకర్ర కొద్దిగా ఉల్లి, పచ్చిమిర్చి చెక్క తగినంత ఉప్పుచేర్చి. పైన చెప్పిన విధంగా, అట్లు (దోశ) పోయవలెను. ★

కె. రాజ్యలక్ష్మి (కొవ్వూరు)

వనితా వాణి



‘ఒక్కగా నొక్క పిల్ల’ అనే వ్యాసం వ్రాసిన హేమలతగారికి నా అభినందనలు. ఆమె ఈ వ్యాసాన్ని అతి సహజంగా చిత్రించారు.

యగళ్ళ పద్మావతి (పాలకొండ)

* * *

‘ఒక్కగా నొక్క పిల్ల’ అన్న వ్యాసం చదివాను. చాల బాగుంది. ‘పెట్టేటప్పుడు పెట్టాలి కొట్టేటప్పుడు కొట్టాలి’ అన్న మాదిరిగా గారాబము అంటే మరీ గారాబము పనికిరాదు. ఏ తల్లి తండ్రులకైనా తమ పిల్లలంటే ప్రేమ వుంటుంది. ఒక్క కూతురు కాని, ఒక్క కొడుకు కాని ఉన్న తల్లి తండ్రులు తమ పిల్లల్ని ప్రేమతోను, గారాబముతోను పెంచుతున్నామని అని అనుకొంటారు. కాని అది వారి భావి జీవితంలో మంచికో చెడుకో దారి తీస్తోందని తెలుసుకోరు. కొందరిండ్లలో, తల్లి గారాబముచేస్తే మరి కొందరిండ్లలో తండ్రి గారాబము చేస్తారు. ఇది ముఖ్యంగా తల్లితండ్రులలోనే వుంటుంది. ఏదైనా పిల్లలకి భయముభక్తిశ్రద్ధా వుంటేనే కాని చదువు సంధ్యలు కాని, పని పాటలు కాని అబ్బవు. ఎమ్. హేమలత గారు వ్యాస విషయం బాగా విపులంగా వ్రాశారు. వారికి నా ధన్యవాదాలు వనితా వాణిద్వార తెలుపగోరుతాను.

ఎం. వి. ఎన్. రమాదేవి
(మంచిర్యాల)

* * *

“ఒక్కగా నొక్క పిల్ల” వ్యాసం బాగుంది. కుటుంబంలోని వ్యవహారాలు బాగా వ్రాశారు.

కె. రాజరత్నం
(భిక్కనూరు, నిజాంజిల్లా)

* * *

“ఒక్కగా నొక్కపిల్ల వ్యాసం బాగున్నప్పటికీ అది అపోహలకు దారి కలిగిస్తున్నది. ఆ వ్యాసం చదివినాక మా వాళ్ళందరూ “చూసేవా! మొన్నిదివరకంటే నువ్వు నమ్మే దానివికావు. యిప్పటికేనా తెలిసిందా” అని అంటున్నారు.

నేనూ ఒక్కగా నొక్క పిల్లనే మరి, హేమలతగారి “ఒక్కగానొక్క పిల్ల” వ్యాసం నిజంగా నన్నెంత ఆశ్చర్యపరచిందో చెప్పలేను. వారి ఊహాగానం చాలా బాగుంది కాని, అది నిజంకాదని చెప్పక తప్పదు. వాళ్ళు ఉషగురించి అవబోయేది ఊహించినది సమంజసముగా లేదు. ఉషకి అన్నయ్యేనా ఉన్నాడు. నాకసలు ఎవ్వరూ లేరు. కానీ నేను ఆవిడన్నట్లు పెరగలేదు. కొద్దో గొప్పో ఉన్నవాళ్ళమే అయినా నా చిన్నతనం “ఎనలేని ఫంక్షనలతోను అంతులేని గారాబంతోనూ” గడవలేదు. అందరిలాగా మామూలు బళ్ళోనే చేర్చేరు. పుట్టినరోజు నాడు కొత్తబట్టలు పిండివంటలన్నవి ఒక్కగానొక్క పిల్ల ఉన్నవాళ్ళే కాదు. తొమ్మండుగురు పిల్లలున్న మా పక్కింటావిడ కూడా చేస్తున్నారు మరి. కానీ నా పుట్టినరోజులు ఎప్పుడూ “ఎనలేని ఫంక్షన”తోను జరుగలేదు. అలాగని మా తలిదండ్రులకి సరదాల్లేవు కాబోలనేరు.

ఇక డాన్సు, షోకులు, అన్నవి వారివారి అభిరుచులను బట్టి ఉంటాయి. పదిమంది పిల్లలున్నవాళ్ళు డాన్సు చెప్పించటం, ఒక్కగానొక్క పిల్ల ఉన్నవాళ్ళు మానటం కూడా ఉంటుంది. రచయిత్రిగారు సినిమాల్లో ముద్దులకూతురి పార్టు చూసి రాసినట్టు తోస్తున్నది. కారణం యేమంటే షికార్లకని యిష్టమొచ్చినట్టు తిరగటం. ఏది కావాలంటే అది కొనివ్వటం. అన్నిటికన్నా ముఖ్యం. ఆ పిల్లతండ్రి వెఱ్ఱిబాగులవాడై ఉండటం సినిమాల్లోనే చెల్లింది కానీ నిజ జీవితంలో అసంభవము. నేను యింకా చదువుకుంటున్నాను కాబట్టి తక్కిన విషయ ప్రసక్తి తేను. కానీ మా అమ్మగారు ఎప్పుడూ యిల్లరికం అల్లుడు గురించి మాట్లాడ్డం నేను వినలేదు. నే నేకాదు మాకు తెలిసిన వాళ్ళమ్మాయి ఉంది. ఆవిడ కూడా నాలాగే ఒక్కావిడే. కాని లక్షణంగా బి. ఎస్ సి. ప్యాసయి, పెళ్ళిచేసుకొని భర్తతో హాయిగా అత్తవారింట్లో ఉంది. మరి ఆమె అత్తవారింటికి పోనని మొండికేసి హేమలతగారన్నట్లు పుట్టింటికి వచ్చేయలేదు. ఆవిడ రాసిన ప్రతివిషయం విమర్శించటం నా అభిప్రాయం కాకపోయినా ఆమె రాసినవి సత్యదూరమని చెప్పక తప్పదు. అభిమానమన్నది ఎంతమంది పిల్లలున్న తలిదండ్రులకైనా పిల్లలందరిపైన సమానంగా ఉంటుంది. మొండితనం, షోకులు అన్నవి వారివారి స్వభావాలనుబట్టి, తలిదండ్రుల పెంపకం పైన ఆధారపడి ఉంటవి. కానీ ఒక్క కూతురు గల తలిదండ్రులు మటుకు ఆవిధంగా పెంచుతారనుకోడం పొరపాటు.

“హెచ్చరిక చేయటం నా అభిప్రాయం” అన్నారు రచయిత్రి. బాగుంది. కానీ ఏ ఒక్కరిద్దరినో చూసి అందరూ అలానే ఉంటారని ఊహించి వ్యాసాలు రాయవద్దని సోదరీమణులకు నా మనవి. అందువల్ల అనేక నష్టాలున్నవి. ఈ వ్యాసంవలన ఒక్కగా నొక్క పిల్లలంతా అలాగే ఉంటారన్న భావన కలిగించేరు. కానీ మెజారిటీ లేదని ధైర్యంగా చెప్పవచ్చును. అయితే “అ ఉన్న కొద్దివారి గురించే నేను వ్రాసేను” అంటే తిరుగులేదు.

ఎం. వి. ఎస్. రత్నకుమారి
(హైదరాబాదు)

* * *

భాస్కరమ్మగారు వ్రాసిన “పాతకాలపు పాటలలోని హాస్యం” బాగుంది. ఆవిడ అన్నట్లు ఆ హాస్యాన్ని ఈనాడు అర్థం చేసుకునేది ఎవరు? పాతపాటలు, నిజానికి దగ్గరగా ఉంటే, పగా, కోపాలు కూడాను. సరదాగా పాటపాడితే అన్నాలు వదిలిపెట్టి పోతారు. ఈరోజుల్లో (భావను కానివి) పిల్లని వదిలిపెట్టి పోడానికికూడా జంకరు. మొన్న ఒకసారి పెళ్ళిలో.

“దొడ్డికాళ్ళూ మూతనడిమూరెడుంటు, ఎడ్డితనము చాలా నీ మడిమేను చూడ; వదినా చాలు పోవే, వైఖరీ దెలసేను” అనే పాట పాడితే వియ్యపురాలికి కోపంవచ్చి, విడిదికి వెళ్ళిపోయింది. ఆవిణ్ణి సరిదీసి, తీసి కొనిరాలేక విసిగి, వియ్యంకుడు “పాటలూ, పద్యాలూ లేకపోతే పెళ్ళి అవదా? ఎందుకొచ్చిన రభస; నోరుమూసుకొని ఈ రెండు రోజులు మర్యాద దక్కించండని” కేకలేశారు. ఇలాటి ఉడుకుమోతు కాలంలో సరదాలకీ హాస్యానికీ పెళ్ళిళ్ళలో తావెక్కడ?

సీత (పెద్దాపురం.)

★

★ టెన్నిస్ టూర్నమెంటు ★

(34-వ పేజీ తరువాయి)

"ఇంకా టెన్నిస్ ఆడుతూ కూర్చోడానికి నేనేం చిన్నపిల్లని కాదు."

"అయితే మేమంతా చిన్న పిల్లలమంటావా?"

"నీ సంగతి వేరు, నువ్వింకా బ్రహ్మచారివి."

"దానికీ టెన్నిస్‌కీ సంబంధం ఏమిటి?"

పెళ్ళయిన తరువాత కూడా దేశదిమ్మరిలా టెన్నిస్ టూర్నమెంట చుట్టూ తిరుగుతానంటావా యేం? పెళ్ళాం కావాలో, టెన్నిస్ కావాలో నిర్ణయం చేసుకుని మరీ పెళ్ళాడు" నవ్వింది.

"నవ్వులకేం గాని, కమలా, నువ్వు తప్పకుండా నాతో ఈ టూర్నమెంటులో ఆడాలి."

"అది మాత్రం అడక్కు. నేను రేకెట్ ముట్టుకుని మూడేళ్ళయినయింది."

"అయితే మళ్ళీ మొదలుపెట్టు."

"మా ఇద్దరికీ సరిపడా తను ఆడుతున్నాడుగా, చాలు."

మళ్ళీ నవ్వింది కమల.

* * *

రాత్రి భోజనాల ముందు డ్రాయింగ్ రూమ్‌లో కూచుని గిరీ నేనూ పాత ముచ్చట్లు నెమరు వేసుకుంటున్నాం. కమల కొంచెం దూరంలో వరండాలో కూర్చుని ఏదో అల్లుకుంటూంది.

"నువ్వింకా ఇంత బాగా ఆడుతున్నావనుకోలేదు" అన్నాను గిరితో. గిరి మొహం సంతోషంతో వికసించింది.

"మునుపటికంటే బాగా ఆడుతున్నాను కదూ?" అన్నాడు.

నిజానికి నాకలా అనిపించలేదు. ఈ ఆరేళ్ళల్లోనూ అతని ఆట బాగా దెబ్బతిని ఉంటుందనుకున్నాను. కాని ఆ సాయంత్రం చూసిందాన్నిబట్టి అనుకున్నంత దిగజారిపోలేదనిపించింది. అంతే. అయినా, నిజం చెప్పి అతన్ని నొప్పించడం ఎందుకని "ఔను" అన్నాను. దానితో అతని ఉత్సాహం ఎక్కువయింది.

"ఆ ఊటీ టూర్నమెంటులో మానెయ్యకుండా ఉంటే ఈపాటికి ఇండియన్ రేంకింగ్‌లో ఉందును. ఏమంటావ్?" అన్నాడు.

"లేనందుకు విచారించవలసిన పనిలేదు. అదృష్టవంతుడివి, మంచి భార్యనీ, ఉద్యోగాన్నీ కూర్చిపెట్టుకున్నావ్."

"అందరూ అదృష్టవంతుణ్ణనే వాళ్ళేకాని నా టెన్నిస్ ధ్వంసం అయిపోయినందుకు విచారం చేసేవాళ్ళెవరూ కనిపించరు."

"నామట్టుకి టెన్నిస్ కంటే ఉద్యోగమే ముఖ్యం అనిపిస్తుంది. రేంకింగ్ మూన్నాళ్ళముచ్చటా, ఉద్యోగం సంసారం బతికున్నన్నాళ్ళూ అంటిపెట్టుకుని ఉంటేవిను."

"నేనొప్పుకోను. టూర్నమెంటు టెన్నిస్ నాకిచ్చే ఆనందం ఇంకేదీ ఇవ్వలేదు. అంతకంటే జీవితంలో కోరగలిగిందేముంటుంది? నిజానికి గతిలేక నేనీ ఉద్యోగం చేస్తున్నాను."

"ఉద్యోగంలో స్థిరంగా కూర్చుని ఉన్నావు కాబట్టి అలా మాట్లాడుతున్నావు."

"కాదు, నిజం చెప్తున్నాను నేనంత తొందరగా పెళ్ళిచేసుకుని ఉండకపోతే ఏ గొడవా ఉండేదికాదు. ఉద్యోగంలో వెంటనే ప్రవేశించవలసిన అగత్యం ఉండకపోను. ఇంకా టెన్నిస్ ఆడిఉందును."

కమలకి వినిపించే అంతదూరంలో ఈ చర్చ సాగించడం నాకు నచ్చలేదు. బయట చల్లగాలి నాకు చెప్పి అక్కడినుంచి లేచిపోయాను.

ఫైనల్సునాడు రాత్రి ఆటగాళ్ళకి మెంబర్లకీ క్లబ్బు డిన్నర్ ఏర్పాటు చేసింది. నేనెంతో పట్టుబట్టితే కాని కమల రావడానికి ఒప్పుకోలేదు. మేం వెళ్ళేసరికి క్లబ్బు కోలాహలంగా ఉంది. ఇద్దరుముగ్గురు జట్లుగా జనం విడిపోయి అరుచుకుంటూ, నవ్వుకుంటూ ఆనందిస్తున్నారు. సెక్రటరీ చేతిలో డ్రింక్ పట్టుకొని అందరినీ నిశ్శబ్దంగా ఉండమని హెచ్చరించాడు. "ఈ డ్రింక్ టూర్నమెంటులో గెలిచిన వ్యక్తుల ఆరోగ్యానికి," అని "టోస్ట్" చెప్పాడు. అంతా చప్పట్లు చరిచారు. కొందరు గెలిచిన వ్యక్తుల ఆట గురించి వివరంగా మాట్లాడారు. తరువాత ఒకవ్యక్తి లేచి గిరికి "టోస్ట్" చెప్పాడు. "ఇది ఇటువంటి టూర్నమెంటు ఎన్నో గెలవగల సామర్థ్యంగల వ్యక్తి ఆరోగ్యానికి" అని అరిచాడు. క్లబ్బంతా చప్పట్లతో మారుమోగిపోయింది. ఇంకొకవ్యక్తి లేచి గిరి ఆటని ప్రశంసించాడు.

"ఈయన కూడా పేరుపొందిన ఆటగాళ్ళలాగా దేశంఅంతటా తిరిగి ఆడితే నేషనల్ ఛాంపియన్‌షిప్పు గెలవడానికి సందేహం లేదు."

హాల్లో గొంతుకలు "హియర్, హియర్" అన్నాయి. ఇంకొకవ్యక్తి లేచాడు. ఇంతలోకే కమలవచ్చి తన్ని ఇంటికి తీసుకువెళ్ళమని అడిగింది.

"తలనొప్పిగా ఉంది" అంది.

"గిరితో చెప్పివస్తాను" అన్నాను.

"తను గొడవలో ఉన్నాడు, ఎందుకు కదపడం, తాళాలు కారుకిఉంటాయి పద" అంది.

కారు కొంతదూరం వెళ్ళాక కమల అడిగింది.

"నిన్నొకటడుగుతాను, నిజం చెప్తావా?"

"తెలిస్తే తప్పకుండా చెప్తాను."

"గిరి టెన్నిస్ గురించిన ఆ మాటలన్నీ నిజమేనా?"

నాకేం చెప్పాలో తెలియలేదు.

"ఇక్కడి వాళ్ళందరికీ అతని ఆటంటే చాలా అభిమానం ఉన్నట్టుంది." అన్నాను.

"నీ ఉద్దేశం ఏమిటి? నువ్వు దీనిలో ప్రవేశం ఉన్నవాడివి."

"నువ్వేమీ అనుకోవుగదా?"

టెన్నిస్ టూర్నమెంటు

"అనుకోను."

"అయితే విను. గిరిని గెలవగలవాళ్ళు ఇండియాలో ఊరి ఊరికీ ఉంటారు."

"ఇక్కడ ఎవరూ లేరు."

"ముక్కకి ముక్కా అర్థం తియ్యకు కమలా. నేననేది ప్రస్తుతం అతని ఆట టూర్నమెంట్లు గెలవడానికి చాలదు."

"ఉద్యోగంవల్ల తనకి ఆడడానికి ఎక్కువ టైముండదు."

"ఔను."

"టైముండి ఆడగలిగితే ర్యాంకింగ్ లోకి రాగలడంటావా?"

"మధ్యలో మానెయ్యకుండా ఉంటే ఎంతవరకూ వచ్చేవాడో చెప్పలేను కాని ఇప్పుడెంత తంటాలుపడ్డా ప్రయోజనం లేదు."

"ఏం చేత"?

"గిరికి ఇప్పుడు ఇరవై ఎనిమిదేళ్ళు, ఔనా?".

"ఔను."

"అంటే టెన్నిస్ ఛాంపియను రిటైరయ్యే వయసు."

"ఊహు"

"రెండవది, పెళ్ళికి ఇప్పటికీ ఇరవై పౌన బరువైనా ఎక్కువయ్యాడంటావా?"

"ఏమో."

"పోనీ, యూనివర్సిటీలో ఆడే కాలంలో కూడా అతను ఏమంత పెద్ద ఆటగాడు కాదు. కృషి మంచి ఫలితాలు ఇచ్చి ఉండేదేమో కాని అతను చెయ్యలేదు. ఆ కొద్ది ఆటా కూడా ఇప్పుడు మర్చిపోయాడు. ఇక్కడ క్లబ్బులో నలుగురిని గెలిచి ఇండియా అంతా గెలవగలననుకుంటున్నాడు."

"ఈ ఉద్యోగం దొరకలేకపోతే ఇప్పటికైనా డేవిస్ కప్పుకి ఆడగలనని తన ధైర్యం".

"ఇంకా గిరికి టెన్నిస్ మీద మమకారం తగ్గలేదు. పాతకలలు మర్చిపోలేకుండా ఉన్నాడు."

"అంతే అంటావా?"

"అంతే ఇవన్నీ తీరని కోరికలు, కమలా"

ఇంటికి వెళ్ళేవరకూ మేమింకేమీ మాట్లాడుకోలేదు.

* * *

తరువాత నాలుగు నెలలకి మద్రాసు కెళ్ళ వలసి వచ్చింది. మౌంట్ రోడ్ లో గిరి తటస్థ పడాడు.

"నువ్వెప్పుడొచ్చావ్" అన్నాను.

"ఇప్పుడిక్కడే ఉంటున్నాను. మా రేంకెడ్ ప్లేయర్స్ పని పడతాను లే." అన్నాడు గిరి. నాకేమీ అర్థం కాలేదు.

"ఉద్యోగం వదిలేశాను" అన్నాడు మళ్ళీ.

"అంతమంచి ఉద్యోగమా?"

నా ఆశ్చర్యాన్ని వెలిబుచ్చకుండా ఉండలేకపోయాను.

"అసలుకథ చెపాను పద"

ఇద్దరం పక్కనున్న టీసెంటరుకి నడిచాం. కూర్చుని రెండుకోల్డ్ టీ తెమ్మనిచెప్పి గిరి మొదలుపెట్టాడు.

"ఇదంతా కమలపని. కరూర్ టూర్నమెంటు తన్ని బాగా కదిపినట్లుంది. ఆడిన్నర్ రాత్రి నా ఆటపరించి స్నేహితులు పొగ్డారు. జ్ఞాపకం ఉందా?"

"ఉంది" అన్నాను.

"అప్పటినుంచీ నాఆట వృధా పోనివ్వకూడదని ఒక జేపటు. మద్రాసులో వ్యాపారం పెట్టి, టెన్నిస్ ఆడమని తన ఉద్దేశం"

"డబ్బు?"

"తండ్రి ఉన్నాడుగా!"

"తండ్రి డబ్బుతో వ్యాపారం పెట్టమందా కమల?" నా చెవులు నేనే నమ్మలేకపోయాను.

"ఆశ్చర్యంగా లేదూ. ఆయన సొమ్ము దమ్మిడీఅయినా ముట్టనన్నది. ఇప్పుడు తనే వెళ్ళి డబ్బు అడిగింది."

"అకస్మాత్తుగా ఎందుకు మనసు మార్చుకుంది?"

"నా టెన్నిస్‌కోసం. నేనే వింబిలన్ ఛాంపియన్ అవుతాననుకొంటుంది."

సంతృప్తిగా నవ్వాడుగిరి.

కమల అలా అనుకోడంలేదనీ తనకి పోటీగా గిరిని ఆకర్షిస్తూవచ్చిన టెన్నిస్‌లో అతని అసమర్థత నిరూపించడంకోసం కరడుగటిన ద్వేషాన్ని సహితం మర్చిపోయి తండ్రిపంచ జేరిందనీ నేను గ్రహించాను. కాని నా స్నేహితుడికి చెప్పడానికి నోరు రాలేదు. ★

కన్నీరు

(10-వ పేజీ తరువాయి)

యించగలడు. కాని, అక్కడ జరిగే తంతును తను భరించలేడే! ఎవరిలో చూసినా, సంస్కారహీనతే కనిపిస్తుందే! ఇంతకుముందు తన్ను సినిమాలకు వ్రాయమని అడిగిన వాళ్ళను కలుసుకొని పనిచేస్తానని చెప్పాడు బాబు; కాని, వాళ్లు జ్యోతి విషయంలో అవినీతి చూపబోయేసరికి లేచి వచ్చేయ్యడం జరిగింది. అప్పటినుంచీ ఎందరికి విరోధి అయినాడో, ఎన్ని విషమ పరిస్థితులలో చిక్కుపడి పోయాడో అతనికే తెలియాలి. ఒకసారి సినిమాలకు వ్రాసి వ్రాసికొస్త పెద్దపేరు గడించుకున్న ఒక కవిరాయుడు బాబుకు తటస్థమయ్యాడు. బాబు కవితా కౌశల్యానికి అతని కన్ను కుటింది. తనతో కలిసి ప్రస్తుతం పనిచెయ్యమని కోరాడు. బాబు సమ్మతించాడు. మరుసటి రోజే ఆ కవికీ బాబుకూ చెడిపోయింది!

"ఏమండీ? మీరు అక్కడే వున్నారుగదా? ఆ యింటి కెందరో వొచ్చి పోతూంటారు. ఆ అమ్మాయితో నన్ను గురించి కాస్త..." అని అసహ్యంగా నవ్వుతూన్న అతన్ని మొహం వాచేట్టు పెట్టి బైటికి నడిచాడుబాబు. ఎన్ని రకాల మనుషులనో చూశాడు అందరూ బైట తెల్లగా లోపల నల్లగా కనిపించారు అతనికి!

మీరాబాయిని మించిన భక్తురాలికి, సీతమ్మతో సాటి అనిపించే శీలవతికి, ప్రపంచమిచ్చే గౌరవం ఇదా? ఏ అర్థరాత్రో కాల భైరవుడై పాపాత్ములందర్నీ భస్మం చెయ్యాలని ఆలోచిస్తాడు, పిచ్చిబాబు! ఇక డబ్బు సంపాదించలేదు. ఇంటో వాళ్ళను సంతృప్తి పరచలేదు. తన జ్యోతిని జాగ్రత్తగా కాపాడుకోలేదు... ఈ దిగులుతో బాబు దినదినానికీ క్షీణుడు కావడం గ్రహించింది జ్యోతి. తన జీవితంతో ఇంతగా బంధం పెట్టుకోకుండా, ఇంటికి వెళ్ళి సుఖంగా వుండమంది ఒక రోజు బాబును. 'నిన్ను విడిచి ఎలా బ్రతకమంటావు? నువ్వు లేకుంటే నాచుట్టూ చీకటి కమ్ముకుంటుంది. ఏమైనా అనుగాని నన్ను విడిచివెళ్ళు అనొద్దమ్మా' అన్నాడు బాబు జ్యోతి పాదాలను కన్నీళ్ళతో కడుగుతూ. ఆమె మాత్రం ఏం చేస్తుంది?

"ఈపవిత్రతకూ- ఈ ప్రపంచానికీ పడదు. మీఇద్దరిలో కానికి తగరు. తండ్రీ కొడుకునూ, తల్లీ కూతుర్నీ, అర్థం చెసుకోలేని ఈ లోకంలో ఇరవై యేళ్ళ యౌవనంలో వున్న మీ ఇద్దరిలో మాతాపుత్రభావం నిలిచిందంటే నమ్మతారా నవ్వుతారు? గాని" అని ఒక స్నేహితురాలు చెప్పిన మాట బాబు జీవితంలో శాశ్వతంగా నిజమైపోయింది. అమరుసటిరోజు-అజ్ఞానంతో మాలిన్యాన్ని కక్కుతూన్న గొంతుకలు రహస్యంగా మాట్లాడుకోవడం మళ్ళీ బాబు చెవులపడింది. అలా వినడం అనుచితమైనా తన పేరు రావడంతో విని తీరాలనుకున్నాడు.

"ఇదేందో ప్రేమంటమ్మా! లోకంలో ఎక్కడా లేని ప్రేమ! ఆకాశ్ళ పట్టుకుంటాడో, ఇంకా ఎక్కడెక్కడ పట్టుకుంటాడో-అతి స్నేమైనా అంటే ఆయమ్మ వారు అగ్గయిపోతుంది" అని ఒక గొంతు గొణిగితే,

"అంతగా ఇది వుంటే, యెందుకూ పనికిరాని వానితో యెందుకూ! కావాలనుకుంటే చీకటిపడేసరికి కో అంటే కోటి మంది సుమ్ముంముందు వాలరూ? మీకీ దరిద్రమూ వుండను' అని ఇంకో గొంతు విపులంగా వ్యాఖ్యానించింది.


కళ్ళారా చూస్తూ, ఒక పవిత్రమూర్తిపై నిష్కారణ నిందల్ని రుద్దుతూన్న వాళ్ళను చిత్రవధ చెద్దామన్నంత కోపమొచ్చింది బాబుకు. ఇంతేనా? లోకంలో నీతికచోటే లేదా? ఈ పాపిష్టి ఊహలు ప్రసరించేందుకు తావులే లేవా?... కారిపోని కన్నీళ్ళను జాలిగా వోదారుస్తూ, తన తలి పాదాలపై శాశ్వతంగా కాంతి కొగిలిపరిచి, పశ్చాత్తాపముని పూజాగదిలోకి కెళ్లాడు. దేవి విగ్రహం ముందు సాష్టాంగంగా మోకరిలిన తనతల్లిని, తన జీవనజ్యోతిని జ్యోతిని చూడగానే అతని బాధంతా బైటకుబికింది. నిల్చున్నవాడు నిల్చున్నట్లే, ఆమె కాళ్ళమీద వ్రాలిపోయాడు. కాలివేళ్ళ సందులో చిన్న కాగితం ముక్క! తీసి చదివాడు......

"బాబూ! యీ లోకానికి మనం తగం నాయనా! నువ్వేం విన్నావో నేనూ అదే విన్నా. అందుకే అందర్నీ విడిచి, నిన్ను యేడిపించి, వెళ్లుతున్నాను. ఇష్టముంటే నువ్వూ రా'...

ఆ జాబు చదివి బాబు ఏడవలేదు. అతని మనస్సంతృప్తిగా శ్వాసవిడిచింది. ఆమె పాదాలను మళ్ళీ మళ్ళీ కళ్ళకద్దుకున్నాడు. ఇంతలో ఇంటెల్లిపాదీ వొచ్చి దేవతల గడినంతటినీ రాగాలాపనలతో నింపేస్తున్నారు. విషపు మరకలంటుకున్న వెండి కుంకుమభరిణ తన్ను ప్రబోధిస్తూ జ్యోతి చేతిలో ఇంకా మెరుస్తూనే వుంది! విషాదం వెనక్కి పారిపోతూంటే, ధైర్యం ముందు నడుస్తూ దారిచూపిస్తూంటే, జ్యోతిలేని ఆ చీకటిగృహాన్ని విడిచిపెట్టి బైటికొచ్చాడు.

* * *

బైటంతా అతనికి జ్యోతిస్వరూపమే కనిపిస్తూంది. నేను మీకీ కథ చెప్తూ అతన్ని మర్చిపోయ్యానే. అయ్యో! ఏడీ? ఎక్కడా! అదుగో...సముద్రతీరంలో నిర్వికారంగా నడుస్తున్నాడు. 'బాబూ!'... అవును. నాపిలుపు వినబడదు అతనికి. ఆకాశంనుండి అతని తల్లి 'బాబీ!' అని పిలుస్తోంది. ఆ పిలుపు తప్ప యింకేమీ వినపడదు, అతని చెవులకు. ఆచదువు, ఆ జ్ఞానం, ఆ ప్రేమ, అన్నీ అతని 'అమ్మ'కోసమే వెళుతున్నాయి. ★



నేటి నటులు: రమణారెడ్డి



కష్టపడి డబ్బు గడించి ఉన్నదాంతో కటాకటిగా కారుకొనుక్కున్నవాడికి, దాని పోషణ, సంరక్షణాదికాలు (మోటారు 'కారు'భాషలలో మెయింటెనెన్స్ అంటారు) పెద్దసమస్య. వాటికితగ్గ డబ్బు లేకపోతే కారు తోలగాపోదు.

పేరుకూడా అంతే. ముఖ్యంగా సృజనాత్మక ప్రతిభ ముఖ్యమైన లలితకళాకారులలో- లక్షలాది ప్రజలను కోటిరుచులతో పోటాపోటీగా ఉత్సాహపరచవలసిన సినిమాలో- పేరు గడించడం ఎంత కష్టమో దాన్ని పోషించి నిలబెట్టుకోవడం అంతకి పదింతలు కష్టం. అయితే కళా, వ్యాపారం కలసిన సినిమాలాటి మిశ్రమపరిశ్రమలో బాగా పేరుతెచ్చుకొన్న తారలకు ప్రతిభను ప్రదర్శించే అవకాశాలను క్రమంగా తగ్గించివేసాయి పరిస్థితులు. ఒకస్థితిలో వాటిని నిభాయించుకోవడమే ఆయావ్యక్తుల ప్రతిభకు నిదర్శనం అవుతుంది. నటుడు తనపేరు నిలబెట్టుకోడానికి పెట్టుబడి అతనిదగ్గర ఉండదు. కారణం అతను ఒక్కొక్క చిత్రంలో ధరించవలసివచ్చేపాత్రలను నిర్మాతలూ దర్శకుడూ, రచయితా, 'ఇటీవలే హిట్ అయినపాత్ర' స్వభావం కలసి తయారుచేస్తాయి. అలా వచ్చేపాత్రలను కాదనడానికి వీలుండదు. అలాటివే ఎక్కువరావడం పరిపాటి కాబట్టి, ప్రాణాలులేని, తలాతోకాలేని, కన్నూముక్కూలేని అర్భకభూమికలు ఏదికపాలో తటస్థపడితే నటుడు తన ప్రతిభతో వాటిని నిలబెట్టె ప్రాణాలు ప్రతిష్ఠించి రూపురేఖలు దిద్దవచ్చు. అప్పుడుకొన్నిలోపాలున్నా ప్రేక్షకులుపాత్ర మంచిదికాదనికొంత సహిస్తారు. కాని తరచుగా మూసపోసిన వేషాలతో కొండగుర్తు డైలాగులతో ముక్కుని అదేపనిగా వచ్చేస్తే ప్రేక్షకుడి సహనం కూడా క్రమంగాచిక్కి సగమై శల్యమై జారిపోతుంది. నిరుత్సాహం పెరిగి నిస్పృహలోకి దిగుతుంది. చలన చిత్రాలలో హీరో హీరోయిన్ల ధోరణి ఇప్పుడప్పుడే మారదు అని స్థిరపడినందువల్ల వారికి కొంత మినహా

యింపు లభించినా ఆతరువాత శ్రేణిలో నటులమీద, పాత్రలమీద ఇంకా ఆశలు పోలేదు. రేలంగి, రమణారెడ్డి గుమ్మడి అని ప్రకటనలో పేర్లుచూసిన ప్రేక్షకుడు చాలాఆశలు పెట్టుకుంటాడు.

* * *

వర్తమాన చలనచిత్ర హాస్యనటులలో 'వర్ధమానుడు' అనిపించుకునే స్థాయిదాటి ఎన్నతగ్గ స్థానాన్ని ఆక్రమించుకొన్న రమణారెడ్డి నటనకి పుట్టినిలు "పుటిలు" కాదు.

మాటలతోను చేతలతోనూ, ఆరెండూ లేకుండానూ కూడా ఎలా పెడితే అలా అవళంగా జనాన్ని నవ్వించి సంతోష పెట్టగల ప్రజ్ఞ అతనికి చిన్నప్పటినుండి ఉంది; చాలాగటివాడు అన్న పేరు, అతను 'ఫక్ డాకర్ చంద్రశేఖరం' ట్రూపులో చేరి ప్రదర్శనాలు ఇచ్చినప్పటి నుండీ ఉంది. తెలుగుపలుకు పలుకుబడిలో సాగనూ స్వారస్యం గ్రహించి ఉదాత్తానుదాత్త స్వరాల స్థానాలు తెలిసి వచ్చాయి నొక్కు నొక్కుల నవ్వులలో పోకు గురించి ఏ అతురాన్ని ఎక్కడ విరవాలో ఎరిగి, "డైలాగ్ డెలివరీ చాలా గ్రాండ్ గా ఉంటుందని" ఈనాడు సినీ నిపుణులచేత అనిపించుకుంటున్న రమణారెడ్డికి ఈ ప్రజ్ఞలు చాలకాలంగా ఉన్నాయని ఆంధ్రదేశంలో చాలమందికి తెలుసు. ఐతే ఈ ప్రజ్ఞలు సినిమాలో చేరడానికి మటుకే ఉపయోగపడాయనీ, చేరాక వీటిని ప్రదర్శించే అవకాశం ఉండటం లేదనీ ఆనాటి ప్రదర్శనాలూ ఈనాటి చిత్రాలూ చూసిన వాని భావం. ప్రత్యేక హాస్యచిత్రాలు మనకి లేకపోవడం ఇందుకు ఒక కారణం కావచ్చు. అయితే, వాటన్నిటికీ ప్రాతిపదిక ఆయన సహజ ప్రజ్ఞకూడా పూర్తిగా ప్రదర్శించే అవకాశాలు అరుదవుతూండడానికి మటుకు అసమగ్రమైన. అర్భకమైన పాత్రలు కారణం. ఒక్కొక్క చిత్రంలో ఒకొక్కమెట్టు పైకెక్కుతున్న రమణారెడ్డి ఇటీవలి సాంఘిక చిత్రాలు మాంగల్యబలం, పెళ్ళినాటి ప్రమాణాలు అప్పుచేసి పప్పుకూడు అత్తా ఒకింటికోడలే వంటి వాటిలో నటనకు విశేషప్రశంసలు అందుకున్నాడు; అందు కర్హుడని నిరూపించుకున్నాడు.


అయితే నేటివరకు ఈయన నటించిన పాత్రలన్నీ గుర్తెచ్చుకుంటే స్థూలంగా వేళ్లమీద లెక్కించ తగినన్ని రకాలే వాటిలో కనిపిస్తాయి. మరి ఇవన్నీ విడిగా ఎందుకంత అద్భుతంగా కనిపించాయి?

రమణారెడ్డి ఐంద్రజాలికుడు. ఆయనకి నిజంగానే ఆ విద్యవచ్చు. చాలా పట్టణాలలో ప్రదర్శనలు కూడా ఇస్తున్నాడు. ఆవిద్యనే నేటి సినిమాలో వేషాలకు కూడా ఆయన ప్రయోగించి ఎప్పటికప్పుడు తను ధరించే పాత్రకన్న ఎత్తుగా నిలచి, దాన్ని కలకలలాడించగలుగుతున్నాడు అనిపిస్తుంది. అయితే ఇంద్రజాలంలో ఏ తమాషాగాని రెండోసారి చెయ్యరు. ఇది నటనలో ఇంద్రజాలం గాబట్టి ప్రతిభగలది కాబట్టి రెండు కన్నా ఎక్కువసారు బాగుండవచ్చు. కాని చాలాసారు బాగుండదు. పురాణ పురుషుల పాత్రలు ధరించడం కూడా బాగుండదు. అలాచేసే కొన్నాళ్ళకి 'ట్రాజిడీకింగ్' అనే బిరుదు కూడా వస్తుందని ఒక ప్రేక్షకుడు కోపావేశంలో అన్నాడు.



'సతీసుకన్య' చిత్రంలో కృష్ణకుమారి.

అంగుళం కొలకి హంగులలాగే, పేరు 'మెయింటెనెన్స్'కి మంచి పాత్రలు చాలా ముఖ్యం. వ్యాపారలక్షణసమ్మిశ్రమైన ఈ వర్తమాన కళాప్రపంచంలో మంచి పాత్రను బాగా నటించడమే కాక, రూపురేఖలూ, ప్రాణం లేని పాత్రలు తిరస్కరించడం కూడా కళాకారుల ప్రతిభలో ఒకభాగం. కళాకారులూ వారిని బాక్సాఫీస్ సూత్రంగా వాడుకోదలచుకున్న నిర్మాతలు కూడా ఈ అంశాలగురించి ఆలోచించ ప్రయత్నించడం శ్రేయస్కరం. ★



ఎస్. వి. రంగారావు, కృష్ణకుమారి ఇటీవల రాజమహేంద్రవరం వెళ్లినపుడు అక్కడి పత్రికా రచయితలు, పౌరులు స్టేషన్‌లో స్వాగతమిచ్చారు.

సన్మానాలు

ప్రసిద్ధ చలనచిత్ర నటులు ఎస్. వి. రంగారావు, టి. కృష్ణకుమారిలను గోదావరిజిల్లా ప్రజలు ఇటీవల పిలిపించుకుని సన్మానాలు చేశారు. కొప్పరపు సుబ్బారావు స్మారక పరిషత్తు సందర్భంగా కొల్లప్రోలులో జనవరి 18న ఈ సన్మానాలు జరిగాయి. కాకినాడ పురపాలక సంఘాధ్యక్షుడు శ్రీ దంటు భాస్కరరావు శ్రీ చాగంటి సన్యాసిరాజు, శ్రీ కె. కామేశ్వర శర్మ మొదలగువారు, ఈ నటుల ప్రతిభను ప్రశంసించి, ఈ సీమలో పుట్టి పెరిగిన ఈ యిద్దరూ (రంగారావు స్వగ్రామం ధవళేశ్వరం, కృష్ణకుమారిది రాజమండ్రి) ఉన్నత స్థాయికి రావడం గోదావరీ తీరవాసులకు గర్వకారణమన్నారు. పరిషత్తువారు, నటులకు ప్రశంసా సూచకంగా రజతఫలకాలు ఇచ్చి గౌరవించారు.

ఆరోజు రాత్రి రాజమహేంద్రవరం విక్రమహాలులో కృష్ణకుమారికి సన్మానం జరిగింది. చలనచిత్రాభిమానుల సంఘ కార్యదర్శి శ్రీ దంటు కృష్ణమూర్తి, ఎ. వెంకటేశ్వర్లూ మాట్లాడారు.

* * *

ఎ. వి. ఎం. వారి కొత్త హిందిచిత్రం 'బాప్ బేటీ' ఫిబ్రవరి 6న విడుదల అవుతోంది. అశోక్ కుమార్, శ్యామ, చిత్ర, జగ్‌దీప్ లలితా పవార్, బాబురావ్ పెండార్కర్ పాల్గొన్నారు.

రచయిత రాజేంద్ర కిషన్. సంగీతం మదనమోహన్. దర్శకుడు రాజా పరంజపే.

సిప్పి ఫిలింస్ వారు దేశవాళి సినిమాకథల చట్రంలోంచి బయటపడి దేశదేశాల గాలి పీలుస్తు విహరించే కథతో 'పైలట్' అనే చిత్రం తీస్తున్నారు, కథ, చలనచిత్ర కథ,

సినిమా వార్తలు

వరలక్ష్మి పిక్చర్స్‌వారి జానపద చిత్రం 'వీరభాస్కరుడు' నిర్మాణం పూర్తి కావచ్చింది. మార్చి రెండోవారంలో విడుదల కాగలదని తెలుస్తోంది. కె. బి. నాగభూషణంగారి దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో మధుర స్వరలక్ష్మి ఎస్వరలక్ష్మి, కన్నాంబ, సూర్యకళ, సూర్యకాంతం, శలంగి, రాజనాల, బాలకృష్ణ, కె. వి. ఎస్. శర్మ, ఎ. వి. సుబ్బారావు, మిక్కిలినేని, పేకేటి, ఉదయకుమార్ మొదలగువారు పాల్గొంటున్నారు. మాటలూ పాటలూ సముద్రాల జూనియర్ వ్రాశారు.


గొల్లభామ. మదాలస, రాజీ నా ప్రాణం చిత్రాలకు సంగీతం సమకూర్చిన సాలూరి హనుమంతరావు (రాజేశ్వరరావు సోదరుడు) దీనికి సంగీత దర్శకత్వం నిర్వహిస్తున్నారు. నిర్మాత కడారు వెంకటేశ్వరరావు.

దీపావళి

అశ్వరాజ్ ప్రొడక్షన్స్‌వారి "దీపావళి" ఐదురీళ్లు తయారైంది. ఎన్. టి. రామారావు. ఎస్. వరలక్ష్మి, రంగారావు, గుమ్మడి, కాంతారావు, రమణారెడ్డి. మొదలగువారు నటిస్తున్నారు. రచయిత సముద్రాల. సంగీతం ఘంటసాల. దర్శకత్వం రజనీకాంత్.

ఇంద్రజిత్

రజనీకాంత్ స్వయంగా చంద్రికా ఫిలింస్ పేరిట తీస్తున్న చిత్రం 'ఇంద్రజిత్' మూడురీళ్లు పూర్తి అయింది. జగ్గయ్య, ఎస్. వరలక్ష్మి ముఖ్యపాత్రలు నిర్వహిస్తున్నారు. రచయిత సముద్రాల. సంగీత దర్శకుడు అశ్వత్థామ.



కొత్తగాయకులను పరిచయం చేయడానికి జరిగిన పోటీలో ఎన్నిక అయి విశ్వరూపా వారి 'మాతుర కాపురం' చిత్రంలో తొలిపాట పాడుతున్న గాయని ఉమ, పోటీ నిర్వహించి ఆమెకు తొలి అవకాశమిచ్చిన సంగీత దర్శకుడు రమేష్ నాయుడు.



ప్రసిద్ధ ఉత్తరాది చలనచిత్ర దర్శక నిర్మాతలు 10 మంది బొంబాయినుండి ఇటీవల మద్రాసు వచ్చిన సందర్భంలో శ్రీ బి. నాగిరెడ్డి ప్రభృతులు వారి గౌరవార్థం విజయ గార్డెన్స్‌లో విందుచేశారు. శ్రీయుతులు మెహబూబ్ ఖాన్, చందులాల్ షా, బి. ఆర్. చోప్రా, హోమీ వాడియా, ఎస్. [illegible], బి. నాగిరెడ్డిగార్లను ఈ చిత్రంలో చూడవచ్చును.

ప్రసిద్ధ దర్శకుడు చేతన ఆనంద్ రూపొందించారు. పైలట్ దేవానంద్. అమ్మడు వోమితాపిన్న. ఆ పైన విమానం విదేశాలకు వెళ్ళినప్పుడు తటసపడేందుకు సీను భామలు నలుగురు ఉంటారు "అంతర్జాతీయ నటుడు" ఐ. ఎస్. జోహార్ హాస్యం చేస్తారు.

ఈ చిత్రానికి దర్శకుడు శంకర్ ముఖర్జీ సంగీత దర్శకుడు మదనమోహన్.

* * *

బిమల్ రాయ్ కొత్త చిత్రం 'పరాఖ్' నిర్మాణం మొన్ననే ఆరంభమైంది. సంగీత దర్శకుడు సలీల్ (మధుమతి) చౌదరి దీనికి కథ వ్రాసిన విషయం పాఠకులకు గుర్తుండి ఉండవచ్చు.

ఈయనలాగే గేయరచయిత శైలేంద్ర, తొలిసారిగా దీనికి సంభాషణలు వ్రాస్తున్నారు. ఆయన సంగీత రచనా, ఈయన గేయరచనా యథాప్రకారం నిర్వహిస్తారు. బిమల్ రాయ్ దర్శకత్వాన తయారౌతున్న ఈ చిత్రంలో వసంత్ చౌదరి మోతీలాల్, [illegible]యాలాల్, నజీర్ హుసేన్, జయంత్ మిశ్ర, లీలా చిట్నిస్ మొదలగు వారు పాల్గొంటున్నారు.

* * *

ఎం. వి. రామన్ దర్శకత్వాన దర్శక నిర్మాత సొహ్రాబ్ మోడీ నిర్మిస్తున్న 'చైలా' చిత్రానికి కూడా నిర్మాణకార్యక్రమం మొన్ననే ఆరంభమైంది. వైజయంతిమాల, రాజ్ కపూర్ ఇందులో నాయికా నాయకులు. సంగీత దర్శకులు శంకర్, జైకిషన్.

* * *

రాజ్ కళా వారు కుటుంబ నియంత్రణం కథా వస్తువుగా నిర్మిస్తున్న చిత్రం ఏక్ కే బాద్ ఏక్ చాలవరకు పూర్తి అయింది. ఇందులో దేవానంద్, రాధాకిషన్, శారద, తరళ పాల్గొంటున్నారు. దర్శకుడు రాజ్ ఋషి సంగీత దర్శకుడు సచిన్ దేవ్ బర్మన్.

* * *

సినీ టెక్నీషియన్స్ ప్రొడక్షన్స్ పేరిట కొందరు సినిమా కారులు కలసి 'హాఫ్ టికెట్' అనే చిత్రం తీస్తున్నారు. కిశోర్ కుమార్, మధుబాల, ఓం ప్రకాశ్ ముఖ్యనటులు. దర్శకత్వం కాళిదాస్ సంగీతం సలీల్ చౌదరి.

డీలక్స్ ఫిలింస్ వారి 'లాజ్ వంతి' ఈ నెల రెండోవారంలో విడుదల అవుతోంది. నర్గిస్ ముఖ్యపాత్ర ధరించింది. బల్ రాజ్ సాహ్నీ, శోభనాజ్, రాధాకిషన్ ఇతర నటులు. సంగీతం బర్మన్, దర్శకుడు నరేంద్రసూరి.

మాంగల్యబలం

'తోడికోడళ్ళు' చిత్రం విడుదల చేసినప్పుడు అన్నపూర్ణావారు ఆ చిత్రంలో కథను నవలగా వ్రాయించి పుస్తకరూపంలో ప్రచురించడం పాఠకులకు గుర్తు ఉండిఉంటుంది. దరిమిలా సారథీవారు 'ఎత్తుకు పై ఎత్తు' చిత్రకథను కూడా అలాగే అచ్చువేశారు. ఆదర్శప్రాయమైన ఈ పద్ధతి ఎందువల్లనో తిరిగి ఎక్కడా అమలుకు రాలేదు. (బ్రిటన్‌లో ఇలా చలచిత్రకథలను నవలలుగా అచ్చువేసే కంపెనీ ఒకటి ఉంది. చదవతగిన పుస్తకాలు చాలా దాని ద్వారా వచ్చాయి.) అన్నపూర్ణావారు ఈసారికూడా తమ కొత్త చిత్రం 'మాంగల్యబలం'లో మాటలను పాటలనుకూడా కలుపుకొని కథలో అమర్చి చక్కని నవలగా అచ్చువేశారు. ఆ చిత్రానికి 'అగ్నిపరీక్ష' అనే బెంగాలీ కథ ఆధారంగా శ్రీ ఆత్రేయ, దర్శకుడు శ్రీ ఆదుర్తి సుబ్బారావు, నిర్మాత శ్రీ మధుసూదనరావు చలచిత్రకథను రూపొందించారు. మాటలు ఆత్రేయ పాటలు శ్రీశ్రీ, కొసరాజు వ్రాశారు. వీటిని యథాప్రకారం ఉంచుతూ ఆయా సన్నివేశాలను కలుపుతూ శ్రీ మధుమూర్తి నవలగా వ్రాశారు. ఆద్యంతం హాయిగా చదివించివేసే ఈ పుస్తకంలో చలనచిత్రంలోని వివిధ సన్నివేశాల ఛాయాచిత్రాలను పుష్కలంగా చేర్చి దీనిని ఆకర్షణీయంగా రూపొందించారు. పుస్తకం 1/16 క్రౌన్ సైజున ఉంది. 160 పుటలు. ఆర్టుపేపరుపై త్రివర్ణ ముఖచిత్రం. వెల 50 నయాపైసలు. ప్రతులు దొరికే చోటు విశాలాంధ్ర ప్రచురణాలయం విజయవాడ-2. ★



చందమామవారి 'సిపాయి కూతురు'లో సిపాయి జయసింగ్ గా గుమ్మడి.

'సతీసుకన్య'

కట్టుదిట్టంగా, బిగువుగా కట్టిన చిత్రకథ, సృజనాత్మక ప్రతిభా సమన్వితమైన కథనశిల్పం, ఆనంద డోలికలలో ఉర్రూతలూగించే సంగీతం. అత్యుత్తమస్థాయి నటన ప్రాణానికి వినుగతించే మామూలు నిడివి, ఈ కళపు పతివ్రతలపట్ల పౌరాణిక పాత్రల పట గౌరవం వగైరాలన్నీ కూడబలుక్కున్నట్టు గైగు హాజరైన చలనచిత్రం చూడదలచుకుంటే అందుకు వెంకటేశ్వరా వారి పౌరాణిక చిత్రం 'సతీసుకన్య' అనేకవిధాల యోగ్యమైన విచిత్రం.

15 వేల అడుగులలో తెమల్చిన (నడుస్తున్న చిత్రాలలో దీనికిది ప్రత్యేకాకర్షణ) ఈ చిత్రంలో చ్యవన సతి సుకన్య తన పాతివ్రత్యాన్ని "చాటుకునే అవకాశములు" కల్పించడం ముఖ్యకృత్యాంతం.

శర్యాతి మహారాజు వేటకి వెళ్ళినందువల్ల, చ్యవనుడు తన పుటని కోంచెం 'ఇసింటా-ఊరి శివారువేపు జరుపుకుని అందులో కూర్చుని ఘోరతపస్సు చేస్తూ ఉంటాడు. రాకుమారి సుకన్య అటువచ్చి' మహర్షి నేత్రాలు చూచి మిణుగురులని భ్రమపడి ఆయన కళ్ళు పొడిచివేస్తుంది. ఈ అపచారంతో పెద్ద ఉత్పాతాలు సంభవిస్తాయి. ఆఫ్రికాలో సింహాలూ, జింకలూ పరుగులు పెడతాయి. వెసూవియస్ అగ్నిపర్వతాలు ప్రజ్వరిల్లి బ్రద్దలవుతాయి. అమెరికాలో తుపానులు విజృంభిస్తాయి. కారణం తెలియడంతో, శర్యాతి మహారాజు తనకుమార్తె సుకన్యను చ్యవనుడికి ఇచ్చి వివాహం చేస్తాడు. (బహుశా లోగడ సుమతి-మాండవ్యుల సినిమా చూసిన) చ్యవనుడు తన భార్య సుకన్యని సాధిస్తూ ఉంటాడు. ఈలోగా స్వర్గంలో దేవగురువు బృహస్పతి, ఇంద్రుడు మొదలగువారి ఎదుట గీతాలు రాయాలు రకం గొంతుకతో బాంబే వారి సంస్కృతిక సంగీతం పాడుతూ. హిలెనీస్ డాన్సు చేస్తున్న చంద్రకళ అనే అమ్మడు, హవిర్భాగాలను (అవి కూజా లాంటి దాంట్లో ఉంటాయిష) దేవతల దోసిళ్ళలో పోస్తూ అశ్వినీ దేవతలకు మటుకు లేదని నిరాకరించడంతో అది తగవై, పగయై కవలలు కినిసి సభవదలి పోవడం జరుగుతుంది. వారు చ్యవన మహర్షి సహాయంతో హవిస్సుకు అర్హత సంపాదించ గోరి భూలోకం వస్తారు. అక్కడ సుకన్య పాతివ్రత్య నిరూపణకు తొలి అవకాశం ఇచ్చి, ఆపైన చ్యవనమహర్షికి పావుగంటసేపు 'కాయకల్ప చికిత్స' చేసి యౌవనం సిద్ధింప చేస్తారు. అంతేకాక జేబురుగడ్డం కూడా తీయించి వేస్తారు. కాని, తుణంతరవాత తనభర్త రూపంలోనే ఉన్న ముగ్గురిలోనూ భర్త ఎవరో గ్రహించడానికి కాళికాదేవి సహాయంతో ప్రయత్నించిన సుకన్యకు, ఆ గడ్డమే కొండగుర్తు అవుతుంది, చ్యవనమహర్షి టికాలూ అవీ చూసి, తెలివైనవాడేనని దేవవైద్యులు ఆయనకు వైద్యశాస్త్రం కూడా ఉపదేశిస్తారు.

అటుపిమ్మట అమరీ నాథ్ కృష్ణకుమారి వెన్నెలలో జోటువిహార షికారులో తియ్యని యుగళగీతం పాడుతారు. వారు ఇలుచేరిన వేళకు, సుకన్య తండ్రి వచ్చి యౌవనుడైన చ్యవనుడిని చూచి అపోహపడి, తన కుమార్తెను శంకించి నిందిస్తాడు. ఆమె అగ్ని పరీక్షకు నిలచినా ఆమోదించలేదు. అశ్వినీదేవతలకు హవిస్సుల విషయంలో చ్యవనుడి సహాయం కావలసి వున్నప్పటికీన్నీ ఆయన తమకోసం యాగం చేయించవలసి ఉన్నదని తెలిసినప్పటికీన్నీ వచ్చి సాక్ష్యం ఇవ్వరు. నారదుడు ఉపాయం చెప్పినమీదట, వాళ్ళని పిలవటానికై శర్యాతి పుత్రికామేష్టి చేస్తానంటాడు. యౌవనుడైన చ్యవనుడు తన అలుపెని పూర్తి నమ్మకం కలుగక పోయినా (తాత్కాలికంగా అంగీకరించికి) ఆయన సెపౌరోహిత్యానికి పెట్టుకుంటాడు. అంతలో ఇంద్రుడు రంగంలోకి వచ్చి రభస చేయడంతో అందరూ సాక్ష్యం సంగతి మరచిపోయి ఇంద్రసుకన్యల యుద్ధం చూస్తూ కూర్చుంటారు. భవాని దేవి నోచాలక, ఇంకో మిసాలాయన కూడా (కోరలు నూసి రాక్షసుడనుకోరాదు. ఆయన యజ్ఞపురుషుడు) సుకన్యవేపు నిలచి ఇంద్రుడితో పోరాడుతాడు. "ముల్లోకాధిపతి" ఇంద్రుడు మూడు లోకాల అధిపతులనూ శరణుకోరి చివరకు సుకన్యతో సంధి చేసుకుని అశ్వినీదేవతలను గుర్తిస్తాడు.

ఇందులో పైన పేర్కొన్నవి కాక, అశ్వినీదేవతల జన్మవృత్తాంతం కూడా పొందుపరచారు. హాస్యంపేరిట మార్గ స్వేషి అనే బహు బరువైన తేలిక పాత్రను

'భరించిన' రమణారెడ్డి, అది కారకతే ఛశ్రీ చేదామన్న దురూహతో నారదుడుగా పద్మనాభం చేసిన అభినయాలు హాస్యాస్పదంగా కనిపిస్తాయి. 'దుష్ట'పాత్రలవల్ల సామర్థ్యం ఉన్న నటులుకూడా ఎలాంటి దురవస్థ పడగలరో దీనివల్ల గ్రహించగలరు. ఇతర నటులుకూడా, ఆయా పాత్రల రూపకల్పనలనుబట్టి వాటి అవధులలో పల కృషి చేశారు. రాజనాల అట్టహాసాలు ఆట్టే లేక పోయినా, ఇంద్రుడు ఈ చిత్రకథాంతాన దెబ్బతినబోతున్నాడని ప్రేక్షకులు పసిగట్టగలరు. అమర్‌నాథ్ సౌమ్య విగ్రహం, నెమ్మది, ఋషిపాత్ర నిర్వహణలో రాణించాయి. ముగ్గురాకుమార్తె సుకన్యగా కృష్ణకుమారి యథోచితంగా నటించింది. రాజుగా మిక్కిలినేని బాగానటించాడు. అశ్వినీదేవతలిద్దరి పాత్రలను కాంతారావు మనోహరంగా ధరించాడు.

మనోహరంగాలేని అంశాలతో సంగీతం చెప్పకోదగది. ఘంటసాల, లీల పాడిన ఒక్క యుగళగీతి, సత్యం పాడిన పద్యాలూ మినహా మిగతా పాటలూ, నేపథ్య సంగీతంకూడా మధుర గాయకుడు, సంగీత దర్శకుడు అయిన ఘంటసాలపట్ల విశేష గౌరవాభిమానాలుగల అందరికీ నిరుత్సాహాన్ని బాధను కలిగిస్తాయి. మనసు చివుక్కుమనిపిస్తుంది. కొన్ని పాటలు ఇంకేదో చిత్రంకోసం చేసినవనిపించాయి. కొన్ని ఘట్టాలలో నేపథ్య సంగీతం మరో తరహా కథలకోసం-ఏ హారర్ చిత్రాలకోసమో రచించి ఉంటారని అనిపించింది.

ఈ చిత్రం దర్శకుడు చంద్రమోహన్, కథను మందకల్యాణి స్వరంలా వేగంగా పరుగులెత్తించలేదు. ఆ మాటకొస్తే, కొన్ని సన్నివేశాలను అతినెమ్మదిగా ఒక్కొక్కటి ఒక్కొక్క పెద్ద చిత్రం అనిపించేలా తీశారు. తరువాత ఏం చెయ్యాలో, అక్కడే ఆలోచిస్తున్నారు అనిపిస్తుంది. రచయిత శ్రీరామ్‌చంద్ (వద్దంటే పెళ్లి) ఇలా అతిగా సాగిన అనేక సన్నివేశాలకు సంభాషణలు వ్రాస్తూనే కథకూడా పూర్తిగా ఆగిపోయే ప్రమాదం ఏర్పడకుండా చాలా కృషిచేశారు. అక్కడక్కడ ఆహ్లాదకరమైన విసుర్లు అందంగా పడ్డాయి.

సెట్‌లూ, ఛాయాగ్రహణం ముఖ్యంగా శబ్దగ్రహణం వంటి వాటిగురించి చెప్పకోకుండా ఉండడం మంచిది. సాధారణంగా ఈ-గ్రహణాలకు ప్రాజెక్టరులోనో, ప్రాసెసింగులోనో, ప్రింటింగులోనో గ్రహణాలు పడుతూ వుంటాయని సాంకేతిక విషయాభిజ్ఞులు తాత్పర్యం. ★

డెమిల్ స్మృతికి సంతాపం

దేశదేశాల చలనచిత్రకారులు, చలనచిత్రాభిమానులూ గతవారం సభలుజరిపి, దర్శకనిర్మాత సిసిల్. బి. డెమిల్ స్మృతికి సంతాపం వెలిబుచ్చారు. భారతదేశంలో దర్శకనిర్మాతలు పలువురు. డెమిల్‌తో తమకుగల పరిచయాలను పేర్కొంటూ ఆయన ప్రతిభా సంపత్తిని, సౌజన్యాన్ని కొనియాడారు.

జనవరి 28వ, క్రైస్తవుడు డెమిల్‌కు హాలివుడ్‌లో-ఏవిధమైన ఆర్భాటం లేకుండా అతి ప్రశాంతంగా అంత్యక్రియలు జరిగాయి.

అసంఖ్యాక బహుమానాలూ, (మోషన్ పిక్చర్ అకాడమీ బహుమతులు రెండు), లక్షలాది అభిమానులూ, ఏకలవ్యశిష్యులూ, అపారమైన కీర్తి... అనేకమైన ధర్మసంస్థలకు నిధులూ కాకుండా కోటీశ్వరుడు డెమిల్ బ్రహ్మాండమైన స్థిరాస్తిని, 70 చలనచిత్రాల చరాస్తిని వదలిపెట్టి వెళ్ళాడు. ఈ ఆస్తిలో ఎక్కువభాగం తన కుమార్తె సీలియా డెమిల్ హార్పర్‌కు ఇస్తూ వీలునామా వ్రాశాడు. తన భార్య కాన్‌స్టన్స్ (85 సం॥లు)కు బాగానే ఆస్తి ఉన్నందువల్ల ఆమెకు తనవల్ల ఆర్థికసహాయం అవసరం ఉండదని అందులో పేర్కొన్నాడు. ★

★ రాజధాని కబుర్లు ★

(5-వ పేజీ తరువాయి)

ఎదుర్కొనే కష్టాలను గమనించిన వారు ఇరవైమందిని నిర్బంధించి నందుకు రక్షకభటశాఖను అభినందించ గలుగుతారు.

ఈ ఇరవైమందిని న్యాయస్థానం ముందుకు కొనిపోయినా, అందరికీ శిక్షపడ్డం జరగదు. చట్టంలోఉన్న లోపాలు, నిందితుడికి అన్ని అవకాశాలు ఇవ్వాలన్న శిక్షాస్మృతి సిద్ధాంతం దారికడ్డంగా వస్తాయి. శిక్షాస్మృతి అంటుంది. 'వందమంది దోషుల్ని తప్పించుకు పోనియ్యి. కాని ఒక్క అమాయకుణ్ణి కూడా శిక్షించకు. ఇది ముఖ్యం' అని.

1957వ సంవత్సరంలో జంటనగరాలలో 8141 నేరాలు జరిగితే 1958లో 2,713 మాత్రం జరిగాయని శ్రీ వేణుగోపాలరావు వెల్లడిచేశారు. అంతేకాదు పట్టుబడి శిక్షింపబడిన వారి సంఖ్య నూటికి 19 నుంచి 25 వరకు పెరిగింది అన్నారు ఆయన. సైకిలు దొంగతనాల విషయంలో మాత్రం తగ్గుదల కనిపించలేదని, దానికై ప్రత్యేక విభాగం తెరువబడిందని ఆయన తెలిపారు.

నేరపరిశోధనశాఖ అసిస్టెంటు కమీషనరుగా పనిచేసిన శ్రీ ఎన్. నరసింహయ్యగారికి ప్రెసిడెంటు మెడల్ దొరికిందని ఇదివరలో ఈ 'కబురు'లో తెలిపాను.

నేరపరిశోధనశాఖ ఈ సంవత్సరం ఇంకా అభివృద్ధి సాధిస్తుందని, శ్రీ వేణుగోపాలరావు కొత్తపదవిలో ఇంకా రాణిస్తారని ఆశిస్తున్నాం.

'స్టేజి విలనులు': (5) 'గ్రేడ్ ఏ ఏక్టర్'!

పూర్వం ఒకప్పుడు నరసింహుడి పాత్ర ధరించిన ఒక నటుడు నటనోద్రేకంలో ఒళ్లు మరచి హిరణ్యకశిపుడి పాత్రధారిని రంగస్థలంపై చంపివేశాడుట! దీనికి శిక్షగా రామాయణ నాటకంలో దశరధపాత్ర ధరించమన్నారట. అడవులకు పోయిన రాముని వియోగాన్ని భరించలేక అతడు రంగస్థలంపైననే మరణించాడట.

ఇటువంటి ప్రమాదం తెలుగు రంగస్థలంమీద మనకు ఎదురౌతుందని మనం బాధపడనక్కరలేదు. నేటి మన నిర్వచనం ప్రకారం మహానటుడు అంటే బాగా నటించినట్లు కనపడేవాడు అని అర్థం. పాతిక సంవత్సరాల క్రితం ఫోటోలు తియ్యడం నేర్చుకొన్న విలేజి ఫోటోగ్రాఫర్లుకూడా ఫోటో తీసుకోడానికి వీలున్నంతసేపు ప్రతీ పోజులోను నిలబడేవాడు 'గ్రేడ్ ఏ' ఏక్టరు.

మనకు అత్యంత సన్నిహితులెవరైనా మరణిస్తే, మనకు కంఠందగ్గర ఏదో అడ్డుపడుతుంది: కన్నీళ్ళు కంటినుండి వెలువడక పూర్వమే ఇంకిపోతాయి. ప్రపంచమంతా శూన్యమైపోతుంది; కళ్ళు చీకట్లు కమ్ముతాయి. కాని 'గ్రేడ్ ఏ' ఏక్టర్ ప్రేయసి చనిపోతే మేనక సమక్షంలో విశ్వామిత్రుడి (రవివర్మ ఫ్రేండు) పోజుపెట్టి 'హా! ప్రేయసీ...' అంటూ ప్రారంభిస్తాడు. అదే నటన అంటాడు అతడు. అదే నటన అంటారు నటన అంటే ఏదో తెలియని ప్రేక్షకులు. ఈ నటనకే 'ఆకాశవాణి' ప్రతిధ్వనిస్తుంది.

'భయం' నాటకం గత సంవత్సరం ఇక్కడ సరోజినీదేవి హాలులో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యాన ప్రదర్శించబడింది. పిచ్చిదాని పాత్రధారిణి చక్కగా నటించింది. సందేహం లేదు. కాని నటనకు బహుమానం అంటూ ఇస్తే, నటన వ్యక్తంకాకుండా నటించిన డా. రాజారావుకి ఇవ్వాలి.

మీరు 'గ్రేడ్ ఏ' ఏక్టరుగా రూపొందితే, మీ అభిప్రాయాలు మార్చుకోండి. మీపై 'గ్రేడ్ ఏ' ఏక్టర్ల ప్రభావం ప్రసరిస్తే, తప్పించుకోండి మన రంగస్థలం అభివృద్ధిచెందకుండా ఉంచే దానికి అసలు కారణం 'గ్రేడ్ ఏ' ఏక్టర్లు.

ఇది 'స్టేజి విలన్ నంబర్ ఫైవ్: గ్రేడ్ ఏ ఏక్టర్' ఉదంతం. ★

ఎంతమంది పిల్లలు మీకు?

(50 వ పేజీ తరువాయి)

వుండాలంటే, అవలంబింపవలసిన ఏకైక మార్గమే. ఈ ఫామిలీ ప్లానింగ్. దంపతులు ఏదో, ఒకరిద్దరు పిల్లల్నిమాత్రం పుట్టేలా నిర్ణయం చేసుకోవాలంతే! హాస్పిటల్స్‌లో ఈ శాఖ డాక్టర్స్ నడిగితే వాళ్లు సలహాలూ- మందులూకూడా ఇస్తారు.

ఇది ఇలావుంటే చాదస్తులు కొందరు బయలేరారు! "పిల్లలు పుట్టకుండా, ఈ మందులూ మాకులూ వాడితే జబ్బులు చేస్తాయి- రెండోది, పిల్లలు దేవుడు మాకు పులకిచ్చే వరాలు!" అంటూ ఉపన్యాసం మొదలెడతారు! డాకర్స్ కేవలం పిచ్చిబట్టి తోచక ఇలాంటివి కనిపెటారనే వాళ్ళ, విశ్వాసం! అంతేకానీ అంతులేని సమస్యా పరిష్కారాలకిది మార్గమని వాళ్లకుచెప్పినా వినిపించుకోరు! ఇక రెండోరకం వాళ్ళున్నారు. వాళ్లవాదం ఏమిటో తెలుసా? "ఒకరిద్దరు పిల్లలుమాత్రమే అయితే-వాళ్లు లేదా అయితే- ఇకపిల్లలెలా?" అంటారు! ఓ పదిమంది పిల్లలు పుట్టే దక్కనివాళ్ళ సంగతేమంటారు? ఒక్కొక్కరి అదృష్టాన్ని బట్టివుంటుందది! వారివాదం అంతవరకేగానీ కష్టపడే స్త్రీలసంగతి వాళ్లకక్కర్లేదు! పైవారిలో స్త్రీలుకూడా లేకపోలేదు... ఎక్కువమంది స్త్రీలే! ఇలా అని ఏమందు అంటే అది వాడకూడదు. డాక్టరు సలహా తీసుకువాడాలి.

ఈమధ్య ఈ ఫామిలీ ప్లానింగ్ విషయం మీద చర్చలు జరిగాయి! నేనోసారి మాబంధువు లావిడతో (కొంచెం పెద్దావిడ లెండి.) వాళ్లకూతురి విషయంలో డాకరి సలహా తీసుకోమని చెప్పాను నోరూరుకోక! ఇక చూసుకోండి... తారాజువ్వలా లేచిందావిడ. "చాలేవే! మహా చెప్పొచ్చావ్! ఇంతా దానికి ఆరుగురేకదా పిల్లలు? బిడ్డలు ఎక్కువగావుంటే అదృష్టం అందరికీ వుంటుందా? ఇదో వేషం నేర్చుకొంటున్నారు మీరంతా! ఇంగ్లీషు చదువు-చదివొచ్చి- ఇలాంటి పనికిమాలిన సలహా లిస్తున్నారన్న మాట!...పిల్లలంటే నామోషీ అయిపోయిందా?..." అంటూ రష్యన్ స్పుత్నిక్ వేగంతో ఓగంటసేపు (వ్యాయామంటే అదో సీరియల్ గా మారుతుకది) ఉపన్యాసం ఇచ్చి చక్కాపోయిందావిడ! ఆదెబ్బ తటుకోటానికి మూడురోజాలు పట్టింది నాకు! ఇలాంటి సలహాలూ, పెద్దవాళ్ళకు మాత్రమే నచ్చవ్ కాబోలు_అనుకుని దురభిప్రాయ పడ్డాను నేను! కాని అదికూడా మారిపోయింది మధ్యజరిగిన ఓ సంఘటనతో.

నా డాక్టర్ ఫ్రెండ్ ఒకామెను ఈ మధ్యనే ఈ ఫామిలీ ప్లానింగ్ డాక్టర్ గా వేశారు. సరే ఇక డ్యూటీ అదే కాబట్టి ఆవిడ వచ్చే పేషెంట్సు కందరికీ మామూలుగా సలహా లిచ్చేది. తర్వాత పాటించినా పాటించకున్నా తెలుపివెళ్ళేవారట. అందరూ. ఓరోజలాగే ఓ ఏడుగురు పిల్లలతల్లి- (చాలావీక్ గా వుందట) ఆమె భర్తా వచ్చారుట! సరే-నా ఫ్రెండ్ తన పొజిషన్ చెప్పింది! ఇక చూసుకోండి-ఆ దంపతులు అది హాస్పిటల్ అనిగాని, చుట్టుప్రక్కల మనుషులున్నారనిగాని లెక్కచెయ్యకుండా. నానామాటలు అని చివరికి ఇలాంటి పనికిమాలిన డాకరు పని మానుకోండంటూ." ఓ సలహా పారేసి మరీ వెళ్లారుట! ఈ సంగతి చెప్పి నా ఫ్రెండ్ అదే పనిగా నవ్వటం మొదలెట్టింది. నా కాశ్చర్యమేసింది. ఆ వచ్చినవాళ్ళిద్దరూ, అజ్ఞానులా అంటే కాదు-మరిదేమిటి? అంటే మూర్ఖత్వం! సుఖపడ్డానికి మార్గాలుచూపినా- వాటిజోలికి పోనివాళ్లను ఏమనుకోవాలి?

ఓ వేపు కేశనాయకులంతా "జనాభా పెరిగిపోతోంది. దేశంలో ఆర్థిక పరిస్థితులు అన్యాయంగా వున్నాయి!" అంటూ గొంతులు చించుకుంటూ అరుస్తున్నారు! మరో వేపు జనం ఆ కాస్సేపు తలలూపి ఆమాటలుఅక్కడే దులిపేసుకు చక్కా వస్తున్నారు! ఇక జనాభా తగ్గమంటే ఎలాతగ్గుతుంది? విదేశాల్లోలా మనమూ, మనపిల్లలూ ఆరోగ్యంగా, ఆయుష్మంతులుగా ఉండాలంటే ఎలా కుదురుతుంది. అవ్వా కావాలి బువ్వా కావాలి అనే పద్ధతి వదిలెయ్యాలి! ఈపద్ధతి అర్థం చేసుకుని ఎవరైతే అవలంబిస్తారో, నిజానికి వాళ్ళ జీవితాలెంతో ఆనందమయంగా సాగుతాయి. తీరావ్యాసం చదివి-"ఇదేమిట్రా బాబూ! రేడియోసిలన్ అడ్వర్టైజ్‌మెంట్స్‌లావుంది!" అనుకోకుండా కాస్త తాపీగా ఆలోచించి ఆచరిస్తే, దేశసేవమాట దేవుడెరుగు. ముందు సంసారాలూ - స్త్రీ పురుషులూ సుఖంగా, సంతోషంగా వుండగలరు - అలాగే ఆశిదాం కూడా! ★

[వచ్చేవారం మరోవ్యాసం:
"ముచ్చటగా ముగ్గురు"]

(16-వ పేజీ తరువాయి)

ఎప్పటికీ.

పట్టాలు దాటివచ్చేశాను.

ఇంటికి వచ్చేసరికి వేపచెట్టు క్రింది అరుగులమీద నలుగురైదుగురు మేష్టర్లూ, పదిమంది పిల్లకాయలూ సమికూడి మాట్లాడుకుంటున్నారు.

వెన్నెలలో వేపచెట్టు మెరిసిపోతున్నది.

మళ్లీ యెప్పుడైనా యీవేళకి రాండి మేష్టారు" అన్నారు పిల్లకాయలు.

'వస్తాను' అని చెప్పాను. వెళ్ళిపోతున్నాను కాబట్టి వాళ్ళకూడా కోపం పోయింది. అవును మరి వెళ్లిపోతున్న వాళ్ళను చూస్తే ఏసందర్భంలోనైనా యెవరికైనా ఆర్ద్రత కలుగుతుంది.

పిల్లకాయలు వెళ్ళిపోయారు.

అందరూ సిగరెట్టు ముట్టించారు మేష్టర్లు. మంచుపడుతోంది. అయినా యెంతో సేపు యెన్నెన్నో విషయాలు, మంచివి, అసహ్యమైనవి మాట్లాడారు. కూచుని విన్నాను. ఏమీ మాట్లాడలేదు. ఎందుకు నేను వెళ్ళిపోతున్నాను, వీళ్ళను మన్నించి: వీళ్ళు నన్ను కొంత బాధ పెట్టారు. మంచుకురుస్తున్నది. వీళ్ళు మంచివాళ్లే. అయితే బలహీనులు. నేనుమాత్రం. నేనూ అంతే - ఇప్పుడా ఆ అమ్మాయి ఏమని ఆలోచిస్తూ వుంటుంది.

కాసిన్ని పద్మగన్నేరు పూలు కోసుకొచ్చుకుంటే బావుండును.

ఈ వెన్నెల్లో, ఈ మంచులో.

పన్నెండు గంటలకి మేష్టర్లంతా వెళ్ళిపోయారు.

ఆరుబయట పడుకున్నాను. వెన్నెలంటే నాకు ఇష్టం. మంచుకురుస్తోంది. పక్కంతా చలపడింది. అయినా అలానే పడుకున్నాను. ఒకమంచిని అనుభవించేందుకు వొకచెడును గూడా భరించాలి. వెన్నెలంటే నాకు ఇష్టం. అందుకని మంచును కూడా భరించాల్సిందే. పాములన్నీ పాయిం కాలమే పిల్లకాయలు పట్టిపోయినారు.

మూడుగంటలప్పుడు హెడ్‌మాష్టరుగారి వద్దనుంచి ప్యూన్ వచ్చిలేపాడు. ఆయన కూడా పక్కవూరికి వస్తారట.

స్టేషనుకి చేరుకునేసరికి మూడున్నరైంది. స్టేషన్ నిద్రలేవటానికి అప్పుడే ప్రయత్నిస్తోంది.

కుర్చీలూ, బల్లలూ అన్నీ నిద్రపోతున్నాయి.

దూరంగా వెన్నెల మంచుతో కలిసి దగ్గిరగా వెన్నెల చలి.

మూడుగంటల మైలీనుంచీ రైలువస్తుంది.

బందమెళ్లు ఇక్కడినుంచి నడచిన తర్వాత నేను దిగుతాను.

స్టేషన్లో కాంటిన్ దివదర్యపు పూను కుంది.

రైలువచ్చింది, రైలుకదిలింది.

దూరంగా వెన్నెల మంచులో ఊరు కనకపడి పోయింది.

చెక్కల వంతెన. చిటికేశ్వరపు చెట్టు, రెండుకొండలు, అనుభూతులు. అనుభూతులు దూరంగా దూరంగా, వెనక్కు, రైలు ముందుకూ పోతూనేవుంది. తెల్లవారుతుంది. సూర్యుడుదయిస్తాడు. మంచు విచ్చుకుంటుంది. మళ్ళీ మామూలు ప్రపంచంలోకి మామూలు మనిషిగా మామూలుగా నే వెళతాను. కాని యీ గడచిన మంచు కురిసిన రాత్రి. ★

మెదడుకు మేత

రాముఁ డెవ్వానిచే రావణు మర్దించె?

వరవానుదేవుని పట్న మేది?

రాజమన్నారుచే రంజిల్లుకర మేది?

వెలయఁ గానుక పంట విత్తదేది?

అలరంభ కొప్పులో నలరు పూదండేది?

వరవారి నవ్వించు జాణ యెవరు?

సీత పెండ్లికి నోలి చేసిన విల్లేది

శ్రీకృష్ణుఁ డేయింటఁ జెలఁగుచుండు

అన్నిటికిఁ జూడ నై దేసి యక్షరములు

ఈవలావల కూడిన యేకవిధము

చెప్పునాతడు భావజ్ఞశేఖరుండు

చెప్పలేకున్న నగుడు మీ చిన్ననగవు.

జవాబులు


లోకముకలో, రంగనగరం,

లకోలకోల, జంబీరబీజం,

మందారదామం, వికటకవి,

వంచావ్యచావం; నందనదనం.

—అయ్యగారి సుబ్రహ్మణ్యం]



Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



పల్లీయులు

—ఫొటో: శ్రీ హెచ్. ఆర్. రామారావు]

